తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
WWW.VAARTHA.COM విశాఖపట్నం

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

epaper.vaartha.com : fb.com/vaartha Digital

5-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 94 పేజీలు: 16 వెల: 6.50

ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు కొత్త చరిత్రను సృష్టించాయి. బెంగాల్‌లో అత్యధిక పోలింగ్ శాతంతో పాటు అనూహ్యంగా బిజెపి అఖండ విజయం సాధించి చరిత్రను మార్చగా, కేరళలో హ్యాట్రిక్ సాధించాలనుకొన్న పినరయ్ విజయన్ నాయకత్వంలోని ఎల్డీఎఫ్‌ను మట్టి కరిపించి యుడిఎఫ్ అధికారంలోకి వచ్చింది. తమిళనాట విజయ్ నాయకత్వంలో టివికె అధిక సీట్లు సాధించి మరో చరిత్ర సృష్టించింది. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, తమిళనాడు సిఎం స్టాలిన్ ఓడిపోవడం మరో విశేషం.




## ఇద్దరు సిఎంలు ఘోర పరాజయం

భవానీపూర్‌లో మమత

కొళత్తూరులో స్టాలిన్ ఓటమి 2

| పశ్చిమబెంగాల్ | 293 | తమిళనాడు | 234 | అసోం | 126 |
|---|---|---|---|---|---|
| బిజెపి | 206 | డిఎంకె | 59 | ఎన్‌డిఎ | 102 |
| టిఎంసి | 77 | టివికె | 107 | యుపిఎ | 21 |
| కాంగ్రెస్ | 2 | ఎఐడిఎంకె | 46 | ఎఐయుడిఎఫ్ | 2 |
| ఇతరులు | 4 | ఇతరులు | 9 | ఇతరులు | 1 |



సోమవారం ఫలితాల అనంతరం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విజయోత్సవాల్లో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

# బెంగాల్‌లో విరిసిన కమలం

## ఐదింట మూడు రాష్ట్రాల్లో బిజెపికే పగ్గాలు

### కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మళ్లీ ఎన్నార్సీబిజెపి

### కేరళంలో ఎల్డీఎఫ్‌కు బ్రేక్.. యుడిఎఫ్‌కు మద్దతు

### అసోంలో హ్యాట్రిక్ సాధించిన బిజెపి

**న్యూఢిల్లీ, మే 4:** దేశంలోని ఐదురాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతోపాటు రెండు రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుచేయడం, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్ఆర్‌సితో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరుగుతోంది. గత ఎన్నికల తరహాలోనే బిజెపి వ్యూహాత్మకంగా బెంగాల్‌లో పావులు కదపడంతో ప్రస్తుత సీఎం మమతా బెనర్జీని సైతం మట్టికరిపించింది. మొత్తం 294 స్థానాల్లో 200కుపైగా స్థానాలు గెలుచుకుని బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 15 ఏళ్లపాటు అప్రతి హతంగా పాలించిన మమతా బెనర్జీ ప్రాభవానికి ఇపుడు బెంగాల్‌లో తెరపడింది. >>2



# తమిళనాట విజయ్ విహారం

### 107 స్థానాలతో అతిపెద్ద పార్టీగా టివికె

### సర్కార్ ఏర్పాటుకు సిద్ధం

**చెన్నై, మే 4:** పార్టీప్రారంభించిన రెండేళ్లలోపే అప్రతిహత విజయాన్ని సాధించి టివికె విజయ్ తమిళనాడులోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. తన చిట్టచివరి సినిమా జననాయగన్ విడుదలకానీయకుండాజరిగిన ప్రయత్నాలు, ప్రచారంలో అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం, సిబిఐ విచారణలు, హైకోర్టు, సుప్రీంకోర్టులవరకూ వెళ్లినప్పటికీ మొక్కవోని దీక్షతో >>2

## అసోం, పుదుచ్చేరిలో అవే 'డబుల్ ఇంజిన్'లు

హ్యాట్రిక్ సాధించిన అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ 2



## 'చేతి'లోకి కేరళం

ఒక్క కాంగ్రెస్‌కే 63 సీట్లు

# మంచినీటి ఎద్దడి రానివ్వొద్దు

### నీటి సరఫరా కోసం జిల్లాకు రూ. కోటి

### అదనపు వాహన రిజిస్ట్రేషన్ అథారిటీగా డీలర్లు

### ప్రభుత్వ సేవల్లో ఎఐ వినియోగంపై సలహా మండలి

### వివిధ శాఖలపై ఆర్టీజిఎస్ నుంచి సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ.1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. బోర్లు కూడా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు సీఎం ఆమోదాన్ని తెలియచేశారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి అయ్యేలా చూడాలని సిఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సిఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌరసేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత పెంచేందుకు, సమర్ధంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని సిఎం సూచనలు చేశారు. మైనింగ్ కార్యకలాపాలను సమర్ధంగా నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసి ఎపిలోనూ అమలు చేసేలా చూడాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలకు ఉపశమనం కలిగేలా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛంధ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్ లైన్లోనే**

ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలు మెరుగ్గా అందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో మెరుగైన ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ కనెక్ట్ అనేది కీలకమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని, క్రెడిబిలిటీని పెంచేలా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టుగా పనిచేయాల్సిందేనని ముఖ్యమంత్రి సూచించారు. పంటలకు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్ ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్ అధికారులను సిఎం ఆదేశించారు.

ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజుల పాటు, హెచ్ఓడీలు 6 రోజుల పాటు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు 7 క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో >>2



లారీ కిందకు దూసుకెళ్లిన అంబులెన్స్

## శ్రీకాళహస్తి వద్ద ఘోర ప్రమాదం

### ఆగిఉన్న లారీని ఢీకొన్న అంబులెన్స్

### బెంగాల్‌కు చెందిన నలుగురు మృతి

**శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని నాయుడుపేట-పూతల పట్టు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు మృతి చెందారు. శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఇబ్రహీం అందించిన సమాచారం ప్రకారం జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఓ లారీని అంబులెన్స్ వెనుక నుంచి ఢీకొనటంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా ఒకరు ఆసుపత్రికి తరలి >>2

## మళ్లీ 'నక్ష' సర్వే

### ఇక ప్రతి ఇంటికి ప్రత్యేక ప్రాపర్టీ కార్డు

**విజయవాడ,మే 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజల ఆస్తులకు పటిష్ఠమైన భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి కుటుంబానికి చెందిన ఇళ్లు, స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలతో కూడిన ప్రాపర్టీ కార్డులను జారీ చేయాలని నిశ్చయించింది. ఇందుకోసం గతంలో మధ్యలోనే నిలిచిపోయిన "నక్ష" (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించనుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ సర్వేను పునః ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామాల్లో స్వామిత్వ పథకం తరహాలోనే పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఆస్తులను ఆధునిక డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఉపయోగించి సర్వే చేయాలని కేంద్రం 2024లో 'నక్ష' ప్రాజెక్టును ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాలను ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాకినాడ, ఏలూరు, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కుప్పం, అనంతపురం వంటి తొమ్మిది నగరాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ నగరాల్లో సర్వే >>2

## ఒమన్‌లో చిక్కుకొన్న మహిళను ఆదుకొంటాం - సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** ఒమాన్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లా మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. వయలపాడు గ్రామానికి చెందిన దూదేకుల షహనాజ్‌ను ఉద్యోగం పేరుతో అక్కడ నిర్బంధించారు. ఖర్చుల పేరుతో ఏజెంట్ కార్యాలయం రూ. 2 లక్షలు డిమాండ్ చేసింది. షహ్నాజ్ స్వదేశానికి తిరిగి రావాలని ప్రయత్నించింది. గత ఏడాది నవంబర్‌లో ఆమె ఉద్యోగం కోసం మస్కట్ వెళ్లింది. అయితే ఉద్యోగం నచ్చక తిరిగి స్వదేశానికి రావాలనుకుంది. కానీ షహనాజ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. భర్త అబూబకర్ ద్వారా ఏపీఎన్ఆర్టీకి ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీఎన్ఆర్టీ సొసైటీ వెంటనే స్పందించింది. ఏపీఎన్ఆర్టీ సొసైటీ సాయంతో ఎంబసీకి లేఖ రాసింది. పోలీసుల జోక్యంతో ఏజెంట్లతో చర్చలుజరిపారు. ఖర్చులు >>2

## విద్యార్థులకు రాగిజావ మరో మూడేళ్లు - మంత్రి లోకేష్

**విజయవాడ,మే4, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026-29 కాలానికి ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులు చేసి ఎక్కువ మంది విద్యార్థులకు రుచికరమైన, శుచిగా భోజనం అందించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక పర్యవేక్షణ వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్‌తో కాలపరిమితి ముగిసింది. విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే ఉద్దేశంతో మరో మూడేళ్లు కొనసాగించాలని విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ. 329 కోట్లు

### కేంద్రమంత్రి పెమ్మసాని ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు



**విజయవాడ, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ. 369.20 కోట్ల మంజూరు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 33 వేల ఎకరాల ఆయకట్టుకు, 33 గ్రామాల ప్రజలకు ఆసరాగా మారుతుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారి గుంటూరు ఛానల్ ఆధునికీకరణ ప్రతిపాదనకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం రూ. 369.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా సోమవారం ప్రకటించింది. దీంతో నీటి సమృద్ధి పెరిగి తాగునీటి వ్యవస్థ వృద్ధి చెందుతూ వ్యవసాయానికి మరింత ఉపయోగపడబోతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా రైతాంగం ఆనందోత్సాహాలు వెలిబుచ్చుతున్నారు. గుంటూరు జిల్లాలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గుంటూరు ఛానెల్ ఆధునికీకరణ పనులకు రూ. 369.20 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతి లభించింది. కృష్ణా డెల్టా సిస్టమ్‌లో భాగంగా 0 నుండి 47 కి.మీ వరకు లీడింగ్ ఛానల్ మరియు డిస్ట్రిబ్యూటరీలతో కూడిన సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి నం.217, తేదీ 04052026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది...

ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లాలో సాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసి, రైతులకు స్థిరమైన నీటి సౌకర్యాలను పెంచుతుందని తెలిపారు. కాలువ ఆధునికీకరణతో నీటి వినియోగ సామర్థ్యం పెరిగి, వ్యవసాయ ఉత్పాదకతకు పెద్ద ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ గుంటూరు ఛానల్ ఆధునికీకరణ నిమిత్తం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కూడా కృషిచేశారు. కృష్ణా డెల్టా ప్రాంతంలో నీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చే ఈ ప్రాజెక్ట్, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో కీలకంగా మారుతుందని తెలిపారు. "రైతుకు నీరు అందితేనే అభివృద్ధి సాధ్యం.. ఈ ప్రాజెక్ట్ ఆ దిశగా కీలక అడుగు" అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు ప్రాంతానికి ఈ కీలక ప్రాజెక్ట్ మంజూరుచేసినందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య >>2

5-5pg2ExHMNWJQE.qxd:5-5pg2ExHMNWJQE.qxd 1/1/02 7:30 AM Page 1





సోమవారం న్యూఢిల్లీలో విజయోత్సవాల్లో తరుణ్‌చుగ్ తదితరులు

# బెంగాల్‌లో విరిసిన కమలం

>> అదేవిధంగా కేరళంలోని ఎల్డీఎఫ్ కూటమి జైత్రయాత్రకుసైతం బ్రేక్‌పడింది. కేరళంలోని ఓటర్లు ఈసారి కాంగ్రెస్ భాగస్వామ్యం ఉన్న యుడిఎఫ్ కూటమికి జైకొట్టారు. ఇక్కడ 140 స్థానాల్లో కాంగ్రెస్‌కూటమికి 99 స్థానాలు, సిపిఐఎం 26స్థానాలు, ఐయుఎంఎల్ 22స్థానాలు, సిపిఐ ఎనిమిది, బిజెపి మూడు ఇతరులు 18 స్థానాలు గెలుచుకున్నారు. యుడిఎఫ్‌కూటమి ప్రభుత్వం ఏర్పాటుదిశగా అత్యధిక స్థానాలు గెలిచి మ్యాజిక్‌మార్క్‌ను సులువుగా దాటేసింది. కేరళలో ఎల్డీఎఫ్ ఓటమి చవిచూసినా సీఎం పినరయి విజయన్ మాత్రం ధర్మదంస్థానంలో గెలుపొందడంతో కూటమి ఊరట చెందింది. ఇక తమిళనాడులో అయితే 1996నుంచి అప్రతిహతంగా వస్తున్న డిఎంకె ప్రభుత్వాన్ని ఏడాదిక్రితం పార్టీనిస్థాపించి తమిళనాట విస్తృతంగా పర్యటనలుచేసిన సినీ నటుడు విజయ్ స్థాపించిన కొత్త పార్టీతో తొలిసారే సీఎం అయ్యేవిధంగా విజయం సాధించారు. 234 స్థానాల్లో మొత్తం టివికెకు 106 స్థానాలు, డిఎంకెకు 56, ఎఐఎడిఎంకెకు 50, కాంగ్రెస్‌కు ఐదు, బిజెపి ఒకటి, ఇతరులు 16 స్థానాల్లో గెలిచారు. తమిళనాడులో డిఎంకెకు ఘోరపరాభవం తప్పలేదు. ఇటీవలే పార్టీలోచేరిన ఎఐఎడిఎంకెనేత మాజీసీఎం పన్నీర్‌సెల్వం గెలవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్టాలిన్ కుమారుడు చేపాక్‌లో విజయం సాధించాడు. అయితే పార్టీ మాత్రం రాష్ట్రంలో దెబ్బతిన్నదనే చెప్పాలి. అస్సాంలో బిజెపి సీనియర్‌నేత ప్రస్తుత సీఎం హిమంతబిశ్వశర్మ సారథ్యంలోనే బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో మేజిక్ మార్కు ను అధిగమించి 102 స్థానాలు సాధించింది కాంగ్రెస్‌పార్టీ 19 స్థానాలకే పరిమితం అయితే ఇతరులు 3స్థానాల్లో గెలిచారు. తొలినుంచీ కూడా తన విజయంపై ధీమాగా ఉన్న హిమంతశర్మ తనదైనశైలిలో ముందుకు దూసుకుపోవడం వల్లనే విజయం సాధించింది. వరుసగా మూడోసారి సీఎం అయ్యే అవకాశాలు ఆయనకే ఎక్కువగా ఉన్నాయి. ఇక పుదుచ్చేరిలో ఎన్‌ఆర్‌కాంగ్రెస్ అధినేత రంగస్వామితోపాటు బిజెపి కలిసి పోటీచేసింది. మొత్తం 30 స్థానాల్లో ఇప్పటికే 16స్థానాలు పైబడింది. కాంగ్రెస్ ఆరుస్థానాలకే పరిమితంకాగా ఆరుగురు ఇతరులు కూడా గెలవడంతో ఎన్నార్సీ బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ఏర్పాట్లు ముమ్మరంచేసుకుంటున్నది.

# మళ్లీ 'నక్ష' సర్వే

>> ప్రక్రియ కొంతవరకు జరిగినా, రికార్డుల నమోదు, మ్యాపింగ్ వంటి కీలక పనులు పూర్తికాలేదు. దీంతో వాస్తవ గడువు ముగిసినప్పటికీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి ఆస్తి యజమానికి ఒక ప్రాపర్టీ కార్డు లభిస్తుంది. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలు (విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు) సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా పూర్తవుతాయి. అంతేకాకుండా, ఈ కార్డులను ప్రామాణికంగా చూపి బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు, మున్సిపల్ అధికారులకు తమ పరిధిలోని ఆస్తులపై స్పష్టమైన సమాచారం ఉండటంతో నగర ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సులభతరం అవుతుంది. త్వరలోనే ఈ సర్వే పునఃప్రారంభంపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రానుంది.

# విజయ్ విహారం

>> విజయ్ ముందుకు సాగి విజయం సాధించారు. పార్టీకి బలమైన కేడర్ ఉండటం, పార్టీకి కర్తకర్మక్రియ అన్నీ తానే అయి ముందుకునడిపించిన విజయ్ ముందుకుసాగారు. మొత్తం 38 జిల్లాల్లో కేవలం 10 లోపే జిల్లాల్లోపర్యటించినప్పటికీ తమిళనాడు ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. హోరాహోరీ పోరులో అతిరథమహారథులను టివికెకు చెందిన ప్రాముఖ్యంలేని నేతలు ఓడించి రికార్డులు సాధించారు. తక్కువ ప్రచారంతో ఎక్కువమందిని ఆకర్షించేటట్లు తన వ్యూహాలను అమలుచేసి విజయ్ విజయం సాధించారు. పేరుకు తగినట్లుగానే పోటీచేసిన రెండుస్థానాల్లోకూడా గెలిచారు. డిఎంకె కాంగ్రెస్‌కూటమి74 స్థానాలు గెలిస్తే టివికె 107 స్థానాలు గెలిచి ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించింది. అన్నా డిఎంకె కూటమి 53 స్థానాలకే పరిమితం అయింది. మొత్తంగాచూస్తే టివికె ఏడాదిలోపే పుట్టిన పార్టీ అయినప్పటికీ తమిళనాట 48 ఏళ్ల ప్రాంతీయ పార్టీలకు చెక్‌పెట్టి ఇపుడు పాలనపగ్గాలు చేపడుతోంది. ఇది కేవలం విజయ్‌కే సాధ్యం అనిపించే విధంగా ఆపార్టీ విజయం సాధించింది.

# చరిత్ర సృష్టించిన బిజెపి

## ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారు: ప్రధాని మోడీ

## గంగోత్రి నుంచి గంగాసాగర్‌దాకా వికసించిన 'కమలం'

**న్యూఢిల్లీ, మే 4:** ఐదురాష్ట్రాలప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని, బెంగాల్‌లో 93శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు నమోదుచేసారని ప్రధానిమోడీ వ్యాఖ్యానించారు. ఐదురాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడురాష్ట్రాల్లో బిజెపి ప్రభంజనంపై ఆయన హర్షంప్రకటించారు. ప్రత్యేకించి బెంగాల్ విజయంపై బిజెపి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఐదురాష్ట్రాల ఫలితాల్లో బిజెపి మూడు రాష్ట్రాల్లో విజయంపై మోడీ బిజెపి కేంద్రకార్యాలయంలో జరిగిన సంబరాల్లో పాల్గొని ప్రసంగించారు. సాంప్రదాయ పంచెకట్టుతో పార్టీ ఆఫీసుకువచ్చిన మోడీ గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్‌నుంచి బెంగాల్‌వరకూ గెలిచామని, గంగానది ఆశీర్వాదంవల్లే ఈ విజయాలు వచ్చాయన్నారు. బ్రహ్మపుత్ర ఆశీర్వాదంతో అస్సాంలోకూడా హ్యాట్రిక్ విజయం సాధించామన్నారు. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలు అమలుచేసామని, బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుందని, ఇకనుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని అన్నారు. సుపరిపాలన అందించినందువల్లనే ప్రజలు మాకు పట్టం కట్టారని, రాష్ట్రాలు అభివృద్ధిచెందాలంటేబిజెపి ఉండాలని ప్రజలు బలంగా విశ్వసించారని అందుకే అద్వితీయ విజయాలను బిజెపికి అందిస్తున్నారని మోడీ అన్నారు.బెంగాల్‌లోప్రజాశక్తి గెలిచిందన్నారు. బెంగాల్‌లోని ప్రతి ఒక్కరికీ తాను తలవంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్నివర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం అందించేవిధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని మోడీ హామీ ఇచ్చారు. బిజెపి కేంద్ర కార్యాలయంలో బెంగాల్, అస్సాంలలో బిజెపి విజయంపై పార్టీపెద్దలు సంబరాల్లో పాల్గొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌తోపాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, జెపినడ్డా తదితరులు మొత్తం హాజరయ్యారు. పార్టీకేడర్ కూడా ఉత్సాహంతో బాణాసంచాలకాల్చి బిజెపి విజయసంబరాలను కేరింతలతో నిర్వహించారు.

# అసోం, పుదుచ్చేరిలో అవే 'డబులింజిన్'లు

## హ్యాట్రిక్ సాధించిన అసోం సిఎం హిమంత బిశ్వశర్మ

**గువాహతి/పుదుచ్చేరి, మే 4:** ఈశాన్యరాష్ట్రం అసోంలో హిమంతబిశ్వశర్మ నేతృత్వంలో బిజెపి మూడోసారి విజయం సాధించింది. హ్యాట్రిక్ సాధించిన బిజెపి సిఎం కూడా హిమంతబిశ్వశర్మనే వరిస్తుందన్న అంచనాలుపెరిగాయి. మొత్తం 126 అసెంబ్లీస్థానాల్లో భారతీయ జనతాపార్టీ 82 స్థానాలు గెలిచింది. కాంగ్రెస్‌పార్టీ 19 స్థానాలకే పరిమితం కాగా బోడోలాండ్ పీపుల్స్‌ఫ్రంట్ 10 స్థానాలు, అస్సాం గణపరిషద్ 10 స్థానాలు, ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రెండు, రైజోర్‌దళ్ రెండు,టిఎంసి ఒకస్థానంలోను గెలుపొందాయి. మెజార్టీమార్కును అత్యంత సులువుగా దాటేసిన అస్సాంలో బిజెపిహైకమాండ్ హిమంతబిశ్వశర్మ పైనే ఎక్కువ నమ్మకం ఉంచింది. హైకమాండ్ నమ్మకానికి తగినట్లుగానే అస్సాం కంటే పక్కనే ఉన్న బెంగాల్‌పైనే అధినేతలు ఎక్కువ ఫోకస్‌పెట్టారు. అయినాకూడా కమలం వికసించింది. ఓటర్లు డబులింజిన్ సర్కార్లకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇక పుదుచ్చేరిపరంగాచూస్తే ఎన్ రంగస్వామి ఆధ్వర్యంలోని ఎన్‌ఆర్‌కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కట్టారు. రాష్ట్రంలో బిజెపి సాయంతో గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిపథకాలకు ప్రజలు మొగ్గుచూపించారు. తమకు డబుల్ ఇంజిన్‌సర్కారే కావాలని మళ్లీ ఎన్నార్సీ కూటమికే పట్టం కట్టారు. మొత్తం 30స్థానాలున్న కేంద్రపాలితప్రాంత పుదుచ్చేరి అసెంబ్లీలో ఆలిండియాఎన్నార్సీకి 12 స్థానాలు, డిఎంకె ఐదు, బిజెపి 4 టివికె రెండు, కాంగ్రెస్ ఒకటి,ఎల్‌జెకె ఒకటి ఇతరులు ఐదుస్థానాల్లో గెలిచారు. ఎన్నార్సీ బిజెపి, స్వతంత్రులతోకలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఈ దక్షిణాది రాష్ట్రంలో సులువయింది. మొత్తం స్వతంత్రులతోకలిసి 21 స్థానాలకు రావడంతో ఇక రంగస్వామి మరోసారి సీఎం అయ్యేందుకు తన వ్యూహాలు విజయవంతంచేసుకున్నట్లు స్పష్టంగా కనిపించింది.

# ఇద్దరు సిఎంలు ఓటమి

## భవానిపూర్‌లో మమత, కొళత్తూరులో స్టాలిన్ పరాజయం

**కోల్‌కత్తా, మే 4:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి షాక్ తగిలింది. ఆమె పోటీచేసిన భవానీపూర్‌స్థానంలో ఆమె ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేలకుపైగా ఓట్లతేడాతో ఓడిపోయారు. బెంగాల్‌లో బిజెపి 200 సీట్లతో ఘనవిజయం సొంతంచేసుకోగా టిఎంసి 72స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 2021లో కూడా మమతా బెనర్జీని సువేందు అధికారి ఓడించిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమిళనాడు ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఓటమి చవిచూసారు. కొళత్తూర్ నియోజకవర్గంనుంచి పోటీచేసిన ఆయన టివికె అభ్యర్థి విఎస్‌బాబుచేతిలో 9 వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూసారు. కొళత్తూరునుంచి మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. 1996 తర్వాత సీఎం స్టాలిన్ ఓటమి పాలుకావడం ఇదే తొలిసారి. అదికూడా తన పాతమిత్రుని చేతిలోనే ఓడిపోవడం గమనార్హం.

### వారం - వర్జ్యం

05-05-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
చవితి పూర్తి
జ్యేష్ఠ మ.12.54
వర్జ్యం : లేదు
దు.ఉ.8.13-ఉ.9.04,
2) రా.11.34-రా.12.25
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** ఖర్చులు అధికం అవుతాయి. కోర్టు వ్యవహారాలు మీకు అనుకూలంగా ఉంటాయి.కొత్త మిత్రులు పరిచయం.

**వృషభం:** కీలక విషయాలలో మిత్రులతో ఆలోచించి ముందుకు సాగింది. ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు.

**మిథునం:** షేర్ల క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. సంఘంలో పేరు ప్రఖ్యాతలు పొందుతారు.

**కర్కాటకం:**విద్య, పారిశ్రామిక రంగాల వారికి కొంత మేరకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** అందరిని కలుపుకొని మంచి పనులు చేస్తారు. సంకుచిత మనస్తత్వం కలిగిన వ్యక్తులతో ఇబ్బందులు తప్పకపోవచ్చు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. రావల్సి ధనం చేతికి అందదు. ఆరోగ్య విషయమై ఖర్చులు సూచిస్తున్నాయి.

**తుల :**నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు ఏర్పడుతాయి. తద్వారా మీరు కొంత మేర లాభపడతారు.వాహనసౌఖ్యం.

**వృశ్చికం:**వృత్తి, ఉద్యోగాలలో మీపై అధికారుల వత్తిడి అధికం అవుతుంది. ప్రయాణాలు. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం.

**ధనుస్సు:** ఆత్మీయులతో కలిసి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. వివాహాది శుభకార్యాలకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి..

**మకరం:**మీరు చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన ధైర్యముతో ఎదుర్కొంటారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**కుంభం:**వృత్తి యందు బాధ్యతలు పెరుగుట వలన అధిక శ్రమకు గురి అవుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది.

**మీనం :** దైనందిన కార్యకలాపములలో మార్పులు గోచరిస్తున్నాయి. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం తిరువనంతపురంలో కాంగ్రెస్ విజయోత్సవాల్లో కెసి వేణుగోపాల్ తదితరులు

# 'చేతి'లోకి కేరళం

## మెజారిటీ మార్కు దాటిన యుడిఎఫ్

## ఒక్క కాంగ్రెస్‌కే 63 సీట్లు

**తిరువనంతపురం, మే 4:** వామపక్ష ప్రజాతంత్ర కూటమి ఎల్డీఎఫ్‌కు కేరళలో అనూహ్య ఓటమి ఎదురయింది. ఆరుపర్యాయాలు కేరళంలో ప్రభుత్వాలునడిపిన ఎల్డీఎఫ్ ఈసారి ఘోరపరాజయం చవిచూసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమక్రటిక్ ఫ్రంట్ ఈసారి అత్యధిక స్థానాలు గెలుచుకుంది. 140 మందిసభ్యులున్న అసెంబ్లీలో మెజార్టీ మార్కు 71 స్థానాలను అధిగమించ గలిగింది. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే 63 స్థానాలు గెలిచింది. యుడిఎఫ్ 102 స్థానాలుసాధిస్తే ఎల్డీఎఫ్ 35 స్థానాలకే పరిమితం అయింది. కేరళ విజయంతో దేశంలో ఇక వామపక్షాలపాలనశకం ముగిసిందనేటట్లు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం స్థానాల్లో మెజార్టీస్థానాలు యుడిఎఫ్‌కేదక్కాయి. సిఎం పినరయి విజయన్‌పోటీచేసిన దర్మదం నియోజకవర్గంలో కూడా చివరి రౌండ్‌ఫలితాల్లో ఆయన గెలిచారు. కాంగ్రెస్ శ్రేణుల మూకుమ్మడి వ్యూహం, ప్రియాంక, రాహుల్‌గాంధీలప్రచారం కాంగ్రెస్ శ్రేణులకు ఉత్తేజం ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీకే మేం కట్టుబడి ఉన్నట్లు కేరళం ఓటర్లు తీర్పునిచ్చారు. పార్టీకి 63 స్థానాలు రాగా సిపిఐఎంకు 26, ఐయుఎంఎల్‌కు 22, సిపిఐకి ఎనిమిది, కెఇఇసి ఏడు స్థానాలు లభించాయి. ఇక ఆర్‌ఎస్‌పికి మూడు, ఇతరులు 11స్థానాల్లో గెలవడంతో కేరళలో యుడిఎఫ్ పాలనపగ్గాలుచేపట్టేందుకు మార్గం సులువయింది. కాంగ్రెస్ అగ్రనేతల్లో రాహుల్, ప్రియాంకల చరిష్మాయే కలిసొచ్చింది. విజయన్‌కుమార్తెపై వచ్చిన అవినీతి ఆరోపణలు కూడా ఆయనకు కొంత ప్రతిష్టను మసకబార్చినట్లు ఫలితాలు స్పష్టంచేసాయి.

# మంచినీటి ఎద్దడి రానివ్వొద్దు

>> మమేకం కావాలని నిర్దేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాల్ సెంటర్ ద్వారా వివరాలను సేకరించాలని సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ విధానాలు అనుసరించాలన్నారు. అధికారులు ఏ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయని.. మిగిలిన చోట్ల కూడా ఇదే చొరవ చూపాలన్నారు. అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ శాఖలు అందించే మిగతా అన్ని సేవల్ని ఆన్ లైన్ లో అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత అవేర్ ద్వారా వచ్చే డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాలను మత్స్యకారులకు అందజేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

# నా జీవితంలో అద్భుతమైన రోజు: త్రిష

## తమిళనాడులో విజయ్ గెలుపుతో ఆనందం

**తిరుమల,మే 4ప్రభాతవార్తప్రతినిధి:** తన జీవితంలో ఈ రోజు ఎంతో ప్రత్యేకమైన, అద్భుతమైన రోజు అని, తమిళనాడులో టివికె పార్టీ గెలిచి విజయ్ విజయం సాధిస్తాడని సినీనటి త్రిష ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేకువజామున ఆమె తన అనుచరులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయంలోపల మొక్కులు చెల్లించుకుని కానుకలు సమర్పించారు. వేకువజామున ఆమె తిరుమలలో ప్రత్యేక పూజలు చేశారు. తన పుట్టినరోజుల కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకోవడం మరచిపోలేనన్నారు.ఆలయం వెలుపల నుండి ఆమె తిరుమల నుంచి నేరుగా చెన్నై వెళ్లారు. బర్త్ డే సందర్భంగా దర్శించుకున్నారని ఆమె అభిమానులు చెబితే విజయ్ గెలుపు కోసమేనని నెటిజన్లు కామెంట్లు చేయడం విశేషం. త్రిష పుట్టిన రోజును బర్త్ డే గిఫ్ట్ గా విజయ్‌కు అభినందనలు తెలిపారనేది ప్రచారం సాగుతోంది.

# పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే గొప్ప విజయం: విజయ్ గెలుపుపై పవన్

**విజయవాడ మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాల్లో మరోసారి ఓటర్ల చైతన్యం స్పష్టంగా కనిపించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పాలన నచ్చితే మళ్లీ మళ్లీ గెలిపిస్తారని, నచ్చకపోతే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారన్నారు. అస్సాం, పుదుచ్చేరిలో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని పశ్చిమ బెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న బిజెపి విజయం వెనక ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష ఉందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ వాసుల నమ్మకాన్ని గెలుచుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ, అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులకు పవన్‌కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# శ్రీకాళహస్తి వద్దఘోర ప్రమాదం

>> స్తుండగా తుది శ్వాస వదలినట్లు వివరించారు. అంబులెన్స్‌లో ఉన్న మిగిలిన ఇద్దరు గాయాలతో ఆసుపత్రికి తరలించినట్లు సిఐ ఇబ్రహీం వివరించారు.వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ కుటుంబానికి చెందిన రాధాకృష్ణపూర్, రాజహటి బందర్,హుగ్లీకి చెందిన బ్రజా డోలు (48) కొంత కాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతుండగా బెంగుళూరులో వైద్య చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు బ్రజాడోలు భార్య టగారి డోలు(34),బంధువులు రితేష్ పండిట్ (34) బతిన్ డోలు(63)లు ఆదివారం హుగ్లీ నుంచి అంబులెన్స్‌లో బయలు దేరారు. అంబెలెన్స్‌లో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు.సుమారు 1659 కిలోమీటర్లు పయనించిన తరువాత సోమవారం ఉదయం సుమారు 5.30 గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తికి చేరారు. ఇక్కడ రోడ్డుపై ఆగి ఉన్న ఓ పెద్దలారిని అంబులెన్స్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ ముందు బాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ ఇబ్రహీం, ఎస్ఐ వెంకటేష్ వారి సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. లారీ వెనుక ఇరుక్కొని ఉన్న అంబులెన్స్‌ను బయటకు లాగారు. అప్పటికే ముగ్గురు మృతి చెందారు. ఒకరు కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందారు. మృతులు జతినడోలు, బ్రజా డోలు, టగారి డోలుయి రితేష్ పండిట్‌లుగా గుర్తించారు.ఈ ప్రమాదంలో మరో అంబులెన్స్ డ్రైవర్ రాకేష్ పండిట్ (29), ధగోడిస్(45)లు తీవ్ర గాయాలకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# ఆధునీకరణకు రూ. 329 కోట్లు

>> మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మరియు సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఆధునికీకరణ వల్ల ఉపయోగాలు..**

కృష్ణా నది కుడి ఒడ్డున ప్రకాశం బ్యారేజి పైప్రాంతం నుండి ప్రారంభమయ్యే ఈ కాలువ సుమారు 47 కి.మీ. పొడవుతో తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, గుంటూరు, చెబ్రోలు, వట్టిచెరుకూరు మరియు ప్రత్తిపాడు మండలాలకు సాగునీరు అందిస్తోంది. ఈ కాలువ ద్వారా సుమారు 27,000 ఎకరాల ఆయకట్టు లాభపడుతోంది.

ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మరియు మంగళగిరి మున్సిపాలిటీతో పాటు 33 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడంలో ఈ కాలువ కీలక పాత్ర పోషిస్తోంది. కాలానుగుణంగా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని, గుంటూరు కాలువ వ్యవస్థను ఆధునీకరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయబడుతున్నాయి. అదేవిధంగా, సుమారు 30 కి.మీ. విస్తరణ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఈ విస్తరణ ద్వారా అదనంగా 41 గ్రామాలకు తాగునీరు అందించబడటంతో పాటు సుమారు 50,000 ఎకరాల భూమికి సాగునీరు అందించబడుతుంది. గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ. 369.20 కోట్ల మంజూరు చేయడంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది.,సుదీర్ఘకాలం నుంచి ఈ ఛానల్ కోసం ఎదురుచూస్తున్న గుంటూరు జిల్లా ప్రజల కల సాకారమయింది.

# గ్లోబల్ బ్రాండ్లుగా రాష్ట్ర ఉత్పత్తులు

## పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్ కనెక్టివిటీ: సిఎం చంద్రబాబు

**విజయవాడ,, మే4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాణ్యమైన ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తం మంచి గుర్తింపు ఉందన్నారు.,ఇది ఉత్పాదక రంగంలో నాణ్యత పెరగాలన్నారు.రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎపి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం( భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధి పై సీఎం చర్చించారు. 2026- 27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై సమీక్షలో చర్చించారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రొడెక్టు పర్ఫెక్షన్ తో పాటు లాజిస్టిక్స్ ను కూడా అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచనలు చేశారు..

**ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌ల అభివృద్ధి.**

స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత పెరిగితేనే గ్లోబల్ స్థాయికి చేరుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉత్పత్తులకు స్థానికంగా, ప్రాంతీయంగా, దేశ, విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఎస్‌ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన భవ్య పథకం ద్వారా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రసాయనాల తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు మౌలిక సదుపాయాలు పర్యాటకం అనే విధానంలో ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్‌ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ జరగాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల్లోనూ కోర్సులను హైబ్రీడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలన్నారు. సమీక్షకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఒమన్‌లో చిక్కుకొన్న మహిళను ఆదుకొంటాం

>>భరించి షహనాజ్‌ను తిరిగి ఏపీ పంపేందుకు ఏజెంట్ల అంగీకారం తెలిపారు. మే 7 తేదీన స్వదేశానికి చేరుకోనుంది. వలస కార్మికుల భద్రతకు ఎపి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎన్‌ఆర్టీ సొసైటీ చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. వాల్మీకిపురానికి చెందిన అబూబకర్ దినసరి కూలీ. అతని భార్య షహనాజ్ అలియాస్ షానల్. ఆమె మస్కట్‌లో చిక్కుకున్న వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, ఏపీఎన్ ఆర్టీఎస్ అధ్యక్షుడు వేమూరు రవికుమార్, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ సర్వీసెస్ నాగేంద్రబాబు అక్కిలితో చరవాణిలో మాట్లాడారు. తక్షణమే బాధితురాలిని వాల్మీకిపురానికి రప్పించే ఏర్పాట్లు చేయాలని కోరారు. దాంతో అధికారులు ఆమెను మరో 4 రోజుల్లో భారతదేశానికి రప్పించే ఏర్పాట్లను చేశారు.

ఈ క్రమంలో బాధిత కుటుంబం అధైర్య పడొద్దని, ఆమెను స్వగ్రామానికి రప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తల్లి రోదిస్తున్న దృశ్యాలను చూసి షానల్ పిల్లలు కంటతడి పెట్టారు. తమకు అమ్మ కావాలని పరితపించిపోతున్నారు. దీనికి సంబంధించి స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్, తదితరులు బాధిత కుటుంబానికి అండగా నిలిచి ధైర్యం చెప్పారు.

5-5Pg3exHMNWJQE.qxd:5-5Pg3exHMNWJQE.qxd 1/1/02 6:13 AM Page 1



## తిరుమల సమాచారం



### అజ్ఞాతభక్తుడు అన్నప్రసాదానికి రూ.కోటి విరాళం

**తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** గోవింద నామస్మరణతో తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ అజ్ఞాతభక్తుడు భూరీ విరాళ మిచ్చారు. ఏకంగా కోటి రూపాయలు విరాళాన్ని ప్రకటించి తన భక్తివిశ్వాసం చాటుకున్నాడు. శ్రీవారి సేవలో భాగంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1,00,10,116 లు విరాళం అందజేశారు. ఈ విరాళం డిమాండ్ డ్రాఫ్ట్‌ను సోమవారం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా అజ్ఞాత భక్తుడి దాతృత్వాన్ని ఇఒ అభినందిస్తూ, అన్నప్రసాద సేవకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

**ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. సోమవారం ఉదయం భువనేశ్వర్‌కు చెందిన బల్భద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,000 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.



### తేనెలొలికే పదాలతో అలమేల్మంగను అలరించిన అన్నమయ్య

**తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తాళ్లపాక అన్నమాచార్యుల వర్ణనా వైచిత్రి నిరుపమానమని, ఆయన సంకీర్తనల్లో శృంగార నాయికల భావాలను మధురభక్తితో అద్భుతంగా ఆవిష్కరించారని హైదరాబాద్‌కు చెందిన నాగపద్మిని తెలిపారు. అన్నమయ్య 618వ జయంతి ఉత్సవాల్లో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సోమవారం రెండవ రోజు సాహితీ సదస్సు జరిగింది. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆమె "అన్నమయ్య తీర్చిన అలమేల్మంగా" అనే అంశంపై ఉపన్యసిస్తూ, అన్నమయ్య శృంగార సంకీర్తనల భావ వైశాల్యం అపారమని పేర్కొన్నారు. ఆయన కీర్తనల్లో మధురభక్తి, సాహిత్య సౌందర్యం సమన్వయంగా ప్రతిఫలిస్తుందని వివరించారు. "పలుకు తేనెల తల్లి..", "ఏమని పొగడుదమే..", "అలరులు కురియగా.." వంటి సంకీర్తనల్లో అలమేల్మంగా అమ్మవారిని మాధుర్యభరితంగా వర్ణించిన తీరు విశిష్టమని తెలిపారు. డా.ఆముదాల మురళి "అన్నమయ్య అద్వైత తత్వం"పై మాట్లాడుతూ, శరణాగతి, లోకనీతి, వేదసారాన్ని సమన్వయపరిచి అన్నమయ్య సాహిత్యం నిర్మించారని చెప్పారు. భక్తి సాహిత్యంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ షేక్షావలి "అన్నమయ్య, సూరదాసుల సంకీర్తనల్లో నవవిధ భక్తి" అంశంపై మాట్లాడుతూ, భగవత్ సంకీర్తన ద్వారా మోక్షం సిద్ధిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, సంచాలకురాలు లత, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గాత్ర సంగీతం, నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



### కల్పవృక్ష వాహనంపై పాండురంగ స్వామిగా వేదనారాయణుడు

**తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నాగలాపురం వేదనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై పాండురంగ స్వామి అలంకారంలో స్వామి భక్తులను అనుగ్రహించారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కల్పవృక్షం కోరుకున్న వరాలను ప్రసాదించే దివ్య వృక్షంగా పరిగణించబడుతుంది. దాని నీడలో ఆశ్రయించిన వారికి శాంతి, సంతృప్తి కలుగుతాయని ఆధ్యాత్మిక భావన. ఈ వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో బిజెపి విజయం చరిత్రాత్మకం

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



**విజయవాడ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయం చరిత్రాత్మకమని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పశ్చిమబెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి ఆధిక్యం కనబర్చడంపై విజయవాడలోని బిజెపి కార్యాలయంలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్వీట్లు తినిపించి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి అధికారాన్ని నిలబెట్టుకోగా.. కేరళలో కమ్యూనిస్టుల పాలనలో బిజెపి నేతలపై దాడులు జరిగాయని విమర్శించారు. 2011లో ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా.. 2021లో 70 స్థానాల్లో బిజెపి విజయం సాధించిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు దాదాపు రెండు వందల స్థానాల్లో బిజెపి విజయం దిశగా దూసుకెళ్తోందన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ అరాచకాలు, విధ్వంసకర ధోరణికి పాల్పడ్డారని, దేశ హితానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్లే మమత గెలుస్తూ వచ్చారని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి, రాష్ట్ర ప్రయోజనాల కన్నా తన స్వార్థం చూసుకున్నారని మమతా బెనర్జీపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలింగ్ రోజు కూడా అనేక దాడులు చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిని అధిగమించి అక్కడి ప్రజలు మమత కుట్రలను తిప్పి కొట్టారన్నారు. బిజెపిపై నమ్మకంతో దాదాపు 200 స్థానాల్లో విజయం కట్టబెట్టారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లను మమతా ప్రోత్సహించడం వల్లే గెలిచారంటూ తాము చెప్పిన మాటలే ఇప్పుడు నిజమని తేలాయన్నారు. బిజెపి అక్కడ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే ఉందన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రం వెస్ట్ బెంగాల్‌లో బిజెపి జెండా రెపరెపలాడటం ఆనందంగా ఉందన్నారు. దేశంలో ప్రజలకు ఒకే చట్టం, ఒకే జాతీయ పతాకం ఉండాలని 1951లో ఇదే వెస్ట్ బెంగాల్‌లో ఆయన ఉద్యమం చేశారని గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భావం, శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సమయంలో వెస్ట్ బెంగాల్‌లో బిజెపి విజయం సాధించడం గొప్ప విషయమని శ్రీనివాస వర్మ అన్నారు. భవిష్యత్తులో పశ్చిమ బెంగాల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని స్పష్టం చేశారు. కేరళంలో బిజెపి మూడు స్థానాలతో అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతోందన్నారు. తమిళనాడులో స్టాలిన్ పార్టీ కూడా ఓటమి పోయిందన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని ప్రచారం చేసిన వారిని ప్రజలే ఓడించారన్నారు. బిజెపికి విజయాన్ని అందించిన ప్రధాని మోడీ, అమిత్ షా, ఇతర నేతలు, కార్యకర్తలకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ధన్యవాదాలు తెలియజేశారు.

### బెంగాల్‌లో అటవిక పాలనకు చెక్: ఎపి మంత్రి సత్యకుమార్



బెంగాల్, అసోంలో బిజెపి నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ఆధిక్యంపై ఎపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సంబరాల్లో పాల్గొన్న ఆయన, ఈ ఫలితాలను 'చారిత్రక తీర్పు'గా అభివర్ణించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ప్రజలు అటవిక పాలనకు చరమగీతం పాడుతూ స్పష్టమైన తీర్పునిచ్చారని, అసోంలో మరోసారి బిజెపి అధికారంలోకి వస్తోందని పేర్కొన్నారు. కేరళంలో బిజెపి ఓట్ షేర్ గణనీయంగా పెరగడం దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణాలకు నిదర్శనమని ఆయన విశ్లేషించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు బిజెపిని ఎదుర్కోవడానికి చేతులు కలిపినప్పటికీ, ప్రజలు మాత్రం 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' నినాదానికే పట్టం కట్టారని సత్యకుమార్ తెలిపారు. గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఈ విజయాలకు వెన్నెముక అని పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ విషయంలో 'డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్' (గుర్తించడం, తొలగించడం, బహిష్కరించడం) దిశగా బిజెపి అడుగులు వేయడం ఆ రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రధాని మోడీ పాలనకు ఎన్నికలు నిదర్శనం

- తిరుపతిలో బిజెపి సంబరాలు



**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో పశ్చిమబెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ విజయ కేతనం ఎగురవేయడంతో తిరుపతిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని శ్రీదేవి కాంప్లెక్స్ ముందు బిజెపి నాయకులు చంద్రారెడ్డి, గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు టపాకాయలు కాల్చి, ఒకరికి ఒకరు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు విశ్వాసం ఉంచుతున్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ప్రజలు బిజెపి విధానాలకు ఇచ్చిన మద్దతుకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా పారదర్శక పరిపాలన, అవినీతి రహిత పాలన, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని అన్నారు. రాష్ట్రాల వారీగా వచ్చిన విజయాలు పార్టీకి మరింత బలం చేకూర్చాయని, భవిష్యత్తులో కూడా బిజెపి దేశవ్యాప్తంగా తన ప్రాభవాన్ని విస్తరించుకుంటుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. మోడీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు బి చంద్ర రెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్, బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎస్ మస్తాన్, బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, బిజెపి సెంట్రల్ మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు జయంత్ కుమార్, సుబ్బన్న, పురోహితుడు సురేష్ స్వామి, హేమంత్ రాయల్, డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, లక్ష్మి, పద్మావతి రంగస్థలి కార్యదర్శి కెఎన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీకి రేపు మంత్రి లోకేశ్ రాక

- క్యారియర్ ఎసి తయారీ యూనిట్‌కు శంకుస్థాపన



**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా శ్రీసిటీ పారిశ్రామికవాడలో క్యారియర్ ఎసి తయారీ యూనిట్‌కు రేపు బుధవారం రాష్ట్ర విద్య, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ భూమి పూజ చేయనున్నారు. శ్రీ సిటీలో శంకుస్థాపన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు హెలిప్యాడ్, భూమి పూజ స్థలం తదితర అవసరమైన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, శ్రీ సిటీ ఎండీ రవి సన్నారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమెరికాకు చెందిన ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో భారీ పరిశ్రమ స్థాపనకు సిద్ధమైందన్నారు. గృహేతర అవసరాలకు అనువైన ఆధునిక ఎసి ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం రేపు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, అలాగే సంస్థ సిఎండి డేవిడ్ గిట్‌లిన్ కూడా పాల్గొననున్నారని పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని తెలిపారు. హెలిప్యాడ్, భూమి పూజ స్థలం తదితర ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, అదనపు ఎస్పీ రవి మనోహరచారి, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ విక్రమ్, తహసీల్దార్, పరిశ్రమల శాఖ, శ్రీసిటీ, క్యారియర్ సిబ్బంది, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### మంత్రి లోకేశ్‌తో మంతెన సత్యనారాయణ రాజు భేటీ

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రి లోకేశ్‌తో ప్రభుత్వ సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అని తెలుస్తోంది. ఇటీవల మంతెన సత్యనారాయణ రాజును రాష్ట్ర ప్రభుత్వం యోగా, నేచురోపతి విభాగం గౌరవ సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయన మంత్రి లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రకృతి వైద్య రంగంలో దశాబ్దాలుగా మంతెన అందిస్తున్న సేవలను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజారోగ్యం కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.

## గంగమ్మజాతరకు ఏర్పాట్లు పూర్తి... భక్తులకు సాఫీగా క్యూలైన్లు



**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత ప్రధానమైన వారంరోజులు జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను సిద్ధంచేశారు. ఈ ఏర్పాట్లును ఆలయంలో నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, అధికారులతో కలసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. చేస్తున్న, చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆయా విభాగాల అధికారులు విధులు కేటాయించామని అందరూ వారి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని జాతర విజయవంతం చేయాలని తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్ వెంట డి.ఎస్.పి భక్తవత్సలం, ఇఒ జయకుమార్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఇలు రాజు, శిల్పా, ఎసిపి పార్వతిప్రియ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

### కల్తీ లడ్డూపై ఏకసభ్య కమిషన్ నివేదికను బహిరంగపరచండి: సిపిఎం

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం కల్తీ లడ్డూపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను వెంటనే బహిరంగపరచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రిటైర్డు ఐఎఎస్ అధికారి దినేష్ కుమార్ ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తన నివేదికను ముఖ్యమంత్రికి అందజేసినట్లు వెల్లడైందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ నివేదికలోనే అంశాలను ఒక్కో పత్రిక ఒక్కో విధంగా అభివర్ణించాయని తెలిపారు. వాస్తవం ఏమిటో ప్రజలకు తెలియడం అవసరం కనుక కమిషన్ నివేదికను ప్రభుత్వం వెంటనే బహిర్గతపరచాలని కోరారు. కమిషన్ అనేక సూచనలను చేసినట్లు తెలుస్తోందని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలతో సహా అఖిలపక్ష సమావేశం ముందు ఉంచాలని కోరారు. లడ్డూ విషయం ఇప్పటికే పెద్ద వివాదంగా మారిందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే ఏకాభిప్రాయ సాధనకు, ప్రజల్లో ఏర్పడిన అపోహలు తొలగిపోవడానికి తోడ్పడుతుందని భావిస్తున్నామని తెలిపారు.

## మోడీ నాయకత్వంపై విశ్వాసానికి ప్రతిబింబం



**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల వెల్లడవుతున్న క్రమంలో పశ్చిమ బెంగాల్, అసోంలో ఎన్డీఏ కూటమి విజయం దిశగా దూసుకెళ్తుంతోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం అన్నారు. ఎన్డీయే మరింత బలపడిందని ఈ ఫలితాలు చాటి చెబుతున్నాయన్నారు. ఎన్డీఏ సాధించిన విజయం ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచుతున్న విశ్వాసానికి ప్రతిబింబమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్" స్ఫూర్తితో ప్రజల ఆశయాల సంగమంగా ఎన్డీఏ మరింత బలపడిందని ఈ ఫలితం చాటి చెబుతోందని అన్నారు. వికసిత భారత్ వైపు ప్రయాణం ఈ విజయంతో మరింత బలపడిందని తెలిపారు. అభివృద్ధి పట్ల ఎన్డీఏ అంచెలంచెల నిబద్ధతకు ప్రజలు ఇస్తున్న మద్దతు, విశ్వాసం స్పష్టంగా కనిపి స్తోందన్నారు. యంగ్ ఇండియా విశ్వసనీయత, అభివృద్ధి, ప్రజలతో నిజమైన అనుబంధానికే ప్రాధాన్యం ఇస్తుందని ఇది అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చిన స్పష్టమైన సందేశంగా పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఎన్డీఏ విజేతలందరికీ, అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు, ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

### ఎన్‌డియే విజయంపై మంత్రి లోకేశ్ అభినందనలు

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన ఎన్‌డియేకు మంత్రి నారా లోకేష్ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. తమిళనాడులో అద్భుతమైన ఎన్నికల ఆరంభం సాధించిన విజయ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజా తీర్పు అభివృద్ధి, స్థిరత్వం, దృఢ నాయకత్వంపై పెరుగుతున్న విశ్వాసాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందన్నారు. మోడీ నాయకత్వంలో వేగం, విస్తృతి, పారదర్శకతతో ఫలితాలు అందించే పాలనపై దేశం ఉంచిన నమ్మకాన్ని ఈ విజయం మరింత బలపరిచిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, అవకాశాలతో ముందుకు సాగే నూతన భారతానికి శక్తివంతమైన మద్దతు అని స్పష్టం చేశారు. తమిళనాడు ఫలితం రాష్ట్ర ప్రజల మారుతున్న ఆశయాలను ప్రతిబింబిస్తూ, రాజకీయ వేదికకు కొత్త కోణాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్న విజయ్ బాధ్యతతో, నిబద్ధతతో ప్రజల అంచనాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

### విజయ్‌కి జగన్ అభినందనలు

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న వేళ ఎపి మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ స్పందించారు. ముఖ్యంగా తమిళనాడులో నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) తొలి ఎన్నికల్లోనే సంచలన ప్రదర్శన చేయడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు జగన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "నా ప్రియ సోదరుడు విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు. రాజకీయాల్లోకి వచ్చి, తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించడం నిజంగా గొప్ప విషయం. ప్రజాసేవలో మీరు ప్రారంభించిన ఈ కొత్త అధ్యాయంలో మీకు మరింత శక్తి, విజయం చేకూరాలని ఆకాంక్షి స్తున్నాను. దేవుడు మీకు తోడుగా ఉండాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల సరళిని ఉద్దేశిస్తూ అక్కడి పరిణామాలపై కూడా జగన్ స్పందించారు. "దీదీకి నా సానుభూతి తెలియజేస్తున్నాను. గెలుపు బాటలో ఉన్న బిజెపికి, ఇతరులకు అభినందనలు" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

### విజయ్ విజయంపై స్పందించిన చిరంజీవి

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళ చిత్రసీమలో తనకంటూ ఒక ఇమేజ్ సృష్టించుకున్న దళపతి విజయ్, ఇప్పుడు రాజకీయ రంగస్థలంలోనూ తన జైత్రయాత్రను ప్రారంభించారు. తన తొలి ఎన్నికల పోరాటంలోనే అద్భుత విజయాన్ని అందుకున్న విజయ్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా విజయ్‌ను అభినందిస్తూ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది డియర్ విజయ్ మీ తొలి ఎన్నికల్లో సాధించిన ఈ అద్భుతమైన విజయానికి హృదయపూర్వక అభినందనలు. మీర నిరంతరం ప్రేరణగా నిలుస్తూ, నాయకత్వం వహించి సేవ చేయాలని కోరుకుంటున్నాను. తమిళనాడు రాష్ట్ర ప్రజలకు మీ ప్రజాసేవ మరింతగా మేలుకలిగించాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రాజకీయాల్లో తనకంటూ ఒక కొత్త బాటను వేసుకుంటున్న విజయ్, భవిష్యత్తులో తమిళ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తీసుకువస్తారో చూడాలని సినీ అభిమానులు మరియు రాజకీయ విశ్లేషులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

### 'దేశానికి మోడీ విజన్.. ఎపికి చంద్రబాబు విజన్'

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ప్రగతి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తాజా ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ ప్రపంచ స్థాయిలో మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. దేశానికి మోడీ విజన్ రాష్ట్రానికి చంద్రబాబు విజన్ సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సొంతం చేసుకున్న ఎన్‌డియే నేతలకు మంత్రి అభినందనలు చెప్పారు.

### నాడు ఎన్టీఆర్.. నేడు సిఎం చంద్రబాబు

## బిసిల బాంధవులు

### కుప్పంలో కోడెల రాయస్వామి పెద్ద జాతరలో మంత్రి సవిత



**కుప్పం, మే 4 ప్రభాతవార్త:** యాభై శాతం జనాభా ఉన్న బిసిలను గుర్తించి పెద్ద పీట వేస్తోంది తెలుగుదేశం పార్టీయే నని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం కుప్పం మండల ం జరుగు, సలార్లపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కోడెలరాయ స్వామి, శ్రీ కుందాని లక్కమ్మ స్వామి పెద్ద జాతరకు మంత్రి హాజరయ్యారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ స ందర్భంగా మంత్రి సవిత, ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రా ష్ట్ర కురబకుల అధ్యక్షుడు మల్లికార్జున, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడారు. దివంగత ఎన్టీఆర్ హయాంనుంచే బిసిలను తెలుగుదేశం పార్టీ గుర్తిస్తోందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ బిసి కులాల బాంధవులు అని పేర్కొన్నారు. కురబకులస్తుల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని సిఎం చంద్రబాబు రాష్ట్ర పండగగా గుర్తించారన్నారు. బిసిలకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేశారన్నారు. బిసిలు రాజకీయంగా, సామాజిక, ఆర్థికంగా మెరుగుపడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కుప్పం ప్రాంతంలో ఈ జాతరను ఇంతపెద్ద ఎత్తున నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో ఆత్మీయత అనురాగాలకు చోటు లభిస్తుందన్నారు. శ్రీ కోడెల రాయస్వామి ఆలయ నిర్మాణంకు సిఎం చంద్రబాబునాయుడు మూడు కోట్ల రూపాయల నిధులు కేటాయించడంతో పాటు జాతర నిర్వహణకు ప్రభుత్వం తరపున పటిష్ట చర్యలు, ఏర్పాట్లు చేపట్టడం పట్ల సిఎం చంద్రబాబుకు కురబ కులస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కురబ కులస్తులు సిఎం చంద్రబాబుకు పెద్ద ఎత్తున మద్దతు పలికారన్నారు. కురబ కులస్తులకు ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారన్నారు.

5-5Pg7exHMNWJQE.qxd:5-5Pg7exHMNWJQE.qxd 1/1/02 6:21 AM Page 1



### ఇటు నిత్య కల్యాణం: అటు మృత్యుంజయ అభిషేకాలు

## భక్తులతో శ్రీకాళహస్తి కళకళ



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి, మే 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతున్నాయి. ఓ వైపు స్వామి అమ్మ వార్లకు అభిషేకాలతో పాటు రాహు కేతు దోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

**మృత్యుంజయునికి షోడశాభిషేకాలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడశాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పర్చకర్పూరంతో అబిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.




## తమిళనాట చక్కర్లు కొడుతున్న విజయ్ కారు నంబర్

### రెండేళ్లక్రితమే సిఎం కావాలని ఫిక్స్ అయిన ఫ్యాన్స్

**చెన్నై, మే 4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ సునామీ కనిపిం చింది టీవీకే పార్టీ అద్భుత విజయాన్ని అందుకుంది. ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. విజయ్ చెప్పి మరీ సింగిల్‌గా పోటీచేసి గెలుపు అందుకున్నారు. 110 కుపైగా సీట్లలో టీవీకే పార్టీ అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు ట్రెండ్‌ను బట్టి విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తోంది. తమిళనాడు ఎన్నికల ఫలితాల వేళ రెండేళ్ల క్రితం వచ్చిన విజయ్ సినిమా గోట్ కారు నంబర్ ప్లేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో విజయ్ కారుకు ఉన్న నంబర్ ప్లేట్ గురించి చర్చ జరుగుతోంది.. దళపతి రెండేళ్ల క్రితమే టార్గెట్ ఫిక్స్ చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. దళపతి విజయ్ 2024 ఫిబ్రవరి 2న టివికె పేరుతో పార్టీని ప్రారంభించారు. 2024 సెప్టెంబర్ 5న ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ గోట్ మూవీ విడుదలైంది.అంటే విజయ పార్టీని స్థాపించిన దాదాపు ఏడు నెలలకే ఈ సినిమా వచ్చింది హీరోయిన్‌గా త్రిష నటించారు. ఈ మూవీలో విజయ్ ప్రయాణించిన కారుకు నంబర్ ప్లేట్‌పై టిఎస్07 సీఎం2026 ఉంది. తమిళనాడు ఎన్నికల ఫలితాల వేళ ఈ కారు నంబర్ ప్లేట్ వైరల్ అవుతోంది. 2024లోనే విజయ్ ముఖ్యమంత్రి టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఈ నంబర్ ప్లేట్‌లో మరో కొత్త లాజిక్ కూడా తెరపైకి వచ్చింది.

## హార్ముజ్‌లో ట్రంప్ ఆపరేషన్ ఫ్రీడమ్




**వాషింగ్టన్, మే 4:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హార్మూజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సోమవారం నుంచే ఈ ఆపరేషన్ ప్రారంభమయిందని తెలిపారు.ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించిన ట్రంప్ ఈ వివాదంతో ఏమాత్రం సంబంధం లేని అనేక దేశాల నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని పేర్కొన్నారు. వారిని అమాయక బాధితుల్గుగా అభివర్ణించారు. ఆ నౌకల్లోని సిబ్బంది వద్ద ఆహారం, నిత్యావసరాలు అడుగంటుతున్నాయని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేపడుతున్న చర్య అని వివరించారు. ఈ ఆపరేషన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పూర్తి మద్దతు ప్రకటించింది. గైడెడ్‌మిసైల్ డిస్ట్రాయర్లు, 100కు పైగా విమానాలు, 15,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటారని తెలిపింది. ఇదే సమయంలో, ఈ మానవతా సహాయక చర్యలకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌తో తమ ప్రతినిధులు చాలా సానుకూల చర్చలు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. కొన్ని రోజుల క్రితమే ఇరాన్ ప్రతిపాదించిన 14సూత్రాల శాంతి ప్రణాళికను ట్రంప్ ఆమోదయోగ్యం కాదని తోసిపుచ్చారు. తాజా పరిణామాలపై స్పందించిన ఇరాన్, హార్మూజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని కాల్పుల విరమణ ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించింది.

# హైదరాబాద్ శివారులో భారీ పేలుడు

## ముగ్గురికి గాయాలు.. భారీగా ఆస్తి నష్టం



లైఫ్‌కేర్ మెడికల్ అండ్ ఇండస్ట్రియల్ ఎయిర్ ప్రొడక్స్ సంస్థలో ప్రమాద దృశ్యం

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** శివారు హైదరాబాద్‌లో ఓ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. దాదాపు కిలోమీటర్ మేర వరకు భారీ శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ప్రమాదంలో భారీ అస్తినష్టం జరిగింది. వైద్య అవసరాల కోసం వాడే ఆక్సిజన్‌కు సంబంధించిన ట్యాంకులు పేలిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా పేలుడు ధాటికి ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటన సోమవారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి శివార్లలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే జల్‌పల్లి పరిధిలోని బాబా కాంటా సమీపంలో వైద్య అవసరాల నిమిత్తం ఆసుపత్రులకు సరఫరా చేసే ఆక్సిజన్ సిలిండర్లు నింపే లైఫ్‌కేర్ మెడికల్ అండ్ ఇండస్ట్రియల్ ఎయిర్ ప్రొడక్స్ సంస్థ ఉంది. అయితే సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఓ కంటైనర్‌కు లీకేజీ ఏర్పడి పెద్ద శబ్ధంతో పేలగా ఆ తర్వాత మరొకటి పేలింది. దీంతో కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు గాయపడగా సమీపంలో వెల్డింగ్ పనులు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు ఓ కస్టమర్ సైతం గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కంపెనీ రూఫ్ ధ్వంసం కాగా అక్కడే ఉన్న పది డిసిఎం వాహనాలు భారీగా ధ్వంసం అయ్యాయి. సమీపంలోని విశ్వకర్మ ఫర్నీచర్ షాపు షెడ్ ధ్వంసంతో పాటు పరిసరాల్లో ఉన్న పలు ఇళ్ళ గ్లాసులు పగిలిపోయాయి. కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకొని పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్‌పై ఆసిమ్‌మునీర్ కొత్తకుట్రలు

### నిఘా వేగుల హెచ్చరికలు



**న్యూఢిల్లీ, మే 4:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్, భారత్‌పై కొత్త కుట్రపూరిత వ్యూహం చేపడుతున్నారు. తన దేశంలో తెహ్రీక్‌ఏతాలిబన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) జరుపుతున్న దాడుల వెనుక భారత్ హస్తం ఉందంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తు న్నారు. పాకిస్థాన్ స్వయంకృతాపరాధమే ఈ సమస్యలకు కారణమని స్పష్టంగా తెలుస్తున్నా, మునీర్ ఈ ప్రచారాన్ని ఉధృతం చేయడం వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జైష్ ఏ మొహమ్మద్, లష్కర్‌ఏతొయిబా వంటి ఉగ్రవాద సంస్థలను మళ్లీ భారత్‌పై దాడులకు ఉసిగొల్పడమే ఆయన అసలు ఉద్దేశం. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ సైన్యం పరువు కోల్పోవడంతో, ఆసిమ్ మునీర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌కు ముందు, "భారత్‌ను తూర్పు నుంచి నాశనం చేయడం ప్రారంభిస్తాం" అంటూ ఆయన గంభీరమైన ప్రకటనలు చేశారు. అయితే, ఆ ఆపరేషన్ విఫలమవడంతో ఇప్పుడు సొంత దేశంలో ఆయనకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ అవమానం నుంచి బయట పడేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు మునీర్ భారత్‌పై నిందలు మోపుతున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జైష్, లష్కర్ వంటి ఉగ్రవాద సంస్థలు పునరేకీకరణ అవుతున్నప్పటికీ ఆ ప్రక్రియ పాక్ సైన్యం, ఐఎస్ఐ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఐఎస్ఐ నిధులు, వనరులు సమకూరుస్తున్నా, ఆ సంస్థల నాయకత్వంలో నైతిక స్థైర్యం కొరవడిందని, భారత్‌పై వెంటనే దాడులు చేసేందుకు అవి విముఖంగా ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వారిలో భారత్‌పై ద్వేషాన్ని మరింత తీవ్రతరం చేసి, దాడులకు పురిగొల్పేందుకే మునీర్ ఈ ఆరోపణల పర్వాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. పాకిస్థాన్ నిస్పృహలో ఉందని, మునీర్ రెచ్చగొట్టే ప్రసంగాల నేపథ్యంలో కశ్మీర్‌లో ఒక భారీ దాడికి తెగించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

## పెళ్లి వేదిక ఎక్కాల్సిన వరుడిపై దుండగుల కాల్పులు




**జౌన్‌పూర్ (యుపి), మే 4:** పెళ్లి వేడుకలతో కళకళలాడాల్సిన ఓ ఇంట్లో పెను విషాదం నెలకొంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడిని, ఊరేగింపుగా వెళ్తుండగా దుండగులు నడిరోడ్డుపై కాల్చి చంపారు. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో జరిగిన ఈ దారుణంలో తల్లితండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పెళ్లికి రెండు రోజుల ముందే తమకు బెదిరింపులు వచ్చాయని, తాము వాటిని తేలికగా తీసుకున్నామని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆజాద్ బింద్ అనే యువకుడికి వివాహం నిశ్చయమైంది. శుక్రవారం సాయంత్రం పూలతో అలంకరించిన కారులో బంధువులతో కలిసి పెళ్లి మండపానికి బయలుదేరాడు. వారి నివాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి పై ప్రయాణిస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కారును అడ్డగించారు. నెంబర్ ప్లేట్‌కు గుడ్డ కట్టి ఉన్న బైక్ పై వచ్చిన మాస్కులు ధరించిన నిందితులు వెంటనే ఆజాద్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. కాల్పులు జరగడంతో కారులో ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బుల్లెట్ గాయాలతో ఉన్న ఆజాద్ "నేను బతకలేను" అంటూ చెప్పిన మాటలను గుర్తుచేసుకుని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆజాద్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఈ హత్య వెనుక వధువు తరపు బంధువుల హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వధువు బంధువైన ప్రదీప్ బింద్‌కు ఈ పెళ్లి ఇష్టం లేదని, ఈ కారణంగానే అతను రవి యాదవ్, భోలే రాజ్‌భర్‌లతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. పెళ్లికి ముందు ప్రదీప్ తమను బెదిరించినట్లు వధువు కూడా విచారణలో అంగీకరించింది. నిందితుడు ప్రదీప్‌కు నేరచరిత్ర ఉందని, గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై బయట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.25వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# దేశంలో అధికారంలో లేని వామపక్షాలు



**న్యూఢిల్లీ, మే 4:** భారత రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన వామపక్షాలు, దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితిని తెచ్చుకున్నాయి. ఐదు దశాబ్దాల్లో ఇలాంటి రాజకీయ శూన్యత ఏర్పడటం ఇదే తొలిసారి. తమ చివరి కంచుకోట అయిన కేరళంలోనూ లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారం కోల్పోయే దశకు చేరింది. కేరళలో వెలువడుతున్న ఎన్నికల సరళి ప్రకారం పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంభారీగా వెనుకబడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో వచ్చింది. ఇలాగే కొనసాగితే, వామపక్షాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని చారిత్రక ఘట్టం నమోదవుతుంది. ఈ క్రమంలో తిరువనం తపురంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికే సంబరాలు ప్రారంభించారు. ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో వామపక్షాలది కీలక పాత్ర. 1996లో సీపీఎం అగ్రనేత జ్యోతి బసు యునైటెడ్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిని ఆయన తర్వాత చారిత్రక తప్పిదంగా అభివర్ణించారు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూ పీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర ఇలా మూడు రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి. భారత రాజకీయాల్లో కమ్యూనిస్టులది సుదీర్ఘ, ప్రభావవంతమైన చరిత్ర. 1957లో కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇక, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 ఏళ్లు పాలించి, దేశంలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీగా చరిత్రకెక్కారు. జ్యోతి బసు ఒక్కరే 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. త్రిపురలోనూ 1993 నుంచి మాణిక్ సర్కార్ నేతృత్వంలో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. గత దశాబ్ద కాలంగా వామపక్షాల ప్రాభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమాల నేపథ్యంలో 2011లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది. ఆ తర్వాత 2018లో బీజేపీ ప్రభంజనంలో త్రిపుర కోట కూడా బద్దలైంది. దీంతో కేరళ ఒక్కటే వామపక్షాలకు చివరి ఆశగా మిగిలింది. 2021లో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి పినరయి విజయన్ సంచలనం సృష్టించారు. అయితే, తాజా ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉండటంతో వామపక్షాల పాలన శకం తాత్కాలికంగా ముగింపు దశకు చేరుకున్నట్లేనని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు.

## ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా

## రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు



**విజయవాడ, మే 4 ప్రభాతవార్త:** వచ్చేనెల 21వ తేదీ ప్రపంచ యోగాదినోత్సం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. యోగాడే సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమావేశం అయ్యారు. సోమవారం సాయంత్రం విజయవాడలోని ఆయుష్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో సత్యకుమార్ మాట్లాడుతూ జూన్ 21వతేదీ రాష్ట్రవ్యాప్తంగా యోగాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఇందుకు అధికారులు అందరూ సన్నద్దం కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో అమరావతి పరిధిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన యోగా దినోత్సం పెద్దఎత్తున నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు స్వచ్ఛందసంస్థలు, విద్యార్థులు, ఉద్యోగులు, యోగా, రోటరీ, లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్ తదితర సంఘాలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని యోగా శిక్షకులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వహణపై వారి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. జూన్ రెండవ వారంలో విద్యాసంస్థలు పునఃప్రారంభం అవుతాయని పాఠశాల విద్యార్థులకు యోగాపట్ల అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. యోగా దినోత్సవాన్ని మండలస్థాయి నుండి నిర్వహించాలని ఆదేశించారు. గత ఏడాది నిర్వహించిన యోగాడే సందర్భంగా నిర్వహించిన భారీకార్యక్రమాల ప్రభావంపై మంత్రి ఆరా తీసారు. వీటిపై నివేదిక ఇవ్వాలని సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో యోగాఅండ్ నేచురోపతి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యన్నారాయణరాజు, ఆయుష్ ఇన్‌చార్జి కమీషనర్ రోణంకి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




హజ్‌యాత్రీకుల బస్సును జెండా ఊపిప్రాంభిస్తున్న మంత్రి ఫరూక్

## హజ్‌యాత్రకు 185మంది యాత్రీకులు

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త:** మన రాష్ట్రం నుండి హజ్‌యాత్రకు బయలుదేరిన 185 మంది యాత్రీకులు సోమవారం హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి మక్కాకు తరలి వెళ్ళారు. విడిది కేంద్రం నుండి విమానాశ్రయానికి యాత్రీకులతో బయలుదేరిన బస్సులను మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, మైనార్టీ వ్యవహారాల సలహాదారు యంఎ. షరీఫ్, మైనార్టీశాఖ కార్యదర్శి సిహెచ్.శ్రీధర్, హజ్‌కమీటి చైర్మన్ హసన్ బాష, సీఈఓ గౌస్‌పీర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి సోమవారం ఉదయం 5గంటలకు మొదటి విమానం, తరువాత రెండు విమానాల్లో 185 యాత్రీకులు హజ్‌కు బయలుదేరి వెళ్ళినట్లు మంత్రి ఫరూఖ్ తెలిపారు. మన రాష్ట్రానికి చెందిన 1202మంది యాత్రీకులు హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్‌యాత్రకు వెళ్ళేందుకు ఎంపిక చేసుకున్నారు. వీరంతా ఈనెల 21వతేదీ వరకు దశలవారీగా శంషాబాద్ విమానాశ్రయం నుండి బయలుదేరి వెళతారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హజ్ యాత్రీకులకు ఎంబార్కేషన్ పాయింట్‌ల వద్ద అధునాతన సౌకర్యాలతో వసతి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ చేపట్టిన ఏర్పాట్ల పట్ల హజ్ యాత్రీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పదవతరగతి టాపర్‌లతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

## టెన్త్ టాపర్‌లతో లంచ్‌విత్ కలెక్టర్

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త:** ఇటీవల విడుదలయిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో టాప్‌ర్యాంకులు సాధించిన విద్యార్థులతో లంచ్‌విత్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతిలో 580కంటే ఎక్కువమార్కులు సాధించిన 31మంది విద్యార్ధినీవిద్యార్థులు, మండల టాపర్లు, వారి తల్లిదండ్రులు, 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లాకలెక్టర్ లక్ష్మీశా సన్మానించి ప్రశంసాపత్రాలు అందచేసి, వారితో కలిసి భోజనం చేసారు. విజయవాడ పడమటలోని ఓఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈకార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది పదోతరగతి పరీక్షల్లో మరింత విజయం సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వారికి ప్రేరణగా ఉంటుందన్న భావనతో ఈకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ప్రణాళిక మంచి ఫలితాలనిచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో డిఈఓ ఎల్.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

### పిజిఆర్ఎస్ అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ లక్ష్మీశా

పిజిఆర్ఎస్‌లో వస్తున్న అర్జీలకు సత్వరమే నాణ్యమైన పరిష్కారం చూపాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యాక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 98 అర్జీలు రాగా వాటిని శాఖల వారిగా విభజించి ఆయా శాఖల అధికారులకు పంపించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ సూచించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### స్టార్టప్‌లకు ప్రోత్సాహం : కలెక్టర్

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తూ స్టార్టప్‌లను ముందుకు తీసుకువెళ్ళేందుకు చేయూతనందిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని ఇగ్నైట్‌సెల్‌లో సోమవరం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో స్టార్టప్‌ల ప్రదర్శన నిర్వహించారు. ఈప్రదర్శనను కలెక్టర్ తిలకించి స్టార్టప్‌లు రూపొందించిన వినూత్న ఉత్పత్తులను పరిశీలించారు. క్యామరెస్ట్ సాయిల్‌స్మార్ట్, ఆయోధ్య ఆర్గానిక్ ఫార్మ్స్, హ్యాండ్‌మేడ్ గ్యాలరీ, కైవల్య జూట్ క్రియేషన్స్ వంటి స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ఈప్రదర్శనలో ఉంచాయి. ఈకార్యక్రమంలో ఆర్‌టిఐహెచ్ విజయవాడ సీఈఓ జి.కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా సరిహద్దుల్లో సాయుధ పహారా

### అసోం, బెంగాల్‌లో బిజెపి గెలుపు నేపథ్యంలో పహారా పెంపు

### చొరబాట్ల నిరోధానికి నిరంతర నిఘా



**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** అసోం, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొందడంతో ఈ రెండు రా ష్ట్రాలకు ఆనుకుని వున్న బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సాయుధ పహారాను పెంచారు. బంగ్లా దేశ్ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ పహారా కొన సాగుతుండగా ఇప్పుడు ఈ పారా మిలటరీ బలగానికి తోడుగా రెండు రాష్ట్రాలకు చెందిన సాయుధ పోలీసులు సహాయంగా వుంటారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్, అసోంలలో బిజెపి గెలుపొందితే బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబాట్లు ఇక కష్టమని బంగ్లాలో అధికార పార్టీకి చెందిన ఓ ఎంపి ఇటీవల సోషల్ మీడియా వేదికగా ప్రకటించడం వైరల్‌గా మారడం తెలిసిందే. బంగ్లాదేశ్ ఎంపి ప్రకటన ఎలా వున్నా ఆ దేశం నుంచి అసోం, బెంగాల్ రాష్ట్రంలోకి చొరబాట్లను పూర్తిగా నిరోధించేందుకు కేంద్రం నిర్ణయించి, ఈ బాధ్యతలను బిఎస్ఎఫ్‌కు అప్పగించింది. ఈశాన్య రాష్ట్రాలకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు ఈనాటిది కాదనేది తెలిసిందే. బంగ్లాదేశ్ విముక్తి జరిగినప్పటి నుంచి ఈ సమస్య వుండడం విదితమే. అయితే మూడు దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థి తులు, నిరుద్యోగ సమస్య వెరసి భారత్‌లోకి ఆ దేశం నుంచి లక్షల సంఖ్యలో చొరబాట్లను పెంచసాగింది. బంగ్లాదేశ్ నుంచి ఎక్కువగా అస్సాంలో చొరబాట్లు జరు గుతుండగా ఆ తరువాత బెంగాల్‌లో వుంటో ందని కేంద్ర హోం శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మొదట అస్సాం, బెంగాల్‌లోకి వస్తున్న బంగ్లాదేశ్ చొరబాటు దారులు ఆ తరువాత భారత్ లోని ఇతర నగరాలలో తిష్ట వేస్తూ తప్పుడు పత్రాలతో ఇక్కడి పౌరులుగా చెలామణి అవుతూ ప్రభుత్వ వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలోనూ పెద్ద సంఖ్యలో బంగ్లాదేశీయులు అక్రమంగా వుంటు న్నట్లు కేంద్ర హోం శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇదే అంశంపై బిజెపి అస్సాం, బెంగాల్ ఎన్నికల్లో ప్రచారం చేసింది. ఎన్నికల వేళ ఈ రెండు రాష్ట్రాలలో గల బంగ్లాదేశ్ సరిహద్దులో బిఎస్ఎఫ్ బలగాలు నిరంతరం పహారా కాశాయి. ఎన్నికల అనంతరం బంగ్లాదేశ్ సరిహద్దులో కఠిన నిఘా కొనసాగించాలని, ఆ దేశం నుంచి ఒక్కచొరబాటు కూడా వుండకూడదని కేంద్రం బిఎస్ఎఫ్‌ను ఆదేశించింది. ఎన్నికలవేళ, ఆ తరువాత బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు పెరిగి దీని ద్వారా అస్సాం, బెంగాల్‌లలో హింస జరిగే వీలుందని నిఘా వర్గాలు సమాచారం ఇవ్వడంతో బిఎస్ఎఫ్ పహారాను మరింత కట్టుదిట్టం చేసింది.

**అసోం, బెంగాల్‌లలో బంగ్లాదేశీయులను వెనక్కి పంపేందుకు కేంద్రం నిర్ణయం:** ఇదిలావుండగా అసోంతో పాటు బెంగాల్‌లో ఇంతకాలం అక్రమంగా వున్న బంగ్లాదేశ్‌కు చెందిన వారిని గుర్తించి వెంటనే వెనక్కు పంపేందు కు కేంద్రం నిర్ణయించినట్లుగా సమాచారం. ఇటీవల జరిగిన ఓట్ల తొలగింపులో ఈ రెండు రాష్ట్రా లలో అక్రమంగా వుంటున్న బంగ్లాదేశ్‌కు చెంది న వారు అనేక మంది వున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిసింది. వీరిని వారి స్వదేశానికి వెనక్కు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిన తరువాత వారిని వెనక్కు పంపాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిసింది.

5-5Pg5.qxd:5-5Pg5.qxd 1/1/02 6:17 AM Page 1



# వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య ‘కమల’ వికాసం

## అటు ప్రభుత్వ వ్యతిరేకత - ఇటు ప్రధాని మోడీ చరిష్మా



సోమవారం కోల్‌కతాలోని బిజెపి కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

**న్యూఢిల్లీ, మే 4:** సోమవారం ఫలితాలు వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పశ్చిమ బెంగాల్ ఎన్నికలు కూడా ఉన్నాయి. దక్షిణ రాష్ట్రమైన తమిళనాడులో నటుడు సి. జోసెఫ్ విజయ్ తన కొత్త పార్టీ అయిన టివికెతో ఆధిపత్య పార్టీలను ఓడించి అనూహ్య విజయం సాధించారు. కేరళలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీల కూటమిని ఓడించింది. ఒకప్పుడు ఫ్రెంచ్ కాలనీగా ఉన్న స్వయం పరిపాలన ప్రాంతమైన పుదుచ్చేరిలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే కూటమి విజయం సాధించింది. ఇక ఈశాన్య రాష్ట్రమైన అసోంలో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ, సోమవారం ప్రకటించిన ఫలితాలలో పశ్చిమ బెంగాల్ ఫలితమే అత్యంత కీలకమైనదని విశ్లేషకులు అంటున్నారు. మతపరమైన ధ్రువీకరణను అవకాశంగా తీసుకుని, అంతర్లీనంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించు కుని బిజెపి గెలుపొందిందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేగాక ప్రధానమంత్రి నరేంద్రమోడీ చరిష్మా, బిజెపి అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహ, ప్రతివ్యూహాలు బిజెపి విజయానికి దోహదపడ్డాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భారతదేశం - న్యూఢిల్లీలో ఒక ఇంటి సహాయకురాలిగా పనిచేసే సీమా దాస్, రాష్ట్ర ఎన్నికలలో ఓటు వేయడానికి సమయానికి ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశ్యంతో, రైళ్ల మారుతూ, భారతదేశంలోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తన గ్రామానికి రెండు రోజుల ప్రయాణం చేసింది. 2011 నుండి ఈ తూర్పు భారత రాష్ట్రంలో అధికారంలో ఉన్న మధ్యేవాద రాజకీయ శక్తి అయిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిఎంసి) పార్టీకే దాస్ గతంలో ఎప్పుడూ ఓటు వేసేది. కానీ ఈసారి, బెనర్జీకి ఉన్న ముద్దుపేరు ‘దీదీ’ (బెంగాలీలో దీనికి అక్క అని అర్థం) ‘ముస్లింలకు అనుకూలంగా ఉంటుంది’ అని తన అత్తగారు తనను ఒప్పించారని ఆమె చెప్పింది. హిందూ అయిన దాస్ ఇంకా ఇలా అన్నారు. ‘దీదీ దారి తప్పారు, అధికారంలో కొనసాగడానికి కేవలం ముస్లింలను ప్రసన్నం చేసుకుంటున్నారు. మత బహుళత్వానికి, మైనారిటీ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే టిఎంసిపై, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి చెందిన హిందూ మెజారిటీవాద భారతీయ జనతా పార్టీ చాలాకాలంగా ఈ ఆరోపణ చేస్తూ వస్తోంది. కానీ, సాంప్రదాయకంగా నామమాత్రపు పార్టీగా ఉన్న ఈ రాష్ట్రంలో బిజెపి పట్టు సాధిస్తున్నప్పటికీ, 9 కోట్లకు పైగా జనాభా ఉన్న ఈ రాష్ట్రంలో బెనర్జీ, ఆమె పార్టీ 15 ఏళ్లుగా పాలిస్తున్నారు. సోమవారం, ఆ పరిస్థితి మారింది. మోడీ పార్టీ పశ్చిమ బెంగాల్‌ను గెలుచుకుంది. ఏప్రిల్‌లో జరిగినప్పటికీ, మే 4న ఓట్ల లెక్కింపు పూర్తయిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల తొలి ఫలితాలు, బిజెపికి చెందిన సిద్ధాంత వ్యవస్థాపకుడు పుట్టిన ఈ రాష్ట్రంలో, మోడీ పటిష్టమైన ఎన్నికల యంత్రాంగం ఆ పార్టీకి భారీ మెజారిటీని అందించడానికి దోహదపడ్డాయి. అయితే, ఈ రాష్ట్రంలో బిజెపి ఇంతకు ముందెన్నడూ గెలవలేదు. రాష్ట్రంలోని 292 స్థానాలకు గాను బిజెపి 204 స్థానాల్లో గెలుపొందింది. 2021లో బిజెపి అత్యుత్తమ ప్రదర్శన 77 స్థానాలు. మరోవైపు, బెనర్జీకి చెందిన టిఎంసి కేవలం 83 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది.

# 23 రాష్ట్రాల్లో బిజెపి, ఎన్డీయే కూటమిదే అధికారం

## మ్యాప్‌తో ట్వీట్‌చేసిన బిజెపి కేంద్రకమిటీ




**న్యూఢిల్లీ, మే 4:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి గెలుపు నేపథ్యంలో బిజెపి ఎక్స్ వేదికగా మోడీ మయమైన భారత్ అని ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చింది. బిజెపి ఒంటరిగాను, మిత్రపక్షాలతోను కలిసి మొత్తం 23 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నట్లు గుర్తుచేసింది. పార్టీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది. హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అసోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

# ఎన్నికలవేళ ఆసక్తి రేపిన మోడీ ట్వీట్

**న్యూఢిల్లీ, మే 4:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ఉత్కంఠగా సాగుతున్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. నైపుణ్యం, కృషి, కరుణ వంటి మానవ విలువల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆయన చేసిన ఈ ట్వీట్‌పై భిన్నమైన వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. నైపుణ్యం, శ్రద్ధ, కరుణ అనేవి మన జీవితంలోని అద్భుతమైన శక్తులు. వాటితో మనం ప్రతి సవాలును అధిగమించడమేకాకుండా, మన లక్ష్యాలను కూడా సాధించగలం” అని ప్రధాని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. “సమర్థునికి భారం ఏముంటుంది? శ్రమించే వారికి దూరం అనేదిఉంటుందా? బాగా చదువుకున్నవారికి అపరిచిత ప్రదేశం అంటూ ఏదీ ఉండదు” అని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న కీలక తరుణంలో ప్రధాని ఈ విధమైన తాత్విక సందేశం ఇవ్వడంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. ఇది కేవలం స్ఫూర్తిదాయక సందేశమని కొందరు అంటుండగా, మరికొందరు దీని వెనుక రాజకీయ సంకేతాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

# కేరళంలో 13 మంది మంత్రుల ఓటమి

## స్వల్పమెజార్టీతో ధర్మదంలో గట్టెక్కిన సిఎం విజయన్

**తిరువనంతపురం,మే 4:** కేరళం రాజకీయాల్లో అధికార లెఫ్ట్ కూటమికి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. సిఎం పినరయి విజయన్ నేతృత్వంలోని క్యాబినెట్‌లో మెజారిటీ మంత్రులు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమికి తీవ్ర భంగపాటు ఎదురైంది. పినరయి క్యాబినెట్‌లోని 21 మంది మంత్రులకు గాను 20 మంది పోటీ చేయగా, వారిలో ఏకంగా 13మంది ఓటమి పాలయ్యారు. తుది ఫలితాలు వెలువడుతున్నతరుణంలో, యూడీఎఫ్ 102 స్థానాల్లో, లెఫ్ట్ కూటమి 35, ఎన్డీయే 3 స్థానాల్లో విజయం సాధించాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్మదం స్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ, ఆయన ప్రజాదరణ తగ్గినట్లు ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. 2021లో 50వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన ఆయన, ఈసారి ఆరో రౌండ్ లెక్కింపు వరకు వెనుకంజలో ఉన్నారు. చివరికి కేవలం 19వేల 400 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గట్టెక్కారు.

# టివికె విజయానికి మేనిఫెస్టోయే కీలకం!



**చెన్నై, మే 4:** తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో తమిళగ వెట్రి కజగం ప్రభంజనం సృష్టించింది. ఆ పార్టీ చీఫ్ విజయ్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో విజయానికి కీలకంగా మారింది. మహిళలు, రైతులు, యువత లక్ష్యంగా అనేక హామీలు ఇచ్చారు. 60 ఏళ్లలోపు ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఏడాదికి ఆరు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రభుత్వ శాఖ, ప్రత్యేక మహిళా కోర్టులు వంటివి టివికె వాగ్దానం చేసింది. ప్రతి వధువుకు ఒక సావరిన్ బంగారు నాణెం, ఒక పట్టు చీర, తల్లులకు, పుట్టిన శిశువుకు బంగారు ఉంగరం ఇస్తామని హామీ ఇచ్చింది. పాఠశాల మానేసే బాలికల సంఖ్యను తగ్గించడానికి, వారి తల్లులు లేదా సంరక్షకులకు సంవత్సరానికి రూ.15వేలు అందజేస్తామని తెలిపింది. మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.5 లక్షల వరకు ఒకేసారి ఆర్థిక సహాయం అందిస్తామని, యువత కోసం మేనిఫెస్టోలో కీలక హామీలను విజయ్ పార్టీ ప్రకటించింది. 12వ తరగతి నుంచి పీహెచ్డీ స్థాయి విద్యార్థులకు రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ నియామకాలన్నింటికీ ఒక పారదర్శక కాలపరిమితిని వాగ్దానం చేసింది. పట్టభద్రులకు నెలకు రూ.4వేలు, డిప్లొమా హోల్డర్లకు రూ.2,500 నిరుద్యోగ భృతిని కూడా అందిస్తామనిపేర్కొంది. నిరుద్యోగులకు, కార్మికులకు నైపుణ్య శిక్షణతో పాటు ఆదాయ వనరులు సమకూరుస్తామని టివికె హామీ ఇచ్చింది. నైపుణ్య శిక్షణ పొందుతున్న నిరుద్యోగ పట్టభద్రులకు నెలకు రూ.10,000, ఐటీఐ డిప్లొమా హోల్డర్లకు రూ.8,000 అందిస్తామని తెలిపింది. ‘సిఎం పీపుల్ సర్వీస్ అసోసియేట్’ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో ఐదు లక్షల మంది యువతకు ఉపాధికల్పిస్తామని ఆపార్టీ వాగ్దానంచేసింది. ఈ ఉద్యోగం ద్వారా వారు నెలకు రూ.18,000 సంపాదిస్తారని పేర్కొంది. సిబ్బందిలో 75 శాతం స్థానికులను నియమించుకునే కంపెనీలకు 2.5 శాతం జీఎస్టీ సబ్సిడీ, విద్యుత్ ఛార్జీలపై 5 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొంది.

మరోవైపు విజయ్ తన మేనిఫెస్టోలో రైతులకు గణనీయమైన హామీలు ఇచ్చారు. ఐదు ఎకరాల వరకు భూమి ఉన్నవారికి సహకార వ్యవసాయ రుణమాఫీ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారికి 50 శాతం రుణ మాఫీ చేస్తామని పేర్కొన్నారు. వరికి క్వింటాల్‌కు రూ.3,500, చెరకుకు రూ.4,500 చొప్పున చట్టబద్ధంగా మద్దతు ధరను ప్రకటించారు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రూ.10వేలు అందించడంతో పాటు సాగుదారుల హక్కుల కార్డును ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలన్నీ పొందేందుకు వీలుగా ప్రతి కుటుంబానికి ఒక పౌర ప్రత్యేకాధికార కార్డు అందిస్తామని టీఎంకే పేర్కొంది. అలాగే అన్ని ప్రభుత్వ సేవలను సకాలంలో అందించడాన్ని చట్టబద్ధం, తప్పనిసరి చేసే సేవా హక్కు చట్టంను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పౌరులు నేరుగా రాష్ట్ర శాసనసభకు వినతిపత్రాలను సమర్పించవచ్చని పేర్కొంది. వాటిలో 5 లక్షల స్పందనలను చర్చకు స్వీకరిస్తామని, 10 వేల సంతకాలతో కూడిన వినతులకు ప్రభుత్వం నుంచి తప్పనిసరి స్పందన లభిస్తుందని వాగ్దానం చేసింది. మరోవైపు దక్షిణ రాష్ట్రంలోని కార్మికుల నిరంతర డిమాండ్ అయిన పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించడాన్ని పరిశీలిస్తానని విజయ్ హామీ ఇచ్చారు.

ఐదేళ్లు పూర్తి చేసుకున్న తాత్కాలిక ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని, పారదర్శక బదిలీ విధానాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది మూలవేతనాన్ని రూ.18,000 నుంచి రూ.25,000కు పెంచడంతో పాటు, ‘అధిక ఒత్తిడి భత్యం’ కింద అదనంగా రూ.1,000 ఇస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ వంటి అనేక హామీలు ఇచ్చారు. ఏప్రిల్ 16న 95 పేజీల మేనిఫెస్టో విడుదల సందర్భంగా విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరువళ్లువర్ రచించిన తమిళ గ్రంథం ‘తిరుక్కురళ్‌లోని సూత్రాలైన అరం (సద్గుణం), పొరుళ్ (సంపద) ఇన్‌బం (ఆనందం) వంటి వాటిపై ఇది ఆధారపడి ఉందని తెలిపారు. ఈ గుణాలే రాజకీయ, పరిపాలనలకు అత్యవసరమైన అంశాలని తెలిపారు. నిజాయితీతో కూడిన పరిపాలనను తన సిద్ధాంతంగా టీవీకే స్వీకరించింది. మా పార్టీ తొలి ఎన్నికల మేనిఫెస్టో కూడా నిజాయితీకి హామీయే. ప్రస్తుత తమిళనాడు సీఎం (స్టాలిన్) లాగా ప్రజలను మేం తప్పుదోవ పట్టించం. ప్రజలకు ఉత్తుత్తి వాగ్దానాలతో కూడిన తొందరపాటు మేనిఫెస్టోను మేం తయారు చేయలేద్దు అని ఆయన అన్నారు.

# పాతమిత్రుడే.. సిఎం స్టాలిన్‌ను ఓడించాడు!



**చెన్నై, మే 4:** తమిళనాడు రాజకీయాల్లో ఒక చారిత్రక సంచలనం నమోదైంది. ముఖ్యమంత్రి, ద్రవిడ మున్నేట్ర కళగం (డిఎంకె) అధినేత ఎంకె స్టాలిన్ తన కంచుకోట లాంటి కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీకి చెందిన సాధారణ అభ్యర్థి వీఎస్ బాబు, ఏకంగా ముఖ్యమంత్రిని 8,795 ఓట్ల తేడాతో ఓడించి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఈ విజయం ఒక మామూలు గెలుపు కాదు, 15 ఏళ్ల నాటి అవమానానికి తీర్చుకున్న రాజకీయ ప్రతీకారంగా తమిళనాట చర్చ జరుగుతోంది. బలమైన నేత ముఖ్యమంత్రిని ఓడించిన వీఎస్ బాబు నేపథ్యం ఎంతో ఆసక్తికరం. ఒకప్పుడు ఈయన స్టాలిన్‌కు అత్యంత సన్నిహితుడు, డీఎంకేలో కీలక నేత. 2011లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన కొళత్తూర్ నుంచి స్టాలిన్ తొలిసారి పోటీ చేశారు. అప్పుడు ఉత్తర చెన్నై జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న వీఎస్ బాబు, స్టాలిన్ ఎన్నికల ప్రచార బాధ్యతలను భుజానకెత్తుకున్నారు. ఆ ఎన్నికల్లో స్టాలిన్ గెలిచినప్పటికీ, కేవలం 2,734 ఓట్ల స్వల్ప మెజారిటీ మాత్రమే వచ్చింది. స్టాలిన్ వంటి కీలక నేతకు అంత తక్కువ మెజారిటీ రావడంపై డీఎంకే అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనికి బాబునే బాధ్యుడిని చేస్తూ ఆయన్ను పదవి నుంచి తప్పించి, పార్టీలో పక్కనపెట్టింది. పార్టీలో తనకు జరిగిన అవమానంతో వీఎస్ బాబు డీఎంకేను వీడారు. 2026 ఫిబ్రవరిలో నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో చేరి తన రాజకీయ జీవితాన్ని మలుపుతిప్పుకోగలిగారు. 2011 తర్వాత జరిగిన 2016, 2021 ఎన్నికల్లో సీఎం స్టాలిన్ కొళత్తూర్ నుంచి వరుసగా 37,730, 70,384 ఓట్ల భారీ మెజారిటీలతో గెలిచి ఆ నియోజకవర్గాన్ని తన కంచుకోటగా మార్చుకున్నారు. ఆ స్థానంలో, ఒకప్పుడు తన గెలుపు కోసం పనిచేసి అవమానంతో బయటకు వెళ్లిన వ్యక్తి చేతిలోనే ఓటమి పాలుకావడం స్టాలిన్‌కు రాజకీయంగా పెద్ద దెబ్బ.

# జోర్హాట్‌నుంచి అసోం పిసిసి చీఫ్ గౌరవ్ గొగోయ్ ఓటమి



**గువాహతి, మే 4:** అస్సాంలోని కాంగ్రెస్ యువ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జోర్హాట్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయన మొదటి ప్రయత్నంలోనే ఓడిపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జోర్హాట్ ఎంపీగా గౌరవ్ గొగోయ్ ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్‌పై 1.4 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలిచారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి జోర్హాట్ అసెంబ్లీ స్థానం నుంచి గౌరవ్ గొగోయ్ పోటీ చేశారు. తన గెలుపుతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే బిజెపికి చెందిన హితేంద్ర నాథ్ గోస్వామి చేతిలో 20వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోవైపు బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే హితేంద్ర నాథ్ గోస్వామి వరుసగా ఆరుసార్లు జోర్హాట్ నియోజకవర్గంలో గెలిచారు. ఏజీపీ నేతగా మూడుసార్లు, బిజెపి ఎమ్మెల్యేగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి కూడా జోర్హాట్‌లో గెలుపును బిజెపికి అందించారు. అలాగే ఆ పార్టీ తరుఫున వరుసగా మూడో విజయాన్ని ఆయన సొంతం చేసుకున్నారు. 59వేలకు పైగా ఓట్లు సాధించారు.

# మమత కంచుకోటలో పెల్లుబికిన వ్యతిరేకత

**కోల్‌కతా, మే 4:** పశ్చిమ బెంగాల్‌ను 1977 నుండి పాలిస్తున్న కమ్యూనిస్ట్ పార్టీల కూటమిని నేరుగా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో నిరాశ చెందిన మమతా బెనర్జీ, ఆ పార్టీతో సంబంధాలు తెంచుకుని 1998లో టిఎంసిని స్థాపించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన ఈ న్యాయవాది, విద్యార్థి కార్యకర్తగా, ఆపై రాజకీయ నాయకురాలిగా ఎదిగి, చివరకు 2011లో కమ్యూనిస్టులను ఓడించి రాష్ట్రంలో విజయం సాధించారు. 2014లో మోడీ భారత ప్రధాని అయినప్పటి నుండి, ఆమె బిజెపికి కీలక ప్రత్యర్థిగా ఎదిగారు. తన రాజకీయాలను, ముఖ్యంగా బెంగాల్ ముస్లింల పక్షాన నిలబడటాన్ని, హిందూ మెజారిటేరియనిజానికి వ్యతిరేక చర్యగా ఆమె చిత్రీకరించారు. ఆమె మహిళా కేంద్రీకృత సంక్షేమ పథకాల శ్రేణిని కూడా ప్రారంభించారు. పెద్ద పరిశ్రమలు కోరుతున్న వివాదాస్పద భూసేకరణ ప్రాజెక్ట్ లను వ్యతిరేకించారు. “మమతకు స్పష్టమైన మద్దతు ఉంది, ఆమెకు ప్రజాదరణ కూడా ఉంది. కానీ టిఎంసి యంత్రాంగంపై వ్యతిరేకత ఉంది, ప్రజల దైనందిన జీవితంలో వారి జోక్యం పట్ల ప్రజలు సంతోషంగా లేరు” అని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. “తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత లేకపోతే, పశ్చిమ బెంగాల్‌కు ఈ రకమైన ఫలితం వచ్చేది కాదు” అని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు రాహుల్‌వర్మ నొక్కి చెప్పారు. ఈఎన్నికల్లో దాదాపు 6.82కోట్ల మంది, అంటే సుమారు 92.93 శాతం మంది ఓటువేశారు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం. “ఓటర్లకు కొత్తదనాన్ని అందించ డంలో, తమపై ఉన్న బలమైన ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడంలో” బెనర్జీ పార్టీ విఫలమైందని న్యూఢిల్లీలోని ‘సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్’ రాజకీయ విశ్లేషకుడు ప్రవీణ్‌రాయ్ అన్నారు. “తమ సిద్ధాం తాన్ని అంగీకరిం చని ప్రజల పట్ల పార్టీ వ్యవస్థ శత్రుత్వంతో వ్యవహరించింది” అని పేర్కొ న్నారు. “ఆర్థిక లేమి, సామాన్య ప్రజల ఆకాం క్షల పట్ల పెరుగుతున్న అసంతృప్తిని గుర్తించ డంలో టిఎంసి విఫలమైంది” అని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ ఓటమి, మోడీ పదవికి జాతీయ స్థాయిలో పోటీదారుగా ఎదగాలన్న బెనర్జీ ఆశలనుకూడా బలహీన పరుస్తుందని రాయ్ జోడించారు. అయితే, ఈ ఫలితం ప్రభావాలు బెనర్జీకి మాత్రమే పరిమితం కావని ఆయన అన్నారు. బిజెపి విజయం, టిఎంసి అనూహ్య పరాజయం “మోడీని వ్యతిరే కించే అన్నిపార్టీల రాజకీయబలాన్ని తగ్గిస్తాయి”. ఇది రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఒక పెద్ద మార్పు. 2024 సార్వత్రిక ఎన్నికలలో, మోడీ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో, మనుగడ కోసం మిత్ర పక్షాల మద్దతుపై ఆధారపడాల్సి వచ్చింది. సోమ వారం నాటి ఎన్నికల విజయాలు, జాతీయ ఎన్నికలలో ఎదురైన “ఎన్నికల ఎదురుదెబ్బను పూడ్చాయి” అని అన్నారు.“ఇది మోడీనాయకత్వం జాతీయ స్థాయిని గణనీయంగా పెంచుతుంది. భారత దేశాన్ని పాలించేందుకు పార్టీ ఆధిపత్య శక్తిని విస్తరిస్తుంది“ అని రాయ్ అన్నారు.

# బిజెపి వైపు ముస్లింల మొగ్గు!

## హిందువుల ఓట్లు ఏకీకృతం అయ్యాయి: సువేందు అధికారి

**న్యూఢిల్లీ, మే 4:** పశ్చిమ బెంగాల్‌లో “ఓటర్ల ప్రాధాన్యతలలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య పెద్ద వ్యత్యాసం ఈసారి ఎన్నికల్లో స్పష్టమైంది. అలాగే బెంగాల్‌లో ముస్లిం జనాభా అసమానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంది, వీటి దృష్ట్యా, ఫలితం బిజెపికి భారీ తేడాతో వచ్చింది. “చారిత్రాత్మకంగా, బిజెపి హిందూ మెజారిటీ రాజకీయాల కారణంగా, పశ్చిమ బెంగాల్‌లో గెలిచే అవకాశం ఆ పార్టీకి లేదని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు. బిజెపి తనను తాను హిందూ ఓటర్ల పార్టీగా చెప్పుకోవడానికి వెనుకాడలేదు. రాష్ట్రంలో బిజెపి నాయకుడు, ముఖ్యమంత్రి పదవి రేసులో ముందున్న సువేందు అధికారి మాట్లాడుతూ, “హిందువుల ఓట్లు ఏకీకృతం అయ్యాయి“ అని అన్నారు. అయితే, గతంలోలాగా చాలా మంది ముస్లింలు కూడా మమతా బెనర్జీ పార్టీ టిఎంసికి ఓటు వేయకుండా, బిజెపి వైపు మొగ్గు చూపారని ఆయన పేర్కొన్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసిని “ముస్లిం అనుకూల పార్టీ“గా అభివర్ణిస్తూ, “బిజెపికి అనుకూలంగా ఓటు వేసిన ప్రతి హిందూ సనాతనుడికి తాను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను,“ అని అధికారి అన్నారు. బిజెపికి పశ్చిమ బెంగాల్‌లో లభించిన ఈ విజయం ఎంతో ప్రతీకాత్మకమైనది. 1951లో బిజెపికి పూర్వగామి అయిన భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఈ రాష్ట్రానికి చెందినవారే. ఎన్నికల ముందు ఓటర్ల సవరణపై పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్‌కు ముందు, ఇసి ఒక ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఓటర్ల జాబితాల సవరణను చేపట్టింది. ఇప్పటివరకు డజనుకు పైగా రాష్ట్రాల్లో అధికారులు ఇలాంటి సవరణలను నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఈ ప్రక్రియ వివాదాస్పదంగా, రాష్ట్రంలోని 76 మిలియన్ల ఓటర్లలో దాదాపు 12 శాతం మంది అయిన 9 మిలియన్ల మందికి పైగా ప్రజలను ఓటర్ల జాబితా నుండి తొలగించి, ఎన్నికలలో ఓటు వేసే వారి హక్కును హరించింది. వారిలో దాదాపు 6 మిలియన్ల మందిని గైర్హాజరుగా లేదా మరణించినవారిగా ప్రకటించగా, మిగిలిన 3 మిలియన్ల మంది ఎన్నికలకు ముందు అందుబాటులో ఉన్న తక్కువ సమయంలో వారి కేసులను విచారించడానికి ప్రత్యేక ట్రిబ్యునల్స్ లేకపోవడంతో ఓటు వేయలేకపోయారు. తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు, పలు రాష్ట్రాల్లోని ఇతర ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితా సవరణలోని వ్యత్యాసాలను ఎత్తిచూపుతూ, ఎన్నికల సంఘం బిజెపికి వత్తాసు పలుకుతోందని ఆరోపించాయి. ఈ ప్రక్రియ ఎన్నికలకు ముందే ముస్లింలను అసమానంగా ఓటు హక్కు కోల్పోయేలాచేసిందని హక్కుల కార్యకర్తలు, పరిశీలకులు భావిస్తున్నారు. “అస్పష్టమైన, తొందరపాటుతో కూడిన, రాజ్యాంగ విరుద్ధమైన్న ఈ సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ బెనర్జీ భారత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. సుప్రీంకోర్టు, ప్రభావితమైన లక్షలాది మందికి ఓటు హక్కులను పునరుద్ధరించలేదు కానీ, ప్రభావిత ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఇసిని ఆదేశించింది. “ఒకసారి తాను ఓటర్ల జాబితాలో ఉండాలా వద్దా“ అనే ప్రశ్న బలహీన వర్గాల ప్రజలకు ప్రధాన ప్రశ్నగామారినప్పుడు, ఇది మామూలు రాజకీయం కాదు” అని సిర్కార్ అన్నారు. “ఓటర్ల జాబితా సవరణ వల్ల ఏర్పడిన ధ్రువీకరణ స్థాయిని రాష్ట్రం వెలుపల ఉన్న ప్రజలు నిజంగా గ్రహించలేరు.

“మోడీ ప్రభుత్వం కూడా ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్‌కు 2,400 కంపెనీల పారామిలిటరీ దళాలను పంపింది. ఇటువంటి రాష్ట్ర ఎన్నికలకు ఇది ఒక రికార్డు. రాజకీయ హింస భయం లేకుండా ఈ ప్రక్రియను నిర్వహించడంలో ఎన్నికల అధికారులకు సహాయపడటానికే ఇది అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఓటర్లను భయపెట్టడానికో లేదా ప్రభావితం చేయడానికో ఈ భద్రతా బలగాలను మోహరించారని టిఎంసి, ఇతర ప్రతిపక్ష పార్టీలు వాదించాయి.“భారీగా భద్రతా బలగాలు మోహరించడం బిజెపికి అనుకూల పరిస్థితిని కూడా సృష్టించి ఉండవచ్చు,“ అని శివ్ నాదర్ విశ్వవిద్యాలయానికి చెందిన వర్మ వాదించారు. తటస్థంగా ఉన్నవారు, క్షేత్రస్థాయిలో టిఎంసి యంత్రాంగానికి భయపడినవారు కూడా దీనితో ప్రభావితులయ్యారు. “భారతదేశంలోని ప్రతిపక్ష పార్టీలకు, భారత ఎన్నికల సంఘానికి మధ్య విశ్వాస స్థాయి చాలా తక్కువగా ఉందనడంలో సందేహం లేదు” అని వర్మ అన్నారు. అయితే, కేవలం ఓట్ల సవరణ ప్రక్రియ మాత్రమే బిజెపికి ఇంతటి నిర్ణయాత్మక విజయాన్ని అందించలేదని, ఇది అధికార వ్యతిరేకత, మతపరమైన ధ్రువీకరణతో సహా అనేక ఇతర అంశాలను ప్రతిబింబిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ, మమత పోరాటం చేయకుండా వైదొలగరని విశ్లేషకులు అన్నారు.

# పార్టీ పెట్టి తొలి ఎన్నికల్లోనే గెలిచి సిఎంలయిన జాబితాలో విజయ్



**చెన్నై, మే 4:** తెలుగు నాట, తమిళ నాట సినిమా స్టార్స్‌ను ప్రేక్షకులు అభిమానించి, ఆదరించే తీరు చాలా ప్రత్యేకంగా ఉంటుంది. స్టార్స్‌ను కొందరు తమ ఇంటి మనుషుల్లా చూస్తారు. మరికొందరు దేవుడిగా చూస్తారు. అందుకే స్టార్స్ రాజకీయ రంగంలోనూ తమదైన ముద్రలో చెలామణీ అవుతున్నారు. రాజకీయ పార్టీలు స్థాపించి, ఏకంగా రాష్ట్రాలకు సిఎంలు అవుతున్నారు. అది కూడా పార్టీ పెట్టిన తర్వాత తొలి ఎన్నికల్లోనే అఖండ విజయం సాధించి సిఎంలు అవుతున్నారు. తాజాగా టివికె పార్టీ అధినేత, సూపర్ స్టార్ విజయ్ కూడా తమిళనాడు సిఎం పదవి చేపట్టబోతున్నారు. విజయ్ కంటే ముందు ఇద్దరు స్టార్స్ మాత్రమే ఇలా పార్టీలు స్థాపించి, మొదటి ఎన్నికల్లోనే విజయం సాధించారు. వారు ఒకరు ఎంజీఆర్. రెండోది ఎన్టీఆర్. తమిళనాడులో పెద్ద హీరోగా ఉన్న ఎంజీఆర్ (ఎంజీ రామచంద్రన్) 1972లో ఎఐఎడిఎంకె స్థాపించారు. ఆయన డిఎంకె పార్టీ నుంచి బయటకు వచ్చి తన సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత మొదటిసారి 1977లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తమిళనాడు సీఎంగా పదవి చేపట్టారు. అంటే పార్టీ పెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఆయన ఘన విజయం సాధించారు.

ఆయన తర్వాత తెలుగు వారికి సంబంధించి అప్పట్లో ఉమ్మడి ఏపిలో సీనియర్ స్టార్ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని భారీ విజయం సాధించారు. తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే విజయం సాధించిన ఎన్టీఆర్ సిఎం పదవి చేపట్టారు. ఆ తర్వాత నటుడు విజయ్ ఇప్పుడు తమిళనాడులో టివికెను స్థాపించి, అధికారం చేపట్టబోతున్నారు. ఆయన 2024లో పార్టీని స్థాపించారు. ఆ తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలివి. ఈ ఎన్నికల్లోనే విజయం సాధించి సిఎం పదవి చేపట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమకు సంబంధించి ముగ్గురు నటులు ఇలా పార్టీలు స్థాపించి, ఆ వెంటనే సీఎం పదవి చేపట్టారు.

5-5Pg6exHMNWJQE.qxd:5-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:18 AM Page 1



# కార్గిల్ యుద్ధం భారతదేశ శక్తిని చాటింది




- చిత్తూరు ఎంపి ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు

**తిరుపతి కలెక్టరేట్, మే 4 ప్రభాతవార్త:** 1999వ సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధం భారతదేశ శక్తిని చాటిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిందని, భారతీయ పౌరుల్లో స్ఫూర్తిని నింపిందని గుర్తు చేసుకున్నారు. కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దేశంలోని అత్యంత విజయవంతమైన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో లెఫ్టినెంట్ జనరల్ వెంకటేశ రెడ్డి ఆధ్వర్యంలో 21 మంది వెటరన్స్ బృందం విజయ అమృత్ కలశ్" యాత్రను చేపట్టారు. ఈ యాత్ర సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ బృందానికి సాదర స్వాగతం పలికిన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు విజయ అమృత్ కలశ్ యాత్రకు శ్రీకారం చుట్టిన లెఫ్టినెంట్ జనరల్ వెంకటేశ రెడ్డి దేశ సేవను అభినందించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర వీరులకు నివాళి అర్పించారు. అలాగే విజయ అమృత్ కలశాలపై పుష్పాలు సమర్పించి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఎంపి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగిన సమయంలో తనకు సుమారు 38 నుంచి 40 ఏళ్లు ఉండేవని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో ప్రతిరోజూ రేడియోలలో, పత్రికల్లో యుద్ధ విశేషాలను చాలా ఆసక్తిగా వినేవాడిని, చదివేవాడిని. అప్పటి యుద్ధం ఇప్పటిలా క్షి పణులు లేదా వైమానిక దళంతో కాకుండా, ప్రధానంగా భూమిపై సైనికుల మధ్య సాగిందని చెప్పారు. ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించారనీ అలనాటి స్మృతులను గుర్తు చేశారు. ఈ యాత్ర జులై 26, 2026 నాటికి విజయవంతంగా కార్గిల్ చేరుకోవాలని, ఇది దేశంలోని పౌరులందరిలో స్ఫూర్తిని నింపాలని తాను కోరుకుంటున్నానని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజయ్ అమృత్ కలాష్ యాత్రలో భాగమైనందుకు తనకు చాలా గర్వంగా మరియు సంతోషంగా ఉందన్నారు. కార్గిల్ యుద్ధం సమయంలో దేశం మొత్తం ఏకతాటిపైకి రావడం తనకు ఇప్పటికీ గుర్తుందని, కేవలం సాయుధ దళాలే కాకుండా, భారతదేశంలోని ప్రతి పౌరుడు అమరవీరులకు అండగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని చెప్పారు. "విజయ అమృత్ కలశ్" యాత్రను శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావుతో కలిసి ప్రారంభించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిగేడియర్ శివశంకర్, కల్నల్ బి.యు. హరి, మేజర్ రఘురామ్ రెడ్డి, కెప్టెన్ ఎస్.సి. భండారి, యుద్ధంలో పాల్గొన్న ఇతర సభ్యులు, రిటైర్డ్ ఆర్మీ వెటరన్స్ బృందం ఉన్నారు.

# ప్రేమజంట ఆత్మహత్య

- కడపలో యువకుడు.... చెన్నూరులో యువతి




**కడప క్రైమ్, మే 4 ప్రభాతవార్త:** వారిరువురు చెన్నూరు ప్రాంతానికి చెందిన వారే. ఇరువురు కులాలు వేరైనా ఒకే స్కూల్లో చదివారు... ప్రస్తుతం కడప బాలాజీ నగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బిఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. యువ జంట తరువాత గత కొన్ని సంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అనోన్యంగా వుండి చదువకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నట్లుండి ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈనెల 3వ తేదీన తబంధువుల వివాహానికి వెళ్లి వచ్చారు. యువకుడు కడప నగరం మృత్యుంజయ కుంటలోని బాబాయ్ ఇంటికి వెళ్లి ఉన్నాడు. తరువాత ఇంటిలో ఉరేసుకునిఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకుని యువతి మనస్తాపానికి గురైచెన్నూరులోని తమ ఇంటికి వచ్చి సోమవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఈ సంఘటన కడప నగరంతో పాటు చెన్నూరు, జిల్లాలో సంచలనం కలిగించింది. ఈ సంఘటనపై కడప చిన్నచౌక్. చెన్నూరు పోలీసుల తెలిపిన వివరాలిలా వున్నాయి.

కడప జిల్లా చెన్నూరులోని లక్షి ్మనగర్కు చెందిన గిరిరాజు కుమారుడు యోగేంద్ర కుమార వర్మ(20), గోదిన వీధికి చెందిన హేమశ్రీ(19) ఇరువురు పరస్పరం కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు ప్రస్తుతం కడప నగరంలోని బాలాజీ నగర్ పరిధిలో వున్న ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల సమయం ముగియగానే యువకుడు వాహనాలను నడుపుతూ డబ్బులను సంపాదించేవాడు. ఆ డబ్బును తన అవసరాలతో పాటు, తాను ప్రేమించిన యువతి హేమశ్రీకి చేదోడువాదోడుగా వుండేవాడు. ఈక్రమంలోనే వారిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆదివారం ఇద్దరు కలిసి కడపలో జరిగిన ఓ వివాహానికి కూడా హాజరయ్యారు. తరువాత కడపలోని మృత్యుంజయకుంట సమీపంలో యోగేంద్ర తన బాబాయ్ ఇంటికి వెళ్లాడు. హేమశ్రీ చెన్నూరులోని తన ఇంటికి వచ్చింది. సెల్‌ఫోన్‌లో ఒకరినొకరు మాట్లాడుకున్నారు. యోగేంద్ర కోపంతో సెల్‌ఫోన్‌తో తన తలకేసి కొట్టుకున్నాడు. తరువాత కొంతసేపటికి తన చిన్నమ్మ ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు. పాల్పడ్డాడు. ఈ సంఘటనపై చిన్నచౌక్ పోలీసులు మృతుని తండ్రి. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. ఈసంఘటనను తెలుసుకున్న యువతి హేమశ్రీ. యోగేంద్ర మృతదేహాన్ని చూసేందుకు వెళ్లింది. తరువాత తీవ్ర మనస్థాపానికి గురైంది. అక్కడినుండి తన ఇంటికి వెళ్ళినా యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కడప రిమ్స్‌లోని మార్చురీకి తరలించారు. ఇరువురి బంధువుల ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్, చెన్నూరు పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంలో

# అలసత్వం వద్దు

- ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్

**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది అలసత్వాన్ని దరిచేరనీయొద్దని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో జాప్యాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించేందుకు సంస్థ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటీ) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కే.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, కె.ఆదిశేషయ్య, సిహెచ్ రామచంద్ర రావు, ఎం.మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, కే.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు జగదీష్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## లాసెట్‌కు 80శాతం హాజరు

**యూనివర్సిటీ(తిరుపతి), మే 4 ప్రభాతవార్త:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఏపీ లాసెట్ పీజీఎల్‌సెట్ – 2026 ప్రవేశ పరీక్షలకు 80శాతం మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలోని 100 కేంద్రాలలో రెండు సెషన్లలో ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. తిరుపతి పరీక్షా కేంద్రాన్ని లాసెట్ ఛైర్పర్సన్, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, లాసెట్ కన్వీనర్ ఆచార్య టి. సీత కుమారి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. 3 సంవత్సరాల కోర్సులో 78 శాతం, 5 ఏళ్ళ కోర్సులో 83 శాతం ఎల్ఎల్‌బి కోర్సులో 85 శాతం, మొత్తంగా 80 శాతం పరీక్షకు హాజరయ్యారని తెలియచేసారు.

# వైసిపికి ఆ పదకొండు కూడా రావు

- నెల్లూరులో మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 4, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు నగరం 3వ డివిజన్ పరిధిలోని దస్తగిరి నగర్‌లో 1.43 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. మంత్రికి స్థానిక ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఆక్రమణల కారణంగా 40 అడుగుల రోడ్డు కేవలం 12-15 అడుగులకే పరిమితమైందని, అయితే స్థానికులతో చర్చించి 20 అడుగుల వెడల్పుతో పనులు ప్రారంబించామని తెలిపారు. గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 10 లక్షల కోట్ల రూపాయల అప్పులను తీరుస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ఈ పనులను కేవలం 3 నెలల కాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశానికి వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే రావడం శుభపరిణామమని, దీని ద్వారా యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాజకీయ విమర్శలపై మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ మహానాడు ఎక్కడపెట్టాలో చెప్పడానికి వెళ్లేవరని వైసీపీ నేతలను ప్రశ్నించారు. వాళ్ళ తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా రావన్నారు. గతంలో తాను నెల్లూరులో చేసిన 5,300 కోట్ల అభివృద్ధి రికార్డును ఈ సారి అధిగమిస్తానని, ప్రజల సహకారంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాననని తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి నెల్లూరు నగరాభివృద్ధిపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ ముఖ్య నేతలు సంక్రాంతి కళ్యాణ్, కొమ్మూరి విజయమ్మ, కాకర్ల గోవర్ధన్, రవణయ్య నాయుడు, సుధీర్ నాయుడు పాల్గొన్నారు.

# మహానాడు హడావుడితో కిసాన్ సెజ్ కళకళ

- కొడవలూరులో వేగం పుంజుకున్న ఏర్పాట్లు
- మూడు రోజుల సిఎం చంద్రబాబు పర్యటనపై యంత్రాంగం ఫోకస్
- భూమిపూజ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ




**కొడవలూరు (నెల్లూరు), మే 4 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు వేడుకలకు నెల్లూరు జిల్లా వేదికగా మారుతున్న వేళ కొడవలూరు మండలంలోని కిసాన్ సెజ్ ప్రాంతం సందడిగా మారింది. మహానాడు భూమిపూజ కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణుల దృష్టి నెల్లూరుపై కేంద్రీకృతం కావడంతో అధికారులు, పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనులను ముమ్మరం చేశారు. ఈ ఏర్పాట్లను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణాన్ని మొత్తం పరిశీలించిన ఆయన వేదిక నిర్మాణం, రహదారులు, వాహన పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజుతో కలిసి పనుల పురోగతిని సమీక్షి ంచారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు రోజులపాటు జిల్లాలో ఉండనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భారీగా తరలిరానున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపడు తున్నారు. ఇప్పటికే స్థల సమతలీకరణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, తాత్కాలిక వసతుల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పరిశీలనలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, వాటర్ వేస్ చైర్మన్ జెడ్ శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనురాధ తదితర నేతలతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

# పామర్రులో దారుణం

## సోదరులతో భార్యను హతమార్చాడు

**విజయవాడ, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పామర్రులో దారుణ ఘటన చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కక్షతో కట్టుకున్న భార్యనే ఓ భర్త తన సోదరులతో కలిసి అతి కిరాతకంగా హత్య చేశాడు. గాంధీనగర్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతురాలిని దిమ్మెట లక్ష్మీ ప్రసన్న (30)గా గుర్తించారు. ఆమెకు 13 ఏళ్ల క్రితం మీర్జాపురం గ్రామానికి చెందిన మురళీ కృష్ణతో వివాహం అయింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా భర్త, పిల్లలను వదిలిపెట్టిన లక్షీ ్మప్రసన్న.. నిడుమోలు గ్రామానికి చెందిన అయ్యప్ప అనే వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోంది. ఈ విషయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న భర్త మురళీకృష్ణ, ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం సోమవారం ఉదయం గాంధీనగర్‌లో ఉన్న లక్ష్మీప్రసన్నపై తన ఇద్దరు సోదరులతో కలిసి ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. తలపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు పాల్పడిన భర్త మురళీకృష్ణతో పాటు అతనికి సహకరించిన ఇద్దరు సోదరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన ద్వేషంతో ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి



**సీతారామపురం (నెల్లూరు), మే 4, ప్రభాతవార్త:** సరదాగా ఈతకు వెళ్ళేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు చిన్నారులు మృతదేహాలు తేలిన ఘటన సోమవారం సీతారామపురంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే సీతారామపురంలోని బెస్తకాలనీకి చెందిన కృష్ణా సుబ్బారావు, స్వర్ణలతకు కృష్ణా ఆది (12), కృష్ణా రేవంత్ (13) చిన్నారులు ఉన్నారు. సోమవారం చిన్నారులు తమ చిన్నమ్మతో దుస్తులు ఉతికేందుకు సమీపంలోని చెరువు వద్దకు వెళ్ళగా ఆమె వెంట వెళ్లిన ఇద్దరు చిన్నారులు సరదాగా ఈత లాడేందుకు చెరువులోకి దిగడం ఎంత సేపటికి బయటకు రాకపోవడం గమనించిన చిన్నమ్మ చిన్నారులను కాపాడే ప్రయత్నంలో ఆమె కూడా నీటిలో మునిగింది. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోనిరైతులు చెరువు వద్దకు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా చిన్నారుల ఆచూకి దురకలేదు. చిన్నారుల చిన్నమ్మను బయటకు తీసి ప్రాణాపాయ స్దితిలో ఉండగా 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఈతగాళ్ళతో చిన్నారులను ఎతకగా మృదేహాలుగా తేలారు. చిన్నారుల తండ్రి సుబ్బారావు చేజర్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒకేకుటుంబంలో ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో సీతారామపురం గ్రామం శోక సముద్రంలో మునిగి పోయింది.

# ప్రకృతి అందాలను కాపాడుకోవాలి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు




**వరదయ్యపాలెం, మే 4 ప్రభాతవార్త:** సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి ఇచ్చిన అందాలను, సమస్త జీవరాసులను ప్రకృతి అందాలను కాపాడుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. వరదయ్యపాలెం మండలంలోని ఏకం క్యాంపస్‌టులో తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు అధ్యక్షత నరెండు రోజులు పాటు జరిగిన ప్రశిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఏకం సమస్త ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి ఇచ్చిన అందాలను, సమస్త జీవరాసులను కాపాడుకోవటం మన ధర్మం అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల యంత్రాంగాలుగా కాకుండా, సమాజాన్ని మార్గనిర్దేశం చేసే శక్తులుగా ఉండాలని, ఆదిశగా బిజెపి నిర్వహిస్తున్న ప్రశిక్షణ కార్యక్రమాలు పార్టీ శ్రేణులకు ఆలోచనా దార్శనికతను అందిస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పార్టీ నాయకులకు ఇచ్చిన దిశానిర్దేశం ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత కాలంలో రాజకీయ నాయకత్వం కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, సమాజానికి విలువలను చేరవేయాల్సిన బాధ్యత కలిగి ఉంది. సృష్టి ఇచ్చిన వనరులను, ప్రకృతి అందాలను, సమస్త జీవరాసులను కాపాడుకోవడం మన ధర్మం అని చెప్పారు. భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను గుర్తు చేసే సందేశంగా భావించాలి. ఇటీవలి కాలంలో అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరుల వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో, వాటి సంరక్షణపై రాజకీయ నాయకత్వం స్పష్టమైన దృక్పథం కలిగి ఉండటం అవసరం. ఈ అంశంపై పార్టీ స్థాయిలో చర్చలు జరగడం, శ్రేణులకు అవగాహన కల్పించడం వంటి చర్యలు సమాజానికి సానుకూల సంకేతాలు ఇస్తాయన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నాయకుల్లో క్రమశిక్షణ, సిద్ధాంతపరమైన అవగాహన, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తాయని తెలిపారు. మొత్తానికి, రాజకీయాల్లో విలువల ఆధారిత దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో, ఇలాంటి కార్యక్రమాలు కేవలం పార్టీకి మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలను రాజకీయ అజెండాలో భాగం చేయడం ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోలా ఆనంద్, జల్లి మధుసూదన్, బాచి, రాష్ట్ర అధికార ప్రతినిధులు, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ ముని సుబ్రహ్మణ్యం, జిల్లా జనరల్ సెక్రెటరీ లు బీడీ బాలాజీ, సత్యవేడు మునికృష్ణయ్య, డాక్టర్ నరేష్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా ఎక్స్ కార్యదర్శి, సిద్దులయ్య, వరదయ్యపాలెం లోకల్ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, స్థానిక నాయకులు వేలూరు పురుషోత్తం, కండ్రిక ఉమా, తేజవతి, ఇందు అంకమ్మ వేలూరు సూర్యనారాయణ, బొగ్గల సుబ్రహ్మణ్యం, ఏసు, ప్రసాద్, అన్వేష్ నాగేశ్వరావు, గోపి అంకయ్య ఎంజే కుమార్, భాస్కర్‌రెడ్డి సుబ్బరత్నమ్మ, ఆర్.మురళి, సుబ్రహ్మణ్యం, నలుమూలల నుండి బిజెపి ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బావిలో మునిగి ఇద్దరు బాలురు దుర్మరణం



**నాగలాపురం, మే 4 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం ఈసంగాడు గ్రామంలో సోమవారం ఇద్దరు చిన్నారులు బావిలో పడి మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈసంగాడు గ్రామానికి చెందిన సుభాషిణి ఇంటికి ఆమె చెల్లెలి పిల్లలు హర్షవర్ధన్ (11), చరణ్ (12) రెండు రోజుల క్రితం వేసవి సెలవులకు వచ్చారు. సోమవారం మధ్యాహ్నం సుభాషిణి కుమారుడు ఆదికేశవులు ఈ ఇద్దరు పిల్లలతో కలిసి ఎపి అగ్రికల్చర్ ఫారం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి వద్దకు భోజనం తీసుకెళ్లాడు. అక్కడ సమీపంలోని బావి వద్ద ఆడుకుంటున్న సమయంలో హర్షవర్ధన్, ఛరణ్ అదుపుతప్పి బావిలో పడిపోయారు. ఈత రాని ఆదికేశవులు వెంటనే కేకలు వేస్తూ స్థానికులను, పోలీసులకు సమాచారం అందించారు. నాగలాపురం ఎస్ఐ సునీల్, కానిస్టేబుళ్లు భూపతి, సాయికృష్ణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బావిలోకి దూకి చిన్నారులను బయటకు తీశారు. చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో తీవ్ర శోకసంద్రం నెలకొంది. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగే చెట్ల కొమ్మలు తొలగింపు



**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో కురిసిన ఈదురుగాలుల వానతో విరిగిన, ప్రమాదకరంగా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని తిరుపతి నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదాదేవి అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని బైరాగిపట్టేడ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు గాలి, వానకు విరిగిన చెట్ల కొమ్మల తొలగింపును అధికారులతో కలసి పరిశీలించారు. విరిగి పోయి వేలాడుతున్న వాటితోపాటు, ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. రుతుపవనాల ప్రభావం వలన వర్షాలు రానున్నాయని, ఈ లోపు ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి తొలగించి, వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడక్కడా పడిపోయి ఉన్న డ్రైనేజి కాలువలను గుర్తించి మరమ్మతులు చేయాలని తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిఇ మహేష్, ఎసిపి పార్వతి ప్రియ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# నేత్రదానం... మహాదానం ... విజయనగరంలో ఇద్దరి నేత్రాల సేకరణ



**విజయనగరం, మే 4 ప్రభాతవార్త:** 'మరణించిన తర్వాత కూడా మరో ఇద్దరికి చూపునిచ్చి వారి రూపంలో జీవించవచ్చు' అని విజయనగరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రిలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబ సభ్యులను ఒప్పించి, వారి నేత్రాలను రెడ్ క్రాస్ ఐ బ్యాంక్ ప్రతినిధులు సేకరించారు. విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెంకు చెందిన తెలగసెట్టి రామారావు (44) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. అలాగే, విజయనగరం అయ్యప్పనగర్‌కు చెందిన పి.చంద్రకళ (56) ఆసుపత్రికి తీసుకువచ్చే లోపే మరణించారు. ఈ విషాద సమయంలో రెడ్ క్రాస్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఏ.రమణ మృతుల కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ ఎల్.ఆనంద్ కుమార్ సహకారంతో, డిబిసిఎస్ డాక్టర్ త్రినాధరావు, డాక్టర్ రత్నకుమారిల సూచనల మేరకు నేత్రాలను (కార్నియాలను) విజయవంతంగా సేకరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, ప్రతి ఒక్కరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానవత్వంతో స్పందించి నేత్రదానానికి ముందుకు వచ్చిన మృతుల కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
మంగళవారం 5, మే 2026







# ఏపీ గ్రోత్ ఇంజన్ విశాఖ

**రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం -పరిశ్రమల ఏర్పాటుచేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి : ప్రవాసాంధ్రులకు విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపు**

# పీజీఆర్ఎస్ వినతులకు గడువులోపే పరిష్కారం

**జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశం**



**విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందే వినతులను గడువు దాటకముందే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఫిర్యాదుపై ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ ఓపెన్ కావద్దని, ఒకవేళ అలా జరిగితే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. సీఎంవో నుంచి వచ్చే ఫిర్యాదులను డీఆర్వో ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాలో పర్యటించే సమయంలో ప్రజల నుంచి స్వీకరించే వినతుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి, వాటిని ప్రాధాన్యతగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇదిలా ఉండగా, సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో మొత్తం 354 వినతులు నమోదయ్యాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 56, జీవీఎంసీకి 109, పోలీస్ శాఖకు 31, ఇతర శాఖలకు చెందినవి 158 వినతులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి తదితరులు పాల్గొనగా, రెవెన్యూ క్లినిక్‌లో ఆర్డీవోలు, తహశీల్దార్లు వినతులను స్వీకరించారు. జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు





# ప్రజలకు సంతృప్తికర సేవలందించడమే లక్ష్యం

**కలెక్టర్ల కాన్ఫరెన్స్ సన్నద్ధతపై సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్**




# వేసవిలో కాలుష్య నియంత్రణపై పోర్టులో సమీక్ష సమావేశం




**విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త :**

వేసవి కాలంలో కాలుష్య నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరాంజి కొరాటి (ఐఏఎస్) పాల్గొని పర్యావరణ పరిరక్షణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పోర్టు పరిధిలో గాలి కాలుష్యం, ముఖ్యంగా దుమ్ము నియంత్రణపై అధికారులు చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరించారు. ప్రధాన కార్గో రహదారులు, డాక్ ప్రాంతాల్లో నాలుగు ఇండస్ట్రియల్ స్వీపింగ్ యంత్రాలు పనిచేస్తుండగా, సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో ఆరు ఫాగ్ మెషీన్లు గాలిలో తేలే దుమ్మును తగ్గించేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. బల్క్ కార్గో ప్రాంతాల్లో దుమ్ము నియంత్రణ కోసం 186 మెకానికల్ డస్ట్ సప్రెషన్ స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి, రోజూ ట్యాంకర్‌ల ద్వారా నీటి చల్లడం నిర్వహిస్తున్నారు. నీటి కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రవాహ మార్గాల్లో ఫ్లోటింగ్ ట్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేసి వ్యర్థాలను నియంత్రిస్తున్నారు. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచి వ్యర్థజలాలను శుద్ధి చేసి మళ్లీ వినియోగిస్తున్నారు. పర్యావరణ హిత చర్యలలో భాగంగా సౌర విద్యుత్ ప్రాజెక్టులు అమలు చేయడంతో పాటు, కోల్, ఐరన్ ఓర్ నిర్వహణలో యాంత్రీకరణను పెంచి దుమ్ము ఉద్గారాలను తగ్గిస్తున్నారు. అదనంగా డస్ట్ బ్యారియర్ గోడలు, మూసివేసిన కన్వేయర్ వ్యవస్థలు, కవర్డ్ స్టోరేజ్ షెడ్లు ఏర్పాటు చేశారు.

పచ్చదనం పెంపు కోసం లక్షలాది మొక్కలు నాటి గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేపట్టారు. గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తున్నారు. పోర్ట్ అధికారులు చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందిస్తూ, వేసవిలో కాలుష్య రహిత వాతావరణం కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఇంజనీరింగ్ పనుల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెంచాలి

**వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త:**

ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పనుల పర్యవేక్షణలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ సూచించారు. దీని ద్వారా పనుల నాణ్యత మెరుగుపడటంతో పాటు సమయపాలన కూడా సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్‌తో కలిసి ఇంజనీరింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ సిబ్బంది తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. జూన్ 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి కొత్తూరు సమీపంలో వీఎంఆర్‌డీఏ నిర్మిస్తున్న పార్క్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. పార్క్‌లో పచ్చదనం, క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, ఇటీవల ప్రవేశపెట్టిన "విస్టా టికెటింగ్ యాప్" వల్ల ఆదాయం పెరిగిందని, దానిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదనంగా 8వ పేజీలో



# విశాఖలో అంగరంగ వైభవంగా దాసరి షార్ట్ ఫిలిమ్స్ పోటీలు




# మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరోసారి స్పష్టమైంది..

**బీజేపీ విజయానికి తోడ్పడిన వారందరికీ కృతజ్ఞతలు -ఏపీ బీజేపీ మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి**



**విశాఖపట్నం,ప్రభాతవార్త**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై దేశ ప్రజలు మరోసారి తమ అచంచల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ స్పష్టమైన తీర్పును వెల్లడించారని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి తెలిపారు. పార్టీ విజయానికి తోడ్పడిన ప్రతి ఓటరికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించగా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా పార్టీ ఓటు శాతం గణనీయంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్‌లకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల 8వ పేజీలో

# గీతంలో సైన్స్ కోర్సులలో ప్రవేశాలు

**యుజి, పిజి కోర్సులకు మే 17న జాతీయ స్థాయి ప్రవేశపరీక్ష**




**విశాఖపట్నం-ప్రభాతవార్త**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న యుజి, పిజి సైన్స్ కోర్సులలో ప్రవేశాలకు మే 17వ తేదీన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని దీనికి సంబంధించి 14వ తేదీ లోగా ధరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన ప్రవేశ పరీక్ష విధానం, కోర్సులు, విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్‌ల వివరాలను వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు, 3సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని అలాగే అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. భౌతిక శాస్త్రంలో క్వాంటమ్ ఫిజిక్స్ వంటివి ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్ టెక్నాలజి వంటివి, బిసిఎ లో కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటివి ప్రవేశపెట్టామని తెలిపారు. నాలుగు సంవత్సరాల బిఎస్సీ కోర్సులలో ప్రవేశం 8వ పేజీలో

# వారపు సంతలో భారీ చెట్టు కూలీ ఇద్దరు మహిళా ఒడిస్సా చిరు వ్యాపారులు మృత్యువాత



## విశాఖలో త్రాగునీటి సరఫరా లోపాలపై కమిషనర్ ఆగ్రహం



విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త

నగరంలో త్రాగునీటి సరఫరాపై పెరుగుతున్న ప్రజా ఫిర్యాదులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రాగునీటి పంపిణీలో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి, ప్రజలకు ప్రతిరోజూ నిర్ణీత సమయంలో సమృద్ధిగా నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తూర్పు జోన్ 23వ వార్డులోని కె.ఆర్.ఎమ్ కాలనీ ప్రాంతాన్ని కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా త్రిబుల్ ఆర్ సెంటర్, ఏఎంజీ హాస్పిటల్, సీతమ్మధార రైతు బజార్, బాలయేసు చర్చ్ పరిసరాలను జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పర్యటనలో భాగంగా త్రిబుల్ ఆర్ సెంటర్‌లో వ్యర్థాల విభజన విధానాన్ని పరిశీలించిన కమిషనర్, తడి వ్యర్థాలతో తయారుచేస్తున్న కంపోస్ట్ ఎరువు తయారీపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే క్లాప్ వాహనాల పార్కింగ్ వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వాటికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ఆదేశించారు. ఇక పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్, రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట జరిమానాలు విధించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన భద్రతా సామగ్రి అందుతున్నదీ తెలుసుకున్నారు. బాలయేసు చర్చ్ పరిసర ప్రాంతాల్లో మూసుకుపోయిన కాలువలను వెంటనే శుభ్రపరచి, మురుగునీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈనాడు రైతు బజార్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్ వరకు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పలువురు ఇంజనీరింగ్, పారిశుద్ధ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. నగరంలో త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థలను మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## గెడ్డ భూమిపై 'కంటైనర్' ముఠా కన్ను!

### 65వ వార్డు వికాస్ నగర్‌లో అర్ధరాత్రి ప్రభుత్వ భూమి కబ్జా -స్టీల్ ప్లాంట్ హెచ్చరిక బోర్డు ఉన్నా బరితెగింపు -కూటమి పేరు చెప్పుకుంటూ అక్రమార్కుల వీరవిహారం

గాజువాక, మే 04,ప్రభాత వార్త



గాజువాక నియోజకవర్గంలో భూకబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, పార్టీ పేరు చెప్పుకుంటూ కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. తాజాగా జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్ నగర్ గెడ్డను ఆనుకొని ఉన్న సుమారు రూ. 50 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రాత్రికి రాత్రే కంటైనర్ పెట్టి కబ్జా చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. వికాస్ నగర్ గెడ్డ సమీపంలో గతంలో కళాసీల కోసం కేటాయించిన స్థలంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన హెచ్చరిక బోర్డు ఉంది. అయినప్పటికీ, కబ్జాదారులు ఏమాత్రం భయం లేకుండా ఆ బోర్డును తొలగించి, అక్కడ తిష్ట వేయడానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తప్పుడు సమాచారం ఇచ్చి, ఏదో ఒక పేదవాడిని అడ్డుపెట్టుకుని ఈ స్థలాన్ని కాజేయాలని సదరు ముఠా పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కోసం, ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడిన నిజమైన కార్యకర్తలు నేడు ప్రాధాన్యత లేక బయట ఉంటే, కబ్జాదారులు, కంత్రీలు మాత్రం ఎమ్మెల్యే పేరు వాడుకుంటూ అక్రమ సంపాదనకు తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "గెద్దలను వదిలి కాకులపై అరిచినట్లు"గా అధికారుల తీరు ఉందని, అక్రమ కట్టడాలను అడ్డుకోవడంలో యంత్రాంగం విఫలమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజువాకలో వరుసగా జరుగుతున్న ఈ భూకబ్జాలకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## జీతాల కోసం 'క్లాప్' కార్మికుల సమ్మె



గాజువాక, మే 04,ప్రభాతవార్త

నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ ఆటో లోడర్స్ సోమవారం విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. గాజువాక పార్కింగ్ యార్డ్ వద్ద ఆటోలను నిలిపివేసి, అక్కడే వంటా వార్పు చేస్తూ నిరసన తెలిపారు. ఉదయం 5 నుండి సాయంత్రం 6 గంటల వరకు కష్టపడుతున్నా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవక అడుక్కునే స్థితి వచ్చిందని మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల వేధింపులు ఆపాలని, బకాయి జీతాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కార్మికులు వినలేదు. జీతాలు పడితేనే విధుల్లోకి వస్తామని, లేనిపక్షంలో మంగళవారం జోన్ వ్యాప్తంగా నిరసన చేపడతామని సిఐటియు నేతలు నక్క నాగరాజు, గొలగాని అప్పారావు హెచ్చరించారు.

## విశాఖలో అంగరంగ వైభవంగా దాసరి షార్ట్ ఫిలిమ్స్ పోటీలు

విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త:

దర్శకరత్న దాసరి నారాయణరావు 80వ జయంతి సందర్భంగా రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన "దాసరి షార్ట్ ఫిలిమ్స్ కాంపిటేషన్--2026" అవార్డుల ప్రధానోత్సవం విశాఖలో ఘనంగా జరిగింది. సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరేనాలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమాని కి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వేడుకలకు శోభాయమానంగా నిలిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ, తెలుగు జాతి గర్వించే మహానుభావుడు దాసరి నారాయణరావు జయంతి వేడుకలను విశాఖలో నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. సినీరంగంలో దాసరి సాధించిన విజయాలు అరుదైనవని, ఆయన వారసత్వాన్ని యువత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. కార్యక్రమానికి హాజరైన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ గోపాల్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సభకు అధ్యక్షత వహించిన రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి మాట్లాడుతూ, తన జర్నలిజం ప్రయాణంలో దాసరి నారాయణరావు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిలిమ్స్ పోటీలకు 50 ఎంట్రీలు అందినట్లు తెలిపారు. పోటీలో "అమ్మా నన్ను క్షమించు" మొదటి బహుమతి గెలుచుకోగా, "చివర పేజీ" రెండో, "హ్యూమానిటీ" మూడో, "చిన్న మాట పెద్ద మార్పు" నాలుగో బహుమతులు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో అంతర్జాతీయ కూచిపూడి నర్తకి నదియా చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దాసరి నారాయణరావుపై రూపొందించిన డాక్యుమెంటరీ కూడా విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో పలువురు సినీ ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టులు, సామాజిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 131 వినతులు

విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త

"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జీవీఎంసీకి సంబంధించి మొత్తం 131 వినతులు నమోదైనట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మలతో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జోన్ల నుంచి వచ్చిన ఫిర్యాదులను వివరించారు. భీమిలి జోన్‌కు 2, మధురవాడకు 13, ఈస్ట్ జోన్‌కు 22, వెస్ట్ జోన్‌కు 4, నార్త్ జోన్‌కు 19, సౌత్ జోన్‌కు 11, పెందుర్తి జోన్‌కు 15, అగనంపూడి జోన్‌కు 2, గాజువాక జోన్‌కు 13, ప్రధాన కార్యాలయానికి 30 వినతులు వచ్చినట్లు తెలిపారు. విభాగాల వారీగా చూస్తే పట్టణ ప్రణాళిక విభాగానికి అత్యధికంగా 65 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ విభాగానికి 24, రెవెన్యూ విభాగానికి 15, అడ్మినిస్ట్రేషన్ ఽ అకౌంట్స్‌కు 10, ప్రజారోగ్యానికి 5, యూసీడీకి 3, మొక్కల విభాగానికి 2 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫిర్యాదులను అధికారులు అదే రోజు పరిశీలించి, సంబంధిత బాధితులతో సంప్రదించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



## అప్పుల బాధ తాళలేక కారు డ్రైవర్ ఆత్మహత్య



గాజువాక, మే 04,ప్రభాతవార్త

అప్పుల ఊబిలో చిక్కుకున్న ఒక వ్యక్తి ప్రాణాలు తీసుకున్న విషాద ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక తన నివాసంలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని బల వన్మరణానికి పాల్పడ్డాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అక్కిరెడ్డిపాలెం రామాలయం సమీపంలో నివాసం ఉంటున్న సుంకరి గౌరీ శంకర్రావు (58) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య, చిన్న కూతురు సుజాత నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లడంతో శంకర్రావు ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన, తలుపులు లోపల గడియ పెట్టుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా శంకర్రావు లిఫ్ట్ చేయక పోవడంతో అనుమానం వచ్చిన బంధువులు వెంటనే ఇంటికి చేరుకున్నారు. ఎంత పిలిచినా పలకకపోవడంతో కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించగా, ఆయన విగతజీవిగా కనిపించాడు. వెంటనే చుట్టు పక్కల వారి సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. సంఘటనా స్థలంలో పోలీసులు తనిఖీ చేయగా టేబుల్‌పై ఒక లేఖ లభ్యమైంది. "అప్పుల బాధలు తట్టుకోలేక మరణిస్తున్నాను" అని అందులో రాసి ఉంది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## సౌత్ జోన్‌లో మే 5న బహిరంగ వేలం

### జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు

విశాఖపట్నం, మే 4, ప్రభాతవార్త



జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలోని ఆస్తులను లీజుకు ఇవ్వడానికి మే 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సౌత్ జోనల్ కమిషనర్ ఎమ్. మల్లయ్య నాయుడు తెలిపారు. షాపు గదులు, రెండు కళ్యాణ మండపాలు, మూడు మార్కెట్లను మూడు సంవత్సరాల కాలానికి గుత్తకిచ్చేందుకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గజిట్ నోటిఫికేషన్ నం.18/2026, ఈ ఏడాది మార్చి 17వ తేదీన జారీ చేసిన షార్ట్ నోటీసులో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు సౌత్ జోన్ కార్యాలయంలో ఈ బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు ఈ వేలంలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలని జోనల్ కమిషనర్ పిలుపునిచ్చారు.

## ప్రజలకు సంతృప్తికర సేవలందించడమే లక్ష్యం

విశాఖపట్నం, మే 04, ప్రభాతవార్త

ప్రభుత్వం అందించే సేవలు ప్రజలకు చేరువ చేసి ప్రజలు సంతృప్తి చెందే విధంగా పని చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. ఈ నెల 7, 8వ తేదీల్లో జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సంబంధించి సన్నద్ధతపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు గాను శాఖల వారీగా ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవలు మెరుగు పర్చాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను క్యూఆర్ కోడ్, ఐవిఆర్ఎస్ తదితర మార్గాల ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తున్నదని ప్రతి అధికారి తన పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. కీలక పనితీరు సూచికలు సాధనలో వ్యక్తి గత శ్రద్ధ తీసుకుని ఎ, ఎం ర్యాంకులు పొందాలన్నారు. చేసిన పనిని సక్రమంగా డేటా ఎంట్రీ చేయాలన్నారు. పథకాల అమలులో ఏ కారణాలతో వెనుక బడుతున్నాయి గుర్తించి లోపాలను సరిదిద్దుకుని ప్రణాళికా బద్దంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లా అభివృద్ధికి చెందే విధంగా నివేదికలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ విద్యాదరి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆనందపురంలో బీజేపీ విజయోత్సవ సంబరాలు



ఆనందపురం, మే 4, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలో వెల్లంకి బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలలో విడుదలైన ఫలితాలలో 3 రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో విజయ దుందుభి మోగించిన సందర్భంగా బిజెపి పార్టీ కార్యాలయంలో బాణాసంచా కాల్చి బిజెపి కార్యకర్తలు, అభిమానులు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు ఆనందపురం మండల పార్టీ అధ్యక్షురాలు పిల్లా విజయ, విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు మీసాల రాము నాయుడు విశాఖ జిల్లా మహిళా మోర్చ ట్రెజరర్ మాదా బత్తుల బుజ్జి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి లుఅడ్డూరు సురేష్ , పోతిన జీవన్ సంతోష్, బిజెపి నాయకులు కే.వి.వి.కృష్ణ రావు,(గోపి) మండల సోషల్ మీడియా కన్వీనర్ అడ్డూరు ఆనంద్, బిజెపి నాయకులు బోర శ్రీను, కె.వి.వి.సూర్యనారాయణ, పిల్లా చిన్న రావు, ఇంటి సత్తిరాజు, బాలి త్రినాథ్, ఉప్పాడ శివ పాల్గొన్నారు.

## మాతృ మరణాల నివారణపై సమీక్ష సమావేశం



పీఎం పాలెం, మే 4, ప్రభాతవార్త:

జిల్లాలో మాతృ మరణాలను పూర్తిగా నివారించేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు సూచించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలెన్స్ అండ్ రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి నెలలో గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరిగిన ఒక మాతృ మరణంపై సమీక్ష నిర్వహించారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన సేవలను సమయానికి అందించడం ఏఎన్ఎం సిబ్బంది బాధ్యతగా పేర్కొన్నారు. హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి, ప్రసవ సమయంలో ఆలస్యం చేయకుండా కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) లేదా విక్టోరియా ఆసుపత్రి (వీజీహెచ్)లకు తరలించి సురక్షిత కాన్పు జరిగేలా చూడాలని సూచించారు. ఇకపై మాతృ మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు కౌమారదశ నుంచే ఆడపిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, గర్భిణీలకు గర్భధారణ సమయంలో అవసరమైన సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల వైద్యాధికారులు, కేజీహెచ్, వీజీహెచ్ వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. కొంతమంది అధికారులు ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## ఉచిత ఆయూష్ వైద్య శిబిరం

పీఎం పాలెం, మే 4, ప్రభాతవార్త



కలెక్టరు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆయూష్ వైద్య శిబిరం నిర్వహించారు. మధురవాడ గవర్నమెంట్ ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమ ఆర్యర్యంతో 98 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులను పంపిణీ చేసారు. ఈ వైద్య శిబిరంను ఆయూష్ విభాగం ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో పారా మెడికల్ సిబ్బంది కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ పనుల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెంచాలి

7వ పేజీ తరువాయి ..

సెంట్రల్ పార్క్‌లో నిర్మించ తలపెట్టిన యాంటి డ్రగ్ పార్క్‌పై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్ మధుసూదనరావు, డీఎఫ్ఓ శిరీష, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం

విశాఖపట్నం-ప్రభాతవార్త

శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖ రీజియన్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనకు వెళ్లిన శ్రీభరత్ కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఆధ్వర్యాన నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం, సీఎం చంద్రబాబు గారి సారథ్యంలో ట్రిలియన్ డాలర్ ఎకానమీ దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో పాటు ప్రస్తుతం ఏపీలో పరిశ్రమదారులకు దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేష్ చొరవతో టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రధాన సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయి, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రధాన సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయి, జులై మొదటివారంలో భోగాపురం ఎయిర్పోర్టు ప్రారంభం కాబోతోంది, ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులకు ఇదే మంచి తరుణమని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25శాతానికి పైగా ఏపీకి వస్తున్నాయని చెప్పారు. పరిశ్రమలకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించాల్సిందిగా ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసాంధ్రులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యుఎస్ఏ ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు వెంకట్ కోగంటి, శ్రీకాంత్ దొడ్డపనేని, భక్త భల్లా, సుధీర్ ఉన్నం, హరి సన్నిధి, విజయ్ ఆసూరి, శశి దొప్పలపూడి పాల్గొన్నారు.

## గీతంలో సైన్స్ కోర్సులలో ప్రవేశాలు

7వ పేజీ తరువాయి ..

పొందే విద్యార్థులు మేనేజ్‌మెంట్, సామాజిక శాస్త్రాలకు సంబంధించిన సబ్జెక్టులను మైనర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు సంవత్సరాల బిఎస్సీ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులు రెండు, మడు సంవత్సరాలలో పరిశోధన ప్రాజెక్టులను చేపట్టే విధంగా ఇంటర్న్‌షిప్‌లతో ప్రొత్సహిస్తున్నామని డీన్ తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా విద్యను అభ్యసిస్తున్న వారిని ప్రాంగణ నియామకాలలో ఎంపిక చేసుకోవడానికి 50 సంస్థలు ముందుకు వచ్చాయని అధిక శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. సైన్స్‌లో పలువురు విద్యార్థులకు రూ.12.26 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించాయని ఆయన తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ కోర్సులలో ప్రవేశం పొందగోరేవారు వివరాల కోసం గీతం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.గీతం.ఈడియును ఆన్‌లైన్ ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విలేఖరుల సమావేశంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సాయికిశోర్, రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి, ఫిజిక్స్ అధిపతి ప్రొఫెసర్ సి.కవిత, మేథమిటిక్స్ విభాగం అధిపతి ఎన్.శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి ప్రభామహంతి తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాఖపట్నం-ప్రభాతవార్త

నర్సీపట్నంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని 11 మంది టాపర్లను పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో (ఎంఈఓ) కలిసి తన ఇంటికి ఆహ్వానించి విందు భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు స్పీకర్ సతీమణి పద్మావతి, కుమారుడు రాజేష్, కోడళ్లు డాక్టర్ సువర్ణ, దివ్యశ్రీలు స్వయంగా ఆత్మీయంగా భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులకు ఏటికొప్పాక సరస్వతి దేవి ప్రతిమలను బహూకరించి, ఉపాధ్యాయులను, ఎంఈఓలను స్పీకర్ సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఆ సంతోషాన్ని పంచుకునేందుకే వారితో కలిసి భోజనం చేయాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశానని తెలిపారు. ఉపాధ్యాయులు, అధికారుల పట్టుదల, విద్యార్థుల శ్రద్ధ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. అనకాపల్లి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుంచే అత్యధికంగా 54 మంది విద్యార్థులు 570కి పైగా మార్కులు సాధించడం జిల్లాలోనే రికార్డు అని ఆయన కొనియాడారు. ఎన్ని కోట్ల ఆస్తులు ఉన్నా చదువే గొప్ప సంపద అని, విద్యాబలంతోనే తెలుగువారు లండన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అత్యున్నత స్థాయిల్లో స్థిరపడ్డారని ఆయన గుర్తుచేశారు. గతంలో నర్సీపట్నంలో డిగ్రీ కాలేజీ కూడా ఉండేది కాదని, ఇప్పుడు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ వంటి ఎన్నో విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయని, నర్సీపట్నాన్ని ఒక ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన ఆకాంక్షించారు. అలాగే, పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశపడవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 4వ తేదీ వరకు వారికి ప్రత్యేక కోచింగ్ ఇస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకుని రాబోయే పరీక్షల్లో విజయం సాధించాలని భరోసా ఇచ్చారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి వారిని ఉత్తీర్ణులను చేయాలని స్పీకర్ కోరారు. రాజకీయ నాయకులతో కాకుండా ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులతో కలిసి భోజనం చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని అయ్యన్నపాత్రుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్ ఈఓ1 తలుపులు, ఎం ఈ ఓ2 జి వి ఎస్ నాగేంద్ర, మాకవరపాలెం ఎమ్ ఈ ఓ అచ్యుత్ రావు, ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరోసారి స్పష్టమైంది..

7వ పేజీ తరువాయి ..

ఫలితాలు దేశం "వికసిత్ భారత్" లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని ఆయన అన్నారు. అభివృద్ధి, జాతీయ భద్రత, పారదర్శక పాలన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ రంగంలో సాధించిన పురోగతి ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చాయని ఆయన వివరించారు. యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి వర్గాల నుంచి లభించిన విస్తృత మద్దతు ఈ విజయానికి ప్రధాన బలమని ఆయన పేర్కొన్నారు. ఈ ఫలితాలు భవిష్యత్తులో మరింత బలమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి కొనసాగిస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ ముఖ్య బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఏకమై ముందుకు సాగాలని వెన్నాశ్రీరామమూర్తి పిలుపునిచ్చారు.

## కిశోరి వికాసం పోస్టర్ల ఆవిష్కరణ



విశాఖపట్నం-ప్రభాతవార్త

కిశోర బాలబాలికల సాధికారత, భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న "కిశోరి వికాసం" సమ్మర్ క్యాంపెయిన్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆవిష్కరించారు. మే 1 నుంచి జూన్ 11 వరకు జిల్లాలో నిర్వహించే ఈ క్యాంపుల ద్వారా జీవన నైపుణ్యాలు, ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**రిపోర్టర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. విశాఖలో వివిధ ప్రాంతాల్లో రిపోర్టర్లుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు కావలెను.

కావలసిన ప్రాంతాలు

పెందుర్తి, తాటిచెట్లపాలెం, వన్‌టౌన్, కలక్టరేట్, భీమిలి

అర్హులైన అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో 11-05-2026 సోమవారం ఉదయం 10గం.కు వార్త యూనిట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో హాజరుకాగలరు.

**వార్త కార్యాలయం**

జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూలు ఎదురుగా, దుర్గా గణపతి గుడి వెనుక రోడ్డు, సీతమ్మపేట, విశాఖపట్నం, ఫోన్ నెం. 9848306312

ong-10_ong-10.qxd 5/4/2026 11:11 PM Page 1






## కిశోరుల భద్రత, ఆరోగ్యం, సాధికారతే లక్ష్యంగా గోడ పత్రిక ఆవిష్కరణ

**- జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్**

**అనకాపల్లి మే 4 (ప్రభాతవార్త)**



కిశోరుల భద్రత, ఆరోగ్యం, సాధికారతే లక్ష్యంగా కిశోరి వికాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ , డి ఆర్ ఓ సుబ్బలక్ష్మి కిశోరి వికాసం గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కిశోరీ బాల బాలికల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం, విద్య భద్రతపై సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ ద్వారా అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమం మే 1 నుండి జూన్ 11 తేదీ వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. బాలికలు, బాలురలో విద్య, పోషణ, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన పెంపొందించడం దీని యొక్క ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ముఖ్యంగా లింగ సమానత్వం, బాల్య వివాహాల నివారణ, పిల్లలపై లైంగిక నేరాల నిరోధం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని, పిల్లల మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్ సేవలు, జీవన నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్ , సైబర్ నేరాలు భద్రత, ఆన్లైన్ మోసాలపై జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణలు అందించబడతాయని తెలిపారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి డి సూర్య లక్ష్మి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై సిపిఎం ఆగ్రహం

**- కాళీ సిలిండర్లతో నిరసన కార్యక్రమం**

**(అచ్యుతాపురం మే 4 ప్రభాతవార్త )**



కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను ఒకేసారి రూ.993 పెంచడంపై సిపిఎం పార్టీ తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో కాళీ వాణిజ్య గ్యాస్ సిలిండర్లను ఎత్తుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కన్వీనర్ ఆర్. రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని విమర్శించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకేసారి వాణిజ్య సిలిండర్ ధరను రూ.993 పెంచడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ధరల పెంపు వల్ల చిన్నచిన్న వ్యాపారులు, ముఖ్యంగా హోటల్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ పెంపుతో హోటళ్లు మూతపడే పరిస్థితులు రావచ్చని, ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇంకా గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువులు, టిఫిన్లు, భోజనాల ధరలు పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం పడుతుందని చెప్పారు. పెంచిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో రాజన్న, సత్తిబాబు, సన్నిబాబు, పెంటయ్య, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు 50,000 అందజేసిన ధూళి రంగనాయకులు..

**ఎలమంచిలి, మే 4, ప్రభాతవార్త**



పట్టణంలోని అన్న క్యాంటీన్ సమీపంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు 50 వేల రూపాయలు నగదు మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు కు అందజేసిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆర్ఎస్ నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాటి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్, గుర్రాల రాము పాల్గొన్నారు.

## బిజెపి ఘన విజయం..విజయోత్సవ సంబరాలు..

**ఎలమంచిలి, మే 4, ప్రభాతవార్త:**



పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన శుభ సందర్భంగా సోమవారం సాయంత్రం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్ కుమార్, బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ పిల్లా రామకుమారి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లా రమాకుమారి అందరికీ స్వీట్లు అందజేశారు. ర్యాలీ సందర్భంగా భారీ స్థాయిలో బాణాసంచా కాల్చారు. ఈ సంబరాలలో బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ ఆడారి శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షులు బోద్ధపు శివ, పిట్టాదాసు బాబు చెక్క శ్యామ్, మల్ల కొండబాబు, నక్కా శివశంకర్, జగ్గు మంత్రి సతీష్, సింహాద్రి శ్రీను, ఇత్తడి రాధా రాణి, ధనలక్ష్మి, బొడ్డేటి సురేష్ ,జనతా పార్టీ పదాధికారులు మండల అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యంతో బహుళ ప్రయోజనాలు: ఎంపీడీవో "చలపతిరావు".!

**(నక్కపల్లి, ప్రభాతవార్త) మే 4:**

ఆయుర్వేద వైద్యం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, రోగులు ఆయుర్వేద మందులు వాడడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ వుండవని నక్కపల్లి ఎంపీడీవో కె.చలపతిరావు, టీడీపీ నియోజక వర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ లు అన్నారు. సోమవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.,రఘు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక దీర్ఘకాలిక రోగాలను కూడా ఆయుర్వేద వైద్యంతో నయం చేసుకోవచ్చునని చెప్పారు. కొవిడ్ తరువాత ఆయుర్వేదానికి మరింత ప్రాధాన్యత,ఆదరణ పె రిగిందన్నారు. ఈ శిబిరంలో ఉద్యోగులు, ఉపాధి కూలీలు, సుమారు 185 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో డీ. సీతారామరాజు, గొడిచెర్ల సొసైటీ చైర్ పర్సన్ దార్లకృష్ణ, ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్లు డీఎస్పీ సాయి, డీ. రాంబాబు పాల్గొన్నారు.



# అర్జీదారులను కాలపరిమితిలోగా పరిష్కరించాలి: కలెక్టర్ విజయక్రిష్ణన్

**అనకాపల్లి, మే 4, (ప్రభాతవార్త)**



పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం1, 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, డి.ఆర్వో సుబ్బలక్ష్మి లు జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా డివిజన్, మండల, గ్రామ, వార్డు స్థాయి లలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారు నికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖ కు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. తదుపరి జిల్లా కలెక్టర్ పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి డి సూర్య లక్ష్మి, పి డి డి ఆర్డీ డి శచీ దేవి , జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుధీర్, సి పి ఓ జి. రామారావు, జిల్లా సర్వే , భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా, జిల్లా వ్యవసాయ అధికారి ఆశాదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం..

**ఎలమంచిలి, మే 4, ప్రభాతవార్త:**




పట్టణములోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మెరిట్ సాధించిన బొట్టా జ్యోతిష్ కుమార్, చల్లా లహరి, సేనాపతి ప్రేమ్ ప్రణయ్ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ఎన్ఎల్ డి భవాని సమక్షంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసా పత్రాలు మెమెంటోలు బహుమతులు అందజేసే అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు మల్లిపాటీ సత్యనారాయణ, రాజేష్, ఎన్.వి.ఆర్.ఎం కిషోర్, బి శ్రీనివాసరావు, ఎస్ కామేశ్వరి, వై భాస్కరరావు, విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 45 కిలోల వెండితో పరారైన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

**అనకాపల్లి మే 4 (ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారికి ప్రముఖ బిల్డర్, సినీ నిర్మాత కాండ్రేగుల నాయుడు తను సొంత నిధులతో అమ్మవారికి వెండి చీర తయారు చే యిం డా ని కి సుమారు45 కిలోల వెండిని ఆచారి లంగోజి అమ్మన్న బాబులు కి తయారుచేయు నిమిత్తం గత నెల 13వ తేదీ ఇచ్చారు. ఆయన అమ్మవారి వెండి వస్తువులు తయారు చేయడంలో నమ్మకంగా వెలుగుతూ గవరపాలెం లో షాప్ నడుపుతున్నాడు. ఆ నమ్మకంతో 45 కిలోల వెండితో నూకాంబిక అమ్మవారికి వెండి చీర చేయించాలనే సంకల్పంతో బెత్తయించారు. దీంతో లొంగోజి అమ్మన్నబాబులు అనకాపల్లి వదిలి వెళ్ళిపోవడంతో సోమవారం టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై డి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, కె ఎమ్ నాయుడు, సూరిశెట్టి నర్సింగరావు, సూరిశెట్టి హృదయ్, సూరిశెట్టి శ్రీనివాసరావు, కోలపర్తి శ్రీను, రవి, సూర్య, అక్షయ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

**- 53 ఫిర్యాదుల స్వీకరణ అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు**

**అనకాపల్లి, మే 4 :(ప్రభాతవార్త)**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా అదనపు ఎస్పీ ఎల్ మోహన్ రావు అన్నారు. అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి మొత్తం 53 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో ప్రధానంగా: సివిల్ వివాదాలు, భూ తగాదాలు , ఆస్తి సంబంధిత సమస్యలు, చీటింగ్ కేసులు, ఆర్థిక మోసాలు, కుటుంబ సమస్యలు, ఇతర గృహ సంబంధిత ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అదనపు ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు భరోసా కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై గరిష్టంగా 7 రోజుల్లోపు ప్రాథమిక విచారణ పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలి. ఎటువంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు లొంగకుండా, వాస్తవాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసు పురోగతిని తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు బాధితులకు తెలియజేయాలి. విచారణ అనంతరం తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయి నివేదికను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు యంత్రాంగంపై నమ్మకం కలిగేలా, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి. డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**- ప్రజా దర్బార్‌లో ప్రగడ నాగేశ్వరరావు**

**(అచ్చుతాపురం మే 4 ప్రభాతవార్త)**



అచ్చుతాపురం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. అచ్చుతాపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజలు పెద్దఎత్తున హాజరై తమ సమస్యలను నేరుగా వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వాటిని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై వారి అవసరాలు తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసం ప్రభుత్వం మీద మరింత పెరగాలంటే సేవాభావంతో పనిచేయడం అత్యంత అవసరమని అన్నారు. ప్రజా దర్బార్ ద్వారా సామాన్య ప్రజలకు నేరుగా నాయకత్వాన్ని చేరువ చేసే ప్రయత్నం జరుగుతోందని, ఇది మంచి పాలనకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

**- చలివేంద్రాలు ప్రారంభించిన డి ఎం హనుమశ్రీ**

**అనకాపల్లి మే 4 :(ప్రభాతవార్త)**



వేసవి నుండి ప్రజలు ఉపశమనం పొందేందుకు అనకాపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లుగా డిపో మేనేజర్ కె హనుమశ్రీ తెలిపారు. స్థానిక నెహ్రూ చౌక్ గాజువాక రోడ్ బస్ స్టాప్ వద్ద, పూడిమడక బైపాస్ జంక్షన్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునీకరణ లో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంపై నివారణ, స్వచ్ఛమైన తాగునీరు, కాంప్లెక్స్ ఆవరణలో ఎప్పటికప్పుడు క్లీనింగ్ ఇలా ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ప్లాస్టిక్ నివారణ పై ప్రయాణికులకు అవగాహన కలుగజేస్తున్నామన్నారు.

## కలెక్టరేట్‌లో ఆయుష్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**అనకాపల్లి, మే 4 (ప్రభాత వార్త):**



ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించే సమయంలో ఖిఆయుష్ఖి ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఖిఆయుష్ఖి ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ప్రతి సోమవారం ప్రజలకు అందుబాటులో ఆయుర్వేదం, హోమియోపతి సేవలు అందించడం జరుగుతుంది . వ్యాధి నిరోధక శక్తిని పెంచే మందుల పంపిణీతో పాటు బీపీ చెక్ అప్, మోకాళ్ళ నొప్పులు, ఆయాసం, దగ్గు, నీరసం, ఎసిడిటీ, మధుమేహం, యూరిన్ ఇన్ఫెక్షన్ వంటి వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పరవాడ ఆయుర్వేదిక్ మెడికల్ అధికారి డాక్టర్ టి శిరీష తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ , ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశముల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని అన్నారు. పి జి ఆర్ ఎస్ నందు దరఖాస్తుల సమర్పించేందుకు వచ్చిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో హరిపాలెం కాంపౌండర్ పి మేరీ స్వర్ణలత, రేగుపాలెం ఎస్ ఎన్ ఓ, ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో నిరుపేద యువతికి సామూహిక సహకారంతో ఘనంగా వివాహం

**అనకాపల్లి మే 4 :(ప్రభాతవార్త)**



అనకాపల్లిలో ఓ నిరుపేద ఆర్యవైశ్య యువతికి సమాజ సేవా భావంతో ఘనంగా వివాహం నిర్వహించారు. ఈ కార్యక్రమం వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త కడిమిశెట్టి సతీష్, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి క్లబ్, జానకిరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగింది. సుమారు 4 లక్షల వ్యయంతో నిర్వహించిన ఈ వివాహ వేడుకలో వధూవరులు చిరంజీవి యోగేష్ హైదరాబాద్- లక్ష్మీ సౌభాగ్యవతి పుష్పలతలు అనకాపల్లి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వధూవరుల ఇరువైపుల బంధువులు, అతిథులు సుమారు 350 మంది హాజరై, వారికి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వివాహం అనంతరం పెళ్లికూతురికి అవసరమైన గృహోపకరణాలు, వస్త్రాలు అందజేస్తూ, పెళ్లికొడుకు ఇంటికి పంపించారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతను చాటుతూ, నిరుపేద కుటుంబానికి ఆర్థిక భారం తగ్గించినట్లు నిర్వాహకులు తెలిపారు. మే 3వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు చిన్న వీధిలోని నుదురుపాటి వారి కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొండాడ లింగబాబు, నుదురుపాటి తాతాజీ, కటకం లక్ష్మణరావు, గుండా గుప్త, ఉదగిరి గోవింద కృష్ణ ,తదితరులు పాల్గొని వధూవరులను వివాహానికి ఎంతో ప్రోత్సహించారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వాసవి క్లబ్ మెంబర్స్, జాజుల రమేష్, ఆడారి శ్రీనివాసరావు, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రెసిడెంట్ ,సెక్రటరీ ,ట్రెజరరీ, కేఎల్ఎన్ కుమార్ వైశ్య ప్రముఖులు ఇన్నర్ వీల్ మెంబర్స్ తీగల రజిని హాజరయ్యారు.

## ఏపీ పీఎస్ గ్రూప్ 2 రాష్ట్రస్థాయి మెగా గ్రాండ్ టెస్ట్ 2026 బహుమతుల ప్రధానం..

**ఎలమంచిలి, మే 4, ప్రభాతవార్త:**




పట్టణంలో ని స్థానిక గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాలలోని కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్ టు రాష్ట్రస్థాయి మెగా గ్రాండ్ టెస్ట్ 2026 బొమ్మరిల్లు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్లైన్లో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు విద్య సామాగ్రి అందజేశారు. రాష్ట్రస్థాయి ఒకటో ర్యాంకు సాధించిన కర్రీ తులసి 3000 నగదు బహుమతి ఏకలవ్య మెటీరియల్, రెండవ ర్యాంక్ సాధించిన నాగ గణేష్ 2000 నగదు బహుమతి ఏకలవ్య మెటీరియల్, మూడవ ర్యాంకు సాధించిన బావని వెయ్యి రూపాయలు నగలు ఏకలవ్య మెటీరియల్ అందజేశారు. మిగిలిన 100 మంది టాప్ విద్యార్థులకు ఏకలవ్య మెటీరియల్ గాండీవం కోర్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి చంద్రశేఖర్ మాట్లాడుతూ వడ్డీ పరీక్షల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం పరీక్షల ద్వారా స్వీయ విశ్లేషణ ఎంతో అవసరం అని తెలిపారు. ఇలాంటి మెగా టెస్టులు విద్యార్థులకు వారి స్థాయిని అంచనాను వేసుకుని మంచి వేదికగా ఉంటాయని పేర్కొన్నారు. కన్వీనర్ డాక్టర్ అర్జున అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర ప్రాక్టీస్ టెస్టులు రాస్తూ తమ బలహీనతలను గుర్తించి సరిదిద్దుకుంటే విజయం సులభం అవుతుందని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పరీక్షలు మార్గదర్శక కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కే వెంకన్న, వైస్ ప్రిన్సిపల్ వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు అధ్యాపకులు సిబ్బందికి నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

## స్వచ్ఛరథం పనితీరును పరిశీలించిన ధూళి రంగనాయకులు

**ఎలమంచిలి, మే 4, ప్రభాతవార్త:**



నియోజకవర్గ రాంబిల్లి మండలం హరిపురం గ్రామానికి వచ్చినటువంటి స్వచ్ఛరథం వద్ద హరిపురం మహిళలు తమ ఇళ్ల వద్ద ఉన్న పనికిరాని సామాన్లను స్వచ్ఛర దానికి ఇచ్చి వారి నుంచి దానికి సమానమైన విలువ గల వస్తువులను స్వీకరించడాన్ని దగ్గర ఉండి పరిశీలించిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేసి ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తను పనికిరాని సామానులను పార వేయకుండా దానికి సమానమైన బరువు లేదా, దాని విలువకు సరిపడిన నిత్యవసర వస్తువులను తీసుకునే విధంగా కూటమి ప్రభుత్వం స్వచ్ఛ రథాన్ని ఏర్పాటు చేసిందని, దీనిని ప్రతి గ్రామంలోనూ ఉన్న ప్రజలు ఉపయోగించుకొని తమ వద్ద ఉన్న పనికిరాని సామానులను స్వచ్ఛర దానికి ఇచ్చి మీకు కావలసిన నిత్యావసర సామాన్లు తీసుకోవాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు విరివిగా పాల్గొన్నారు.

## పంచదార్ల బీసీటీ పాఠశాలలో మహిళల భద్రతపై పోలీసులు అవగాహన కార్యక్రమం

(రాంబిల్లి మే 4 ప్రభాతవార్త)



మండలంలో పంచదార్ల గ్రామంలో ఉన్న భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ (బీసిటీ) పాఠశాలలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా (ఐపీఎస్) ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు మహిళల భద్రతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు, మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించడం, అప్రమత్తంగా ఉండడం, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు, ముఖ్యంగా సైబర్ నేరాలుఈవీటీజింగ్, గృహహింస వంటి సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లను ఉపయోగించుకోవాలని ఎలాంటి బెదిరింపులు ఎదురైనప్పటికీ భయపడకుండా వెంటనే పోలీసులును సంప్రదించాలని చెప్పారు, అలాగే మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎస్సై డి. నాగేంద్ర వివరించారు, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో మహిళలపై నేరాలు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు పేర్కొన్నారు, ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో ధైర్యం పెంపొందించడం తమ హక్కులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పోలీసులు తెలిపారు, పాఠశాల నిర్వహకులు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

## కంటి వైద్య విభాగానికి సమకూరిన వైద్య పరికరాలు.!

(నక్కపల్లి, ప్రభాతవార్త )





నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో ఉన్న కంటి వైద్య విభాగానికి అరుదైన చికిత్సలకు అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చారు . హెట్టిరో సి ఎస్ ఆర్ నిధుల నుంచి, హెచ్డిఎఫ్సి నిధులనుంచి అవసరమైన ఈ వైద్య పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్య పరికరాలు కంటిలో ఎటువంటి ప్రమాదాలు జరిగిన వాటిని తొలగించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయి. ఈ మేరకు ఆసుపత్రి సూపరిడెంట్ సునీల్ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా సమకూర్చిన స్ప్లిట్ ల్యాంప్ ,మైక్రోస్కోపి లను వారి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఇటువంటి పరికరాలు అందజేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులతో పాటు కంటి వైద్య నిపుణులు రజాక్, సిబ్బంది ఉన్నారు.

## టీవీకే విజయం నక్కపల్లి వైకాపా సంబరాలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరాటంతో టీవీకే విజయ్ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశలో అడుగులేస్తున్న సందర్భంగా వైకాపా నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తూ 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్లో ఆ విధంగానే విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, పార్టీ నాయకులు సాదిరెడ్డి శ్రీను, వీసం రాజు ,ఎల్లేటి సత్యనారాయణ ,అల్లాడ కొండ బాబు, కొల్నాటి దుర్గాప్రసాద్,బుజ్జి ,గొడుగులు బంగారు రాజు, అద్దూరి సోమాజి, గంట తిరుపతిరావు, కొండబాబు, పండు తోపాటు పలువురు ఉన్నారు.

## ప్రధాని మోదీపై భారత ప్రజలకు నమ్మకం: "పాకలపాటి"

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



భారతదేశంలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రధానమైన బెంగాల్లో బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకోవడానికి ప్రధాన కారణం బిజెపి నాయకత్వంలో ప్రధాన మోడీ పరిపాలన కోరుకుంటున్నారని తన పరిపాలనపై ప్రజలకు నమ్మకమే ఇటువంటి ఫలితాలకు నిదర్శనం అని రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవివర్మ అన్నారు. ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బెంగాల్ తో పాటు అస్సాం, పుదుచ్చేరి, రాష్ట్రాల్లో మూడో సారి బిజెపి అధికారంలోకి రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. భారత ప్రధాని మోదీ ఈ భారతదేశానికి ఒక మ ణి రత్నం లాంటి వారు అని, హోం మంత్రి అమిత్ షా లాంటి వారి ఆలోచన మరింతగా భారతదేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తమిళనాడులో బిజెపి మద్దతుతో అధికారంలోకి రాబోతున్నామని జోష్యం చెప్పారు. బెంగాల్లో హింస రాజకీయాలకు రౌడీ రాజకీయాలకు తెరపడిందని అన్నారు. భవిష్యత్తులో భారత దేశంలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు మిగతా రాష్ట్రాల్లో బిజెపి అధికారం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.

## రాజవరం గ్రామ కంఠం భూమిలో పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు

**పాయకరావుపేట రూరల్, మే 4, ప్రభాతవార్త :**



మండలంలోని రాజవరం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 82 లో గల 2.08 ఎకరాల గ్రామ కంఠం భూమిని రాజవరం, గజపతినగరం గ్రామాల్లోని పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ " లో గ్రామస్థులు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. పూర్వం ఈ భూమిలో ఎస్సీ కులానికి చెందిన మాదిగలు నివాసం ఉండటంతో ఈ భూమిని "మాదిగ దిబ్బ" అని పిలిచేవారని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిని బొంది కాశీ విశ్వనాథ్ సన్నాఫ్ అప్పారావు అనే వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి, కొంత భాగంలో పునాదులు తీసి, ఇల్లు కట్టడానికి ప్రయత్నించడమే కాకుండా మిగిలిన భూమిని లే అవుట్లు వేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మా గ్రామాలలో ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని అందువలన ఈ గ్రామ కంఠం భూమిని నిరుపేదలకి ఇళ్ళ స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ క్రమంలో బొంది కాశీ విశ్వనాథ్ నుండి తమకు అపాయం కలిగే అవకాశం ఉందని అందువలన కాశీ విశ్వనాథ్ నుంచి నిరుపేదలమైన తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసిన వారిలో కాకాడ కృష్ణ, యజ్జల సత్యనారాయణ, ఏడిద సింహాచలం, ఏడిద కృష్ణ, రాయి రమణ తదితరులు ఉన్నారు.

## అడ్డురోడ్డు ఆర్డీవో ఆఫీసు పి జి ఆర్ ఎస్‌కు ఐదు దరఖాస్తులు

(ఎస్ రాయవరం, మే 4, ప్రభాతవార్త)

మండలంలో తిమ్మాపురం లో అడ్డరోడ్డు జంక్షన్ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవిన్యూ క్లినిక్ లో 5 దరఖాస్తులు రావడం జరిగింది. భూ సమస్యలుపై ఐదు దరఖాస్తులు రావడం జరిగిందని, వాటిపై ఆర్డిఓ కార్యాలయం ఏవో నాగరాజు దరఖాస్తులు స్వీకరించారు.

## ఆలయంలో ఘనంగా పారాయణం.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీరామ క్రతువు (స్థూపం) ప్రతిష్ట రోజు సందర్భంగా సోమవారం ఉపమాక గోష్టి ఆధ్వర్యంలో రామాయణం 24వేల శ్లోకాల పారాయణం ఘనంగా జరిగింది. భారతదేశంలో 108 దివ్యక్షే త్రాల్లో పూర్వం రామానుజజీయర్ స్వామి రామ స్థూపాలను నిర్మించారు. అందులో ఒకటి ఉపమాక క్షేత్రంలో వుంది. ఈ స్థూపం ప్రతిష్ట రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. రామాయణంలోని ఆరు కాండలలో వు న్న 24వేల శ్లోకాలను గాజువాక, కూర్మన్నపాలెం, నర్సీపట్నం నక్కపల్లి, కాకినాడకు చెందిన భక్తులు పారాయణం చేశారు. అంతమకుందు రామ స్థూపం వద్ద ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపమాక తీర్థగోష్టి సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి విజయోత్సవ ర్యాలీ

అనకాపల్లి మే 4 :(ప్రభాతవార్త)



ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి విజయకేతనం ఎగరవేయడంతో అనకాపల్లిలో బిజెపి శ్రేణులు సోమవారం సాయంత్రం విజయోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపడుతూ నాలుగు రోడ్లలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా , అధ్యక్షులు ద్వారాపురెడ్డి పరమేశ్వర రావు,బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వర రావు లు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి ఎన్డీఏ కూటమి విజయకేతనం ఎగరేసిందన్నారు. పశ్చిమ బెంగాల్లో 40 ఏళ్లగా పాతుకుపోయిన కమ్యూనిస్టులు తృణమూల్ కాంగ్రెస్ ను అడ్రస్ లేకుండా చేసిన పార్టీ బిజెపి అన్నారు. మోడీ పాలనపై దేశములో అన్ని వర్గాలు చూస్తున్నాయని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ దే హవా అన్నారు. వ్యాపారవేత్త, , ప్రధాన కార్యదర్శి లు బొడ్డెడ నాగేశ్వరరావు, రామునాయుడు, కర్రి రామకృష్ణ, కాళేశ్వరరావు, నర్సింగ్ యాదవ్, నాగమణి, మంగ, సత్యవాణి, గాలి శ్రీను శ్రీనివాసరావు, కొమ్మనాపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

- అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా అవగాహన

నర్సీపట్నం,మే 4,ప్రభాతవార్త



నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో సోమవారం ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారిని పీ.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత కొంతసేపు నీతి కథలను చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం కోసం విద్యార్థులకు వివరించారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించే క్రమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయని అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను కృషిని స్మరించుకొనుటకు ఈరోజును కేటాయించారన్నారు. అటువంటి వారికి కృతజ్ఞతలు తెలుపుకొనుట ఎంతో అవసరమని వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఏ విధంగా ప్రమాద స్థలం నుంచి తీసుకువస్తారో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ప్రభుత్వ పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రవికుమార్ బోర్డు పైన బొమ్మ వేసి పిల్లల చేత వేయించారు. ఎక్కడెక్కడ ఎటువంటి రంగులు వాడాలో వివరించారు. డ్రాయింగ్ లో పిల్లలు చేసిన తప్పిదాలను సరిదిద్దారు. రేపటి దినాన క్రాఫ్ట్ టీచర్ వస్తారని, అదేవిధంగా చదరంగంలో మెలుకువలు నేర్పడానికి ప్రసాద్ మాస్టర్ వస్తారని గ్రంథాలయ అధికారిణి విద్యార్థులకు తెలిపారు.

## శ్రీ కనకదుర్గ తల్లి దేవాలయంలో దొంగలు పడ్డారు

**పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, మే 4 :**



పట్టణంలోని దుర్గా నగర్ లో గల శ్రీ కనక దుర్గ తల్లి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. దొంగలు దేవాలయం ప్రధాన గేటు, గర్భగుడి తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన బంగారు ఆభరణాలు, మూడు జతల మంగళ సూత్రాలు, ఒక బంగారు గొలుసు మొత్తం సుమారు నాలుగున్నర తులాలు బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. దేవాలయంలో ఉన్న ఐదు హుండీలు పగలగొట్టి అందులోని సుమారు 50,000 రూపాయలు దొంగలించారని ఆలయ పూజారి ఈరంకి నారాయణ మూర్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ సాకేటి శంకరరావు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ జుత్తు పురుషోత్తం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు అరికట్టాలి

(ఎస్ రాయవరం, మే4,ప్రభాతవార్త)



ఎలమంచిలి బైపాస్ నుండి పాయకరావుపేట తాండవ బ్రిడ్జి వరకు గల జాతీయ రహదారిపై నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సిపిఎం నేత అప్పలరాజు అన్నారు. సోమవారం ధర్మవరం గ్రామంలో పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని రోడ్డు ప్రమాదాలు జోన్ గా గుర్తించారు, కానీ ప్రమాదాలు అరికట్టడానికి, నివారించడానికి తగిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల కాలంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని,అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు, అనేక మంది తీవ్రంగా గాయాలు పాలౌతీన్నారు, తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లి దండ్రులు ఇలా అనేక మంది తీవ్రంగా ఆవేదన చెందుతున్నారని, ఇప్పటికైనా అధికారులు రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని వారి కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కర్రిశ్రీను,కలిగట్ల రాజా,కట్టుమూరి ఈశ్వరరావు,అద్దేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం.!

(ఎస్ రాయవరం,మే 4, ప్రభాతవార్త)

మండలంలో ఖాళీగా వున్న అంగన్వాడీ టీచర్ ఆయా పోస్ట్ లకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నక్కపల్లి ఐ సి డి యస్ అధికారిని శ్రీవిద్య తెలిపారు. యస్ రాయవరం మండలంలోని లక్ష్మీ పతిరాజుపేట గ్రామంలో అంగన్వాడీ సెంటర్ టీచర్ పోస్ట్, చిన్నగుమ్ములూరు2, వమ్మవరం పంచాయతీ శివారు విశ్వనాథపురం 1, వాకపాడు పంచాయతీ శివారు బంగారమ్మపాలెం 1, తిమ్మాపురం పంచాయతీ శివారు గోకులపాడు 2, పెనుగొళ్ళు పంచాయతీ శివారు సోముదేవునిపల్లి 1 అంగన్వాడీ సెంటర్లలో ఆయా పోస్టు ఖాళీలకు అభ్యర్థులు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ ఈ నెల 15 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## అడ్డురోడ్డులో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

(ఎస్ రాయవరం,మే 4, ప్రభాతవార్త )




మండలంలో అడ్డరోడ్డు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సర్వసిద్ధి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి ఆర్. సుజాత ఆధ్వర్యంలో,ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు నెలకు 10 గ్రామాల్లో,ఉచిత వైద్య శిబిరంలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో, గ్రామాల్లో ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, గ్యాస్టిక్ చర్మ వ్యాధులు,దగ్గు,జ్వరం అన్ని రకాల వ్యాధులకు,మా డిస్పెన్సరీ సర్వసిద్ధి హాస్పిటల్‌లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.వ్యాధుల బారిని పడకుండా, ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోని మందులు వాడి వ్యాదులు రాకుండా ఉండవచ్చని ఆమె తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఏవో నాగరాజు, ఆర్ ఐ నానాజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి నుండి హైదరాబాద్‌కు రెండు ట్రైన్లు పై హర్షం

- మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్




**అనకాపల్లి మే 4 (ప్రభాతవార్త):**

అనకాపల్లి పార్లమెంటు సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి జిల్లాకు ప్రధాన కేంద్రమైన అనకాపల్లి నుండి రెండు కొత్త ట్రైన్లు మంజూరు చేసి ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్ కు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు హర్షం ప్రకటించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పాటు అయిన తర్వాత అనకాపల్లి నుండి తిరుపతికు కొత్త ట్రైన్ రావడం జరిగిందని, అలాగే చర్లపల్లి నుండి అనకాపల్లి కి సికింద్రాబాద్ నుండి అనకాపల్లికి మొత్తం ఏసీ కోచ్ లు నడిచే ట్రైన్ ని తీసుకు రావడంలో సీఎం రమేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని అన్నారు. ముఖ్యంగా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సుమారు 20 లక్షల జనాభా కలిగి ఉన్నారని, ఈ ప్రాంతం నుండి దేశంలో అన్ని ప్రాంతాలకు వ్యాపార ఉద్యోగ విహార యాత్రలో తీర్థయాత్రలకు వెళ్లే వారి జనాభా రోజు రోజుకి పెరగడం వల్ల ఇక్కడ నుండి వెళ్లడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని, రామేశ్వరం ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్, గోవా ఎక్స్‌ప్రెస్, అరుణాచలం, సోలాపూర్ ఎక్స్‌ప్రెస్ వంటి సూపర్ ఫాస్ట్ ట్రైన్లు అనకాపల్లిలో హాల్ట్ కల్పించడానికి పార్లమెంట్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హాల్ట్ కల్పించినట్లయితే అనకాపల్లి పార్లమెంట్ ప్రజలకు మేలు చేసిన వారు అవుతారని అన్నారు. ఈ ట్రైన్ హాల్ట్ లేకపోవడం వల్ల దువ్వాడ, విశాఖపట్నం వెళ్లి ట్రైన్ ఎక్కవలసి వస్తుందని నాగ జగదీష్ అన్నారు. శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న లక్ష్మీదేవి పేట ఫ్లైఓవర్ వంతున పనులు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అయ్యన్నపాత్రుడు ఆర్ ఎండ్ బి మినిస్టర్ గా ఉన్న సమయంలో నిధులు కేటాయించారని, శంకుస్థాపన కూడా జరిగిందని, రైల్వే శాఖ వారు ఫ్లై ఓవర్ ట్రాక్ మీద నిర్మించడం జరిగిందని, కానీ నేటికీ దానికి అతి గతి లేదని పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని మీ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగినట్లయితే విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి ఇబ్బందులు తగ్గుతాయని, చోడవరం మాడుగుల వెళ్ళే ప్రజలకు మేలు జరుగుతుందని సత్యనారాయణ అన్నారు. ఎంపీ సీఎం రమేష్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు 2000 మంది మహిళలకు ఉచితంగా అయోధ్య శ్రీరాముని దర్శనానికి తీసుకువెళ్తానని చెప్పడం హర్షనీయమని సత్యనారాయణ అన్నారు.

## కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకోవాలి..

- మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది

(నక్కపల్లి/అడ్డ రోడ్డు, ప్రభాతవార్త)మే 04:



పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న డ్వాక్రా వివోఏ మహిళలకు రాష్ట్ర హోంమంత్రి అనిత నివాసం వద్ద డ్వాక్రా సంఘాల 5జీ స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా సోమవారం నిర్వహించారు . పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలాలు వారిగా వీవోఏలకు నాయకులు అధికారులు సెల్ ఫోన్లు అందజేశారు.అధికారులు సెల్‌ఫోన్ల వినియోగంపై వీవోఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న వీవోఏల పనితీరును మెరుగుపరచి ప్రజలకు విస్తృత సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, డ్వాక్రా



సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని, వారికి రుణాలు అందించి వివిధ వ్యాపారాలు చేపట్టేందుకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మంత్రి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం విశాఖపట్నంలా అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మహిళల ఉపాధి కోసం బొమ్మల పరిశ్రమను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. జనసేన సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో వాలంటీర్ వ్యవస్థ కారణంగా వీవోఏలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీవోఏలకు ప్రాధాన్యత ఇస్తోందని, వారికి అందించిన స్మార్ట్‌ఫోన్లను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుతో రూపురేఖలు మారనున్నాయని, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రజల మధ్య వీవోఏలు వారధిలా పనిచేస్తున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి వారు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, మాజీ ఎంపీపీ వినోద్ రాజు, ఎస్. రాయవరం మండల పార్టీ అధ్యక్షులు ఆమలంకంటి అబద్ధం, కోటవుట్ల మండల పార్టీ అధ్యక్షులు లింగన్న నాయుడు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు పద్దు, పాయకరావుపేట టౌన్ పార్టీ అధ్యక్షులు వరహాలు, చైర్మన్లు కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, చిక్కాల శ్రీను, పాయకరావుపేట మహిళా అధ్యక్షురాలు మునీషా, నక్కపల్లి జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్, జనసేన పాయకరావుపేట మండల అధ్యక్షులు యగదాసు నానాజీ,టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటరాజు, క్లస్టర్ ఇంచార్జ్ లు వైబోయిన రమణ, కంకిపాటి వెంకటేశ్వరరావు,యూనిట్ ఇన్చార్జ్ కొవిరి బంగారి, బాబ్జి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గోరింట్ల ఆశ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన,విద్యార్థులకు ఘన సన్మానం.!

(ఎస్ రాయవరం, మే 3, ప్రభాత వార్త)

పదవ తరగతి పరీక్ష ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన తమ గ్రామ విద్యార్థులను ఘనంగా సన్మానించినట్లు మండల యూత్ ప్రెసిడెంట్ సింహాద్రి యాదవ్ తెలిపారు. గ్రామంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కోనవానిపాలెం గ్రామానికి చెందిన పక్కుర్తి కీర్తన 554,మనబాల రేవతి 522,అల్లు అసలేస్ 528,కోన హిందూ 516 దారబోయిన ఉదయశ్రీ 500,కొర్ని లక్కీ 450,గొర్ల హిందు 404 ,సర్వశుద్ధి జోష్న 353 లు విజయకేతనంఎగురవేసారన్నారు. ఇంతటి ఘన విజయానికి సహకరించిన విద్యార్థిని,విద్యార్థులకు అధ్యాపక బృందానికి, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలియచేసారు. విజేతలైన విద్యార్థులకు సింహాద్రి యాదవ్ ఆధ్వర్యంలో సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాయకరావుపేట నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు మాజీ సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్ కోన దుర్గ బాబు, సూరిబాబు, సత్తిబాబు ప్రసాద్, రమణ,నాగేష్,కృష్ణ దొంగబాబు, నాగబాబు, అప్పలనాయుడు,శ్రీను, తాతారావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



ong-11._ong-11..qxd 5/4/2026 11:12 PM Page 1



## ప్రజా ఫిర్యాదులపై నిబద్ధతతో చర్యలు చేపట్టాలి: ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, మే 4 ప్రభాతవార్త :**



ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులను నిబద్ధతతో పరిశీలించి, చట్టపరంగా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం'లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి,వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 79 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు తెలిపారు.ప్రతి ఫిర్యాదును చట్టపరంగా విచారించి, సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు. అదేవిధంగా, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా సంప్రదించి, ఫిర్యాదులపై వెంటనే విచారణ ప్రారంభించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

## జిఎంఆర్ ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

### ఫ్రంటియర్స్ ఇన్ ఫిజికల్ అండ్ కెమికల్ సైన్సెస్ ఇన్నోవేషన్స్ ఇన్ అడ్వాన్స్డ్ మెటీరియల్స్

**రాజాం, మే 4 ప్రభాతవార్త :**



స్థానిక జిఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (డీమ్డ్ యూనివర్సిటీ) మరియు ఐఐటీ గువాహటి నానోటెక్నాలజీ సెంటర్ సంయుక్తంగా ఫ్రంటియర్స్ ఇన్ ఫిజికల్ అండ్ కెమికల్ సైన్సెస్ ఇన్నోవేషన్స్ ఇన్ అడ్వాన్స్డ్ మెటీరియల్స్" అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ సోమవారం జిఎంఆర్ఐటి డీమ్డ్ యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైనది. మే 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం.శరత్ చంద్రబాబు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన ప్రసంగిస్తూ గ్రీన్ హైడ్రజన్ ఉత్పత్తి, నిల్వ మరియు వినియోగం యొక్క ప్రాముఖ్యతపై, అలాగే కార్బన్ క్యాప్చర్ వినియోగం మరియు వివిధ కాంపోజిట్ పదార్థాలు మరియు మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ల ద్వారా వాటి వినియోగం వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డా. టి.పవన్ కుమార్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఐ.ఎం.టీ భువనేశ్వర్ ప్రతినిధులు మాట్లాడుతూ లెర్నింగ్స్ ను ఇన్నోవేషన్‌గా మార్చడం, ఇండియా ఫస్ట్ భావన, మరియు మేధో సంపత్తి హక్కులు గురించి ప్రసంగించారు. వైస్ చాన్సలర్ డా. జె.గిరీష్ మాట్లాడుతూ విద్యార్థుల పాఠ్య ప్రణాళిక అనేది శతాబ్దాలుగా జరిగిన శాస్త్రీయ పరిశోధనల ద్వారా సాధించిన అభివృద్ధుల సమాహారమని తెలిపారు. డీన్ ఫిజికల్ సైన్సెస్ డా. ఆర్.ఎల్. నాయుడు మాట్లాడుతూ ఎఫ్‌డీపీ పరిశోధకులు, అధ్యాపకులు మరియు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. ఎస్.ఎన్. దాస్ ప్రసంగిస్తూ కార్యక్రమ ముఖ్యాంశాలను వివరించారు. కన్వీనర్ డా. ఎం.వి. సుబ్బారావు స్వాగతోపన్యాసం చేస్తూ ఫిజికల్ మరియు కెమికల్ సైన్సెస్‌లో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌లో ఆవిష్కరణలను అన్వేషించేందుకు ఈ ఎఫ్‌డీపీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఐఐటి గువాహటి తరపున ఈ కార్యక్రమానికి కన్వీనర్గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ డి.పాము ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ నానో పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. డా. కె.కోటేశ్వరరావు వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డా కె.రవీంద్రనాథ్, డా బి.విశ్వనాథం, డా.వి.ఢిల్లేశ్వరరావు, డా ఎన్.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ పట్ల ప్రిన్సిపల్ డా. సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి. ప్రసాద్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా మంత్రి అచ్చెన్నాయుడు పెళ్ళిరోజు వేడుకలు

**కోటబొమ్మాళి, మే 4 ప్రభాతవార్త :**



రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయమాధవి 25వ పెళ్ళిరోజు వేడుకలు నిమ్మాడ తన స్వగృహంలో గ్రామస్థులు, కుటుంబసభ్యులతో సోమవారం ఘనంగా నిర్వహించారు. దంపతులు ఇద్దరు కేక్‌ను కట్‌చేసి ఒకరిని మరొకరు తినిపించుకున్నారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా అచ్చెన్నాయుడు ఎదగడానికి, ఆయన వెనుక నిలిచిన కుటుంబ మద్దతు, ముఖ్యంగా వారి జీవిత భాగస్వామి సహకారం ఎంతో కీలకం. 25 ఏళ్ల సుదీర్ఘ దాంపత్య ప్రయాణం అనేది సాధారణ విషయం కాదు. అది ప్రేమ, నమ్మకం, త్యాగం, బాధ్యతల సమ్మేళనం. ఈ దంపతులు ఆ విలువలను ఆచరణలో చూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కుటుంబసభ్యులు కొనియాడారు.

## బీజేపీ ఘన విజయంపై సంబరాలు

**వీరఘట్టం, మే 4 ప్రభాతవార్త :**




పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని సాధించడంతో పార్వతీపురం బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కార్యకర్తలు కలిపి సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ విధివిధానాలు నచ్చి ప్రజలు మంచి తీర్పునిచ్చారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు అభివృద్ధి, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత, పారదర్శక పాలన చూసి బిజెపి పార్టీపై తమ అభిమానాన్ని కురిపించారని ఆయన అన్నారు ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి, ఆనందంతో కేరింతలు కొడుతూ, బాణాసంచా కాలుస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇందులో భాగంగా కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు మిఠాయిలు పంచుతూ విజయోత్సవ సంబరాలని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, విక్రమపురం మాజీ సర్పంచ్ మాచర్ల మహేష్ ఇతర సీనియర్ నాయకులు, వివిధ విభాగాల మహిళా ప్రతినిధులు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తులకు జైలు శిక్ష

**సీతంపేట, మే 3 ప్రభాతవార్త :**



మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు ఐదు రోజులు జైలు శిక్ష మరో 8 మందికి ఒక్కొక్కరికి 2500 రూపాయలు ఫైన్ విధిస్తూ పాలకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు సీతంపేట ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఇటీవల సీతంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతూ వ్యక్తులు పట్టుబడుగా సదరు వ్యక్తులను పాలకొండ ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ వారి ముందు హాజరుపరచగా అందులో ఒక వ్యక్తికి ఐదు రోజులు జైలు శిక్ష, మిగతా 8 మందికి కూడా ఒక్కొక్కరికి 2500 రూపాయలు ఫైన్ విధించారు. సీతంపేట వారపు సంతలో వాహనదారులకు అవగాహన కల్పించారు.

## పేరాల్సిస్ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం

**సంతబొమ్మాళి, మే 4, ప్రభాతవార్త :**



మండలంలోని కొల్లిపాడు గ్రామానికి చెందిన పేరాల్సిస్ వ్యాధితో బాధపడుతున్న ముద్దాడ యర్రయ్య కుటుంబానికి మరువాడ యువత ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన యర్రయ్యకు పెళ్లీడు కుమార్తె కూడా ఉంది. ఈ పరిస్థితి తెలుసుకున్న మరువాడ శ్రీ లక్ష్మీనరసింహ యూత్ మంచి మనసుతో మారువాడ గ్రామస్థులు దగ్గరకి వెళ్లి యర్రయ్య సమస్యలు తెలియజేసి గ్రామస్థుల అందరిని ఐక్యం చేసి గ్రామస్థుల కష్టార్జితం నుండి తమకు తోచిన సహాయం చేయమని కోరారు. ఈ మేరకు గ్రామంలో సహాయంగా రూ.30,050 సేకరించారు. ఈ మొత్తంను యూత్ సభ్యులు కొల్లిపాడు వెళ్లి యర్రయ్య కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో అన్ కాల్ డ్రైవర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 4 ప్రభాతవార్త :**

శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం 1 మరియు 2వ డిపోలలో ఆన్ కాల్ డ్రైవర్లను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని డీఎం అమరసింహుడు శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేయు టకు ఆసక్తి, అర్హతలు గల డ్రైవర్లు (12/05/2026) మంగళవారం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 21 ఏళ్లు దాటిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. 18 నెలల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పూర్తయిన వారు మాత్రమే అర్హులు. వివరాలకు 7382924758, 7382917289 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా!

### - ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

**కవిటి మే 4 ప్రభాతవార్త**



మత్స్యకార గ్రామాల అభివృద్ధికి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానంటూ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ఘంటాపదంగా అన్నారు. ఈ మేరకు సోమవారం ఇద్దివాని పాలెం గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి సృజన పథకం ద్వారా కొత్త బోర్‌వెల్‌కు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వము ఇందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, పి.కృష్ణారావు మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు సీపాన వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ పట్నాయక్, నేతలు భీమారావు రౌలో, ఎంపీడీవో ఎల్.త్రినాధ్, ఏవో శ్రీనివాస్‌రెడ్డిల తో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐటీడీఏలో ఆయుర్వేద వైద్య శిబిరం

**సీతంపేట, మే 4 ప్రభాతవార్త :**



సీతంపేట ఐటిడీఏలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, మెడ భుజాల నొప్పులు, జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు, గ్యాస్, మలబద్దకం, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, రక్తహీనత, పైల్స్, ఫిస్టులా, రక్తపోటు, మధుమేహం, చర్మ రోగాలు, కిడ్నీ సమస్యలు (రాళ్లు), వ్యారికోస్ వీన్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు సందర్శించారు. అదే విధంగా ఈ వైద్య శిబిరం ద్వారా ఐటిడిఏ ఉద్యోగులు, గ్రీవెన్స్‌కు వచ్చిన లబ్ధిదారులు తమ అనారోగ్య సమస్యలకు సంబంధించి ఆయుర్వేద మందులను తీసుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని 30 మంది రోగులు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఓ వెంకట గణేష్, డిప్యూటీ డిఈఓ పాలక నారాయుడు, ఆయుర్వేద డాక్టర్ నందన, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నపూర్ణేశ్వరి ఉత్సవాలు

**కవిటి, మే 4 ప్రభాతవార్త**



మండలం జగతి పంచాయతీ చిన్నమెలియపుట్టుగ గ్రామంలో వెలసియున్న శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి సంబర మహోత్సవాలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో బాణాసంచాలతో మేల తాళాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో పాటు పలువురు వైసీపీ నేతలు గ్రామ పెద్దలు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నైబర్ హుడ్ వర్క్ స్పేస్‌లకు దరఖాస్తులాహ్వానం

### - జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి

**వీరఘట్టం, మే 4 ప్రభాతవార్త :**



నైబర్ హుడ్ వర్క్ స్పేస్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ నైబర్ హుడ్ వర్క్ స్పేస్ పాలసీ 2025-30 లో భాగంగా జిల్లాలో పారిశ్రామికవేత్తలు, ఫ్రీలాన్సర్లు, మైక్రో ఎంటర్ ప్రైజర్స్‌కు సమీపంలో కార్యాలయ వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ పథకం క్రింద భవనాలను లీజుకు ఇవ్వదలచిన దెవలపర్లు ఆన్లైన్‌లో ధరఖాస్తు చేయాలని సూచించారు.

## గుత్తేదారుల సమస్యలు పరిష్కరించాలి

**కోటబొమ్మాళి, మే 4 ప్రభాతవార్త :**



శ్రీకాకుళంలోని గుర్తేదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఏబీసీపీ గుత్తేదారుల సంఘం నగరపాలక సంస్థ కమిషనర్ హనుమంతు కుర్మనాధంకు సోమవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సీఎఫ్ఎంఎస్ 2025 మార్చి తరు వాత రిటర్న్ బిల్స్ నేటికి తిరిగి చేయకపోవడం పాస్ అర్డర్ అయిన బిల్లులు గత ఆరు నెలలు నుంచి సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయకపోవడం, రికార్డులు పూర్తి చేసిన పాస్ ఆర్డర్ కొరకు కొన్ని నెలలుగా తీవ్ర జాప్యంగా ఉన్నాయని, కాల పరిధి పూర్తి అయిన బిల్లులు ఈఎండీ, ఎఫ్ఎస్‌డీలు చెల్లించకపోవడం, అగ్రిమెంటు అయి అప్పగించిన పనులకు ఈఎంఈడీలు తిరిగి చెల్లించకపోవడం, టెండర్ ఓపెన్ అయ్యాక ఎల్ఐ అప్రూవల్ అగ్రిమెంటు చేయటంలో తీవ్ర జాప్యం పనులు పూర్తి అవుతున్నా అగ్రిమంట్ కాకపోవటం తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అయనకు అందజేశారు. వీరిలో అధ్యక్షులు గొర్లె వెంకట రామానాయుడు, ప్రధాన కార్యదర్శి చల్ల సింహాచలం ఉన్నారు.

## జిల్లా టాపర్ లక్ష్మీప్రసన్నకు అభినందించిన ఎమ్మెల్యే 'కూన'

**ఆముదాలవలస, మే 4 ప్రభాతవార్త :**



నియోజవర్గంలో సరుబుజ్జిలి మండలం పెద్ద సవలాపురం గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మీప్రసన్నకు ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 597/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సంపాదించింది. తండ్రి కోరాడ గున్నారావు ఇండియన్ ఆర్మీలో ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. భవిష్యత్తులో ఢిల్లీ ఎయిమ్స్‌లో డాక్టర్ కోర్సు చేయాలనే ఆలోచనతో వున్నట్లు లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన కోరాడ లక్ష్మీప్రసన్నకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, పి ఎం జె బాబు, పల్లి సురేష్, ఇతర ప్రజాప్రతినిధులు అభినందించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారాసెట్మాల్ బిళ్ళ లేదు..

## గాయానికి కట్టే దూది ముక్క లేదు: మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి




**పాతపట్నం, మే 4 ప్రభాతవార్త :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా గాలికొదిలేసిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని, ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ లైబ్రరీలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించారని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నాడునేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించి, విలేజ్ క్లినిక్‌ల నుండి బోధనా ఆసుపత్రుల వరకు ఆధునీకరించి, ప్రజలకు వైద్యం భారమవ్వకూడదని ఆరోగ్యశ్రీని బలోపేతం చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం తన అసలు రంగు బయట పెట్టుకుందని, నాడు నేడు ద్వారా అభివృద్ధి చెందిన పాఠశాలలను, ఆసుపత్రులను కనీసం నిర్వహించలేక నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య రంగం పూర్తిగా కుంటుపడిందని, సామాన్యుడికి వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. ఆసుపత్రులకు వెళ్లే రోగులకు కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయని, జ్వరం వస్తే ఇచ్చే క్రోసిన్ (పారాసెటమాల్) బిళ్ళలు, గాయాలకు కట్టే 'కాటన్' (దూది), కనీసం ఒక చిన్న బ్యాండేజ్ వంటి ప్రాథమిక అవసరాలు కూడా ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడం శోచనీయమన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అని ప్రగల్భాలు పలికే కూటమి ప్రభుత్వం, కనీసం ఆసుపత్రుల్లో దూది, బిళ్ళలు కూడా ఉంచలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

# శ్రీకాకుళం వార్త



## ఉన్నత స్థానాలు అధిరోహించాలి : డాక్టర్ కృష్ణంరాజు

కంచిలి, మే 4 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి విద్య పట్ల కాకుండా అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని కంచిలి వైద్యులు కృష్ణంరాజు అన్నారు. సోమవారం మండలం ఎంఎస్



పల్లి మోడల్ పాఠశాలలో విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు కృష్ణారెడ్డి అకాడమీ విజయనగరం సన్మానించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 5 విద్యార్థులు కర్రి స్వాతి 587, పొందర రీతిక బడిత్య 585, శ్రద్ధాంజలి మహంతి 583, తెలుగుల జాహ్నవి 577, పూతుర్ల రవి కిరణ్ 574, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులు ఎంపీసీ విభాగంలో కర్తలి మౌనిక 971, బైపీసీ విభాగంలో కర్రీ సంతోషి 987, దత్తి లోలమ్మ 981, సిఇసి విభాగంలో తమరాల మనీషా 833 మార్కులు సంపాదించారు. వీరికి మెమొంటోతో పాటు వెయ్యి రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 చిట్టిబాబు, ప్రిన్సిపాల్ నడుకుదుటి శివప్రసాద్, ప్రిన్సిపాల్ కవిత సాహూ ఉపాధ్యాయులు రవి, దివాకర్, రమేష్, శారద పాల్గొన్నారు.

## కృష్ణమూర్తి నాయుడు కుటుంబానికి పలువురు పరామర్శ

**కంచిలి, మే 4 ప్రభాతవార్త :**



కంచిలి మండలం, చిన్నకొజ్జిరియా పంచాయతీ గ్రామానికి చెందిన జిల్లా కోర్ట్ జడ్జ్ గొనప షణ్ముఖరావు తండ్రి, సుదీర్ఘ రాజకీయ వారసత్వంగా కొనసాగిన మాజీ సర్పంచ్‌గా, మంచి వ్యక్తిగా, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తిగా, ప్రజల గుండెలలో శాశ్వతంగా నిలిచిపోయిన గొనప కృష్ణమూర్తి నాయుడు (89) ఇటీవల స్వర్గప్రాప్తి పొందారు.విషయం తెలుసుకొని వారి యొక్క చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన గౌరవ ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక మాజీ సర్పంచ్ గొనప సీతారాం, మఖరాంపురం ఎంపీటీసీ ప్రతినిధి ఎలుసూరి అప్పారావు, లోల్ల శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంస

**కోటబొమ్మాళి, మే 4 ప్రభాతవార్త :**



ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలలో నరసన్నపేటకు చెందిన ఎ.గాయత్రి ప్రభుత్వ పాఠశాలలో చదివి 581 మార్కులను సాధించింది. అదేవిధంగా పి.తరుణ్ కుమార్ నిమ్మడలో ప్రభుత్వ వసతి గృహంలో చదువుకొని 560 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మార్కులు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన వైనంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి దంపతులు ఆ చిన్నారిని ఆశీర్వదించి, భవిష్యత్తులో అండగా ఉంటామని అన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యల కారణంగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంటూ, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు తమ కూటమి నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని, ఇందుకు అధ్యాపక బృందం కూడా తోడ్పాటు ఇస్తూ శక్తి వంచన లేకుండా పని చేస్తూ అద్భుత విజయాల సాధనలో భాగం అవుతున్నామని చెప్పారు.

## బీజేపీ ఘన విజయంపై ఎచ్చెర్ల క్యాంపు కార్యాలయంలో సంబరాలు

**రణస్థలం, మే 4 ప్రభాతవార్త :**



పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని సాధించడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం బి.ఎల్.ఏ 1 నడుకుదిటి తేజబాబు సోమవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఇఆర్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, కార్యకర్తలకు, నాయకులకు మిఠాయిలు పంచుతూ విజయోత్సాహాన్ని పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలన, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బీజేపీకి ఘన విజయం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడుకుదిటి రజనీ ఎన్ఇఆర్ స్వీట్స్ పంపిణీ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సంబరాల్లో బిజెపి జిల్లా అధ్యక్షులు సిరివరపు తేజేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, సవ్వాన ఉమామహేశ్వరి, డాక్టర్ సింధూర, మదన్ మోహన్, మండల అధ్యక్షులు మహంతి అనంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు

**వీరఘట్టం మే 4 ప్రభాతవార్త :**



ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే చర్యలు తప్పని సీఐ ఎ.ప్రసాదరావు హెచ్చరించారు. సోమవారం మండలం కేంద్రంలోని మరియగిరి వద్ద వాహనాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హెల్మెట్ నిండు ప్రాణాలను రక్షిస్తుందని, కుటుంబాలు సురక్షితంగా ఉంటాయని ఆయన అన్నారు. అలాగే కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్‌తో పాటు ప్రక్క సీట్లో కూర్చున్న వ్యక్తి కూడా సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఆటోలు అతి వేగంగా నడపకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి నిర్లక్ష్యంగా ఆటో నడపకూడదని ఆయన అన్నారు. దీంతో పాటు స్థానిక ఎస్సై షణ్ముఖరావు కూడా ఉన్నారు.

## నవోదయ పరీక్షలో వివేక్ మాస్టర్ మైండ్స్ విద్యార్థి ప్రతిభ

**వంగర, మే 4 ప్రభాతవార్త :**

నవోదయ ప్రవేశ పరీక్షలో వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలకు చెందిన బెవర రుత్విక్ ప్రతిభ చాటి వెన్నెలవలస జవహర్ నవోదయ 6వ తరగతిలో సీటు సాధించాడు. సోమ వారం రుత్విక్‌ను తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవ రావు నాయుడు, ఎంపీపీ సురేష్ ముఖర్జీ, మండల విద్యాశాఖాధికారి గణేష్ నాయుడు వివేక్ మాస్టర్ మైండ్స్ ఉపాధ్యాయ సిబ్బంది, అభినందించారు.


**టెండరు నోటీసు**

విషయం:- ఇచ్ఛాపురం పురపాలక సంఘములో 15 వ ఆర్థిక సంఘ పనులకు గూర్చి టెండర్లు ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా ఈ క్రింది విధముగా పిలువబడుచున్నవి.

1. టెండర్ నోటీస్ నెంబరు : 72/2017-18/ఇ 1 తేది 04.05.2026

| | |
|---|---|
| మొత్తం పనులు సంఖ్య | : 22 (15వ ఆర్థిక సంఘం) |
| అంచనా విలువ రూ. | : 77.52 లక్షలు |
| బిడ్ డౌన్ లోడింగ్ ప్రారంభం | : తేదీ 04-05-2026 ది సాయంత్రం 5 గంటలకు |
| బిడ్ క్లోజింగ్ | : తేదీ 19-05-2026 సాయంత్రం 3 గంటలకు వరకు |
| బిడ్ రిసెప్ ఆఖరు | : తేదీ 19-05-2026 సాయంత్రం 4 గంటలకు వరకు |
| బిడ్ ప్రైస్ ఓపెనింగ్ | : తేదీ 19-05-2026 దీ సాయంత్రం 5 గంటలకు వరకు |

మిగిలిన వివరములకు https; www/e-procurement.gov.in నందు చూడగలరు.
మరియు ఫోను నెంబర్ 08947-231176 మరియు సెల్ నెం. 9014127410

సం/- కమీషనర్
ఇచ్ఛాపురం పురపాలక సంఘం

# మనమే స్ఫూర్తి!



పిల్లలు ఏదీ విని నేర్చుకోరు. మనల్ని చూసి అనుకరిస్తారు. నువ్విలా ఉండాలి. నువ్వలా ఉండాలి అని పిల్లలకి పదేపదే చెప్పే బదులు.. మనమే వాటిని ఆచరించి ఊపించాలి. ప్రాసెస్డ్ చేసిన.. చిరుతిళ్లు మనం తింటూ పిల్లలను తినొద్దంటే వింటారా?

**వ్యాయామం, తోటపనిలాంటివి మనం చేస్తే చిన్నారులూ మన అడుగుజాడల్లో నడిచి అలాంటి అలవాట్లు నేర్చుకుంటారు.**

ఈ వయసులో నేనేం నేర్చుకుంటా అనే నిరాశని ఎప్పుడూ పిల్లల ఎదురుగా ప్రదర్శించకండి. సామాజికపరమైన మార్పులను గుర్తించడం, వాటికి తగినట్లు మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం, ఎప్పటికప్పుడు కొత్త పాఠాలు నేర్చుకోవడంలో పెద్దవాళ్లగా మనం ఎప్పుడూ వెనకడుగు వేయకూడదు. వీటి నుంచి ఎటువంటి అనుభవాలెదురైనా తల్లిదండ్రులు సానుకూలంగా తీసుకొనే తీరే. పిల్లలను భవిష్యత్తులో శక్తిమతులుగా తీర్చిదిద్దుతుంది. కాలానికి తగ్గట్లు తమని తాము తీర్చిదిద్దుకోవడం, నిత్యం ఏదో ఒక కొత్త విషయం తెలుసు కోవడం వంటివి పెద్దవాళ్ల నుంచి పిల్లలు నేర్చుకొంటారు.

**సేవ:** పేద విద్యార్థులకు విద్యనందించడంలో చేయూత, ఆర్థికంగా వెనకబడిన పిల్లలకు పుస్తకాలు, దుస్తులిప్పించడం వంటివి పిల్లలతో చేయించాలి

**జీవితాన్ని...** పద్దెవాళ్ల తమ జీవితానుభవాలను పిల్లలతో పంచుకోవాలి. గతంలో చేసిన పొరపాట్లు, వాటి నుంచి నేర్చుకొన్ని పాఠాల్ని వారికి చెప్పాలి. రోజూవారీ జీవితంలో పడే కష్టాలు, ఇబ్బందులను వారికి వివరించాలి. రూపాయి విలువనూ చెప్పాలి. ఇవన్నీ పిల్లలకు జీవితమంటే ఏంటో అర్థమయ్యేలా చేస్తాయి. ఇంట్లో వ్యక్తులే కాకుండా ఇతరులతోనూ బంధాలనెలా పటిష్టం చేసుకోవాలో చెప్పాలి. అలాగే ఇతరులు చెప్పేది పూర్తిగా వినడం, ఎదుటివారి పట్ల మర్యాదగా ప్రవర్తించడ వంటివన్నీ చిన్నారులు తమ తల్లిదండ్రుల నుంచి నేర్చుకుంటారు. ▫

# కాటుకతో మోము అందం



**కాటుక వల్ల కంటి అందమే కాదు.. మోము సౌందర్యం కూడా ద్విగుణీకృత మవుతుంది. మరి అలాంటి కాటుక వల్ల కళ్లకు ఎలాంటి ప్రయోజ నాలున్నాయి? అసలు కళ్లకు కాటుక ఎలా పెట్టు కోవాలి. పెట్టుకునేటప్పుడు గుర్తుంచు కోవాల్సిన అంశాలేంటి?**

**కంటికి చల్లదనం....** కాటుక.. కళ్లను హైలైట్ చేయడమే కాదు. కంటికి చల్లదనాన్ని కూడా అందిస్తుంది. రాత్రి పూట కళ్లకు కాటుక పెట్టుకొని పడుకోవడం వల్ల కంటిలో ఉండే మలినాలు తొలగి కళ్లు శుభ్రపడతాయంటున్నారు నిపుణులు.

**పెట్టుకునేటప్పుడు ఇలా ..** కళ్లకు కాటుక పెట్టుకోవడం కూడా ఓ కళే! కాటుక పెట్టుకునేటప్పుడు కొన్ని నియమాలు పాటిస్తే మరింత ఆకర్షణీయంగా కనిపించచ్చంటున్నారు నిపుణులు. కాటుక పెట్టుకునే ముందు కళ్లను శుభ్రంగా కడుక్కోవాలి. .తర్వాత కళ్లను పొడిగా తుడుచుకొని మాయిశ్చ రైజింగ్ క్రీమ్‌తో కళ్ల చుట్టూ మసాజ్ చేసుకోవాలి. ఒకవేళ మీది ఆయిల్ చర్మం అయితే క్రీమ్‌కి బదులు ఫేస్ పౌడర్ ఉపయోగిస్తే సరిపోతుంది. లేదా టిష్యూ పేపర్‌తోనైనా కళ్ల చుట్టూ నీట్‌గా తుడుచుకోవాలి. మొదట కంటి కింది రెప్పకు. తర్వాత పై రెప్పకు కాటుక అప్లై చేసు కోవాలి. దీనికోసం మనం ఉప యోగించే కాజల్ టిప్ గట్టిగా, గరుకుగా, కఠినంగా ఉండకుండా జాగ్రత్త పడాలి. ఎందుకంటే గరుకుగా ఉంటే కంటి లోపల గుచ్చుకునే ప్రమాదం ఉంది. కొంత మందికి కాటుక చేత్తో పెట్టుకునే అలవాటు ఉంటుంది. అలాంటివారు కాటుక పెట్టుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం మరచిపోవద్దు. అలాగే వేళ్లకు గోళ్లు పొడవుగా లేకుండా చూసుకోవాలి. లేదంటే అవి కళ్లల్లో గుచ్చు కుంటాయి. బ్లాక్ జెల్ లైనర్ పెట్టుకుంటే కంటి అందాన్ని మరింత ద్విగుణీకృతం చేసు కోవచ్చు. తక్కువ నాణ్యత గల కాటుకను ఉపయోగించడం వల్ల అందులో ఉండే హాని కారక రసాయనాలు వివిధ రకాల కంటి సమస్యలను కలుగ జేస్తాయి. కాబట్టి నాణ్యమైన కాటుకను ఎంచు కోవడం మంచిది. కాటుక పెట్టుకునే ముందు కళ్లకు ఫేస్‌పౌడర్ అప్లై చేసు కోవాలి. దీనివల్ల కాటుకనుఫేస్ పౌడర్ గ్రహించి మరెక్కడా అంటుకోకుండా, కంటి చుట్టూ ముఖమంతా విస్తరించ కుండా జాగ్రత్త పడచు . కను రెప్పలు ఆయిలీగా ఉండటం వల్ల కూడా కాటుక విస్తరించే అవకాశం ఉంటుంది. ఇలా కాకుండా ఉండాలంటే కాటుక పెట్టుకునే ముందే ఒక ఇయర్ బడ్‌ని తీసు కున్నకను రెప్పలపై తుడవాలి. ఫలితంగా అక్కడ జిడ్డు దనం పోయి కాటుక విస్తరించ కుండా. కళ్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కాటుక పెట్టుకున్న తర్వాత కళ్లను నలపకూడదు. అలాగే కాటుక మరెక్కడా అంటుకో కుండా ఉండాలంటే కాటుక పెట్టుకున్న భాగానికి కాస్త కింది భాగంలో లిక్విడ్ లైనర్‌ని అప్లై చేసుకోవాలి. ఫలితంగా కళ్లకు మంచి లుక్ కూడా వస్తుంది. ▫

**చిట్కా**

- చీమలు అధికంగావున్న చోట గెమాక్సిన్ పౌడరు చల్లండి చీమలు లేకుండా పోతాయి.
- ఉప్పుతో కాచిన కాళ్ళతీతలు పోతాయి. ▫

# చదువులమ్మా!

## నీతోనే.. నేను!



**'వయసు ఓ అంకె మాత్రమే. జీవితం ఓ అంతులేని సముద్రం అన్న ఆలోచన ఉంటే చాలు. తాను సాధించలేనిదేదీ ఉండదని అనుకుంది ఓ అమ్మ**

ఎప్పుడో పలకా బలపం, పెన్ను పుస్తకం వదిలిపెట్టిన ఓ ఇల్లాలు తమ బిడ్డలే లోకంగా పెరిగింది. తీరా పిల్లలకు మంచి చదువులు నేర్పించే క్రమంలో తను కూడా పుస్తకాలంటే మక్కువ చూపింది. పదో తరగతి చదివే చిన్నబ్బాయికి మంచి ర్యాంక్ రావాలన్నది ఆమె ఆశ . ఆ ఆశకు పురుడు పోసే క్రమంలో తను కూడా పదో తరగతి పుస్తకాలను పదే పదే వల్లెవేసేది. అదే క్రమంలో తనూ ప్రయివేటుగా పదో పరీక్షలు రాయలన్న తపన ఆమెలో కలిగింది. కొడుకుతోపాటు తానుకూడా పదోతరగతి పరీక్షలు రాయాలన్న సంకల్పం తో ఓపెన్ స్కూలు పరీక్షకు ఫీజు కట్టింది. చదువులకు అంకితమైన పిల్లలకు తోడుగా అమ్మలు కూడా పుస్తకాల పురుగుల్లా మారిపోతున్న తరుణం యిది అయితే ఆమె ఓ ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్ ఉంటుంది కదా ! అని పరీక్షరాసింది. చదువుకు వయసు అడ్డుకాదని నిరూపిస్తూ, గతంలోనే ఎంతో మంది తల్లులు ఉన్నత చదువులు చదివి ఎంతో మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఈ తల్లి ఆచరణలో చూపించారు. తన కుమారుడితో పాటు పదో తరగతి పరీక్షలు రాసి, ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులై అందరికీ ఆదర్శంగా నిలిచారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఈ తల్లీకొడుకులను అందరూ , అభినందిస్తున్నారు. పాలకొల్లుకు చెందిన బండారు లక్ష్మీ ్మ లహరి గృహిణి. అదే సమయంలో ఆమె కుమారుడు విజయ్ కూడా టెన్త్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో లక్ష్మీ ్మ లహరి 360 మార్కులురాగా, విజయ్ 562 మార్కులతో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. దీంతో వారి కుటుంబంలో ఎక్కడా లేని ఆనందం వెల్లివిరిసింది. ఒకేసారి టెన్త్ ఫస్ట్ క్లాసులో ఉత్తీర్ణులైన తల్లీకొడుకుల ఆనందానుభూతి మాటల్లో చెప్పలేక ఎగిరిగంతసారు. ఆ తల్లికొడుకురిద్దరూ ఫలితాల కోసం ఎదురుచూసిన ఉద్విగ్న క్షణాలు చెప్పుకోదగినవి. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేవనో, చదువెందులే పెళ్లిచేసి పంపించేద్దాం అనుకునే ఆలోచనలను పక్కన బెటినంట లక్ష్మీలహరి దారి చదువులమ్మ వెంట నడవడం మేలు. ▫

# దైవం తోడుంటే..

ఒక ధనికుడు తనకొక మంచి గురువును చూపమని రోజూ ప్రార్థించేవాడు. అతడోరోజు ఆలయం నుంచి వస్తుంటే చినిగిన బట్టలతో ఉన్న వ్యక్తి కనపించాడు. అతని ముఖంలో తేజస్సు, ప్రశాంతత చూసి.. ఇంత పేదవాడు ఎలాంటి అలజడీ లేకుండా శాంతంగా ఎలా ఉన్నాడని ఆశ్చర్యపోయాడు. అతడిలో ఏదో ప్రత్యేకత ఉంది, కొంత ధనమిచ్చి పేదరికం నుంచి బయటపడేస్తే సంతోషిస్తాడు అనిపించింది. ఇది నీకు చాలా మంచిరోజు. అందుకే నా కంట పడేలా చేశాడు దేవుడు. భగవంతుడు నా ద్వారా నీకు అదృష్టాన్ని ప్రసాదించదలచాడు అన్నాడు ధనికుడు కాస్త గర్వంగా. నాకు చెడు రోజంటూ ఎన్నడూ లేదే! నేను దురదృష్టవంతున్నని చెప్పానా? నాలో అలాంటి భావమే లేదు అని అతడంటే.. అది ప్రత్యేకంగా చెప్పాలా? నువ్వు బాధల్లో ఉన్నావని స్పష్టంగా తెలుస్తోంది. పోన్లే నీకిక భగవంతుడు నాద్వారా సంతోషాన్ని ప్రసాదిస్తాడు అన్నాడు ధనికుడు. దానికి పేదవ్యక్తి దైవాన్ని నమ్ముకున్నాను. నా జీవితంలో విషాదమనేది లేదు. అది నీ ఊహ మాత్రమే అన్నాడు. ధనికుడిలో సహనం నశించి, ఏం చూసుకుని నీకింత పొగరు? అన్నాడు. అతడు నవ్వి భగవంతుడు ఏం చేసినా.. అంతిమంగా అది మన మంచికే అని నమ్ముతాను. అందుకే నాకు కష్ట సమయంలోనూ సుఖమూ, అదృష్టమే అనిపిస్తుంది అన్నాడు. ధనికుడికి చిరాకేసి నీలాంటివాడు నరకానికే వెళ్తాడు అన్నాడు. అయితేనేం. వినయం, ప్రేమ అనే రెండు చేతులతో భగవంతుని ఆలింగనం చేసుకుంటాను. అప్పుడాయన కూడా నాతో పాటే ఉంటాడు. దైవం తోడుంటే నరకం కూడా స్వర్గమే. ఆయన లేకుంటే స్వర్గం కూడా నరకమే బదులిచ్చాడు పేద. దాంతో ధనికుడికి జ్ఞానోదయమైంది. భగవంతుడు నీ రూపంలో గురువును ప్రసాదించాడని ఆయన ఎంతో ఆనందపడ్డాడు. ▫

# దుర్వాసన వస్తోందా ?



**ఎండాకాలంలో చెమటతో ఇబ్బందే. ఇవి కొందరిలో తీవ్ర దుర్వాసనను కలిగిస్తాయి. దీన్ని దూరం చేయడానికి రసాయనాలతో కూడిన బాడీస్ప్రేలూ, సెంట్‌లూ వాడుతుంటారు. బదులుగా సహజ పదార్థాలతో సమస్యను దూరం చేసుకోవచ్చు. అదెలాగంటే..** రెండు చెంచాల టీట్రీ ఆయిల్‌కీ, అదే పరిమాణంలో నీటిని కలిపి.. స్ప్రే బాటిల్లో వేయాలి. ఈ మిశ్రమాన్ని చెమట ఎక్కువ పట్టే భాగాల్లో చల్లితే సరి. టీట్రీ ఆయిల్ సహజ క్రిమినాశిని. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటం వల్ల దుర్వాసన దూరమవుతుంది. దీంతో పాటు గ్రీన్‌టీ ఆకులను వేడినీళ్లల్లో మరిగించి.. చల్లారాక అందులో దూదిని ముంచి, ఆ శరీర భాగాల్లో తరచూ శుభ్రం చేయాలి. అప్పుడు నెమ్మదిగా వాసన దూరం అవుతుంది. నగ్రీన్ టీ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. చెమట వాసన రావడానికి శరీరంలోని పిహెచ్ స్థాయిలు కూడా ఒక కారణం. ఇందుకు రెండు చెంచాల చొప్పున నిమ్మరసం, మొక్కజొన్న పిండిని తీసుకుని పేస్టు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని బాహుమూలల్లో రాసి పదినిమిషాలు మర్దన చేయాలి. ఇలా రోజుకోసారి చేస్తే చెడువాసన దూరమవుతుంది. టొమాటో, నిమ్మరసాల్నీ సమపాళ్లలో తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చెమట వాసన వచ్చే చోట రాసి పదినిమిషాలాగి చల్లటి నీటితో కడిగేయాలి. టొమాటో చెడు బ్యాక్టీరియాను నిరోధించడంలో సాయపడుతుంది. కప్పు యాపిల్ సిడార్ వెనిగర్‌కి అరకప్పు నీటిని కలిపి స్ప్రే బాటిల్లో నింపాలి. దీన్ని రోజూ రాత్రి నిద్రపోయే ముందు అండర్ ఆర్మ్స్‌కు రాసి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగితే సరి. ▫

# బెండకాయ మటన్ ..



**కావలసినవి :** బోన్‌లెస్ మటన్ : ముప్పావుకిలో, బెండకాయలు: పావుకిలో, టొమాటోలు: నాలుగు, ఉల్లిపాయలు: రెండు, అల్లం వెల్లుల్లి: టేబుల్‌స్పూను, ఉప్పు: తగినంత, ధనియాలపొడి: 2 టీస్పూన్లు, గరంమసాలా: 2 టీస్పూన్లు, కారం: 4 టీస్పూన్లు, దాల్చినచెక్క: 2 అంగుళాల ముక్క, పలావు ఆకులు: రెండు, యాలకులు: రెండు, లవంగాలు: 12, నూనె: 6 టేబుల్‌స్పూన్లు.

తయారుచేసే విధానం : ఎ బెండకాయల్ని కడిగి తడి లేకుండా తుడిచి ముక్కలుగా కోయాలి. ఎ టొమాటోల్నీ ఉల్లిపాయల్నీ తురిమినట్లుగా సన్నని ముక్కలుగా కోయాలి. బాణలిలో నూనె వేసి ఉల్లిముక్కలు వేయించాలి. తరవాత దాల్చినచెక్క ముక్కలు, లవంగాలు, పలావు ఆకులు యాలకులు వేసి వేగనివ్వాలి. అల్లం వెల్లుల్లి కూడా వేసి వేగాక మటన్ ముక్కలు ఉప్పు వేసి పది నిమిషాలు ఉడికించాలి. కారం, ధనియాలపొడి వేసి ఓ రెండు నిమిషాలు ఉడికించాక టొమాటో ముక్కలు వేసి నూనె బయటకు వచ్చేవరకూ వేగనివ్వాలి. ఇప్పుడు ఈ కూర మిశ్రమాన్ని మొత్తంగా కుక్కర్‌లో వేసి సుమారు ఆరు కప్పుల నీళ్ల పోసి గరం మసాలా కూడా వేసి మూతపెట్టి ఐదారు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. తరవాత బెండకాయ ముక్కలు కూడా వేసి అవి ఉడిచేవరకూ సిమ్‌లో సుమారు అర గంటసేపు ఉడికించి దించాలి. ▫

# తెర

## తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రానికి మంచి విజయం: లతీష్



**మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?..**

నగరిలో మాది వ్యవసాయ ఆధారిత నిరుపేద కుటుంబం. ఉప్పు దొంగతనం చేసుకుని తిన్న రోజులున్నాయి. మమ్మల్ని మా అమ్మ నాన్న, అన్నయ్య కష్టపడి చదివించారు. నేను సినిమాల్లోకి వచ్చా నని మా అన్నయ్య నాతో మాట్లాడటం మానేశాడు. కానీ ఈ సినిమా చూసి, అందులో నా పర్ఫామెన్స్ చూసి మాట్లాడాడు.

**మీ సినిమా ప్రయాణం గురించి చెప్పండి?..**

బెంగళూరులో కొన్ని రోజులు ఉద్యోగం చేశాను. 2017లో హైదరాబాద్‌కి వచ్చాను. అప్పటి నుంచే సినిమాల్లో నటించాలని ప్రయత్నించాను. అందరూ నా యాక్టింగ్ బాగానే ఉందని అంటూ చెప్పారు. కానీ ఎవ్వరూ అవకాశం ఇవ్వలేదు. మహిపాల్‌వద్ద కొన్ని రోజులు అసిస్టెంట్‌గా పని చేశాను.

**ఈ జర్నీలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?..**

షార్ట్ ఫిల్మ్ చేసినప్పుడు చాలా కష్టాలు పడ్డాను. ఆ టైంలో కెమెరా కొనేందుకు ఇంట్లో వాళ్లనే డబ్బులు అడిగాను. నిర్మించేందుకు డబ్బులు పెట్టేందుకు కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు. నాకు ఏ అసోసియే షన్‌లోనూ మెంబర్ షిప్ లేదు. వేరే డైరెక్టర్ మీద ఆ కథను రిజిష్టర్ చేయించాను. నిర్మాత కూడా నన్నే డబ్బులు అడిగాడు. ఆ తరు వాత నేను డా. షేక్ జాన్ బషీర్‌వద్ద ట్రైనింగ్ తీసుకున్నాను.

**బీ స్టూడియోలో మీ జర్నీ గురించి చెప్పండి?..**

బీ స్టూడియోలో యాక్టింగ్ కోర్స్ కోసం లక్ష రూపాయలు అడిగారు. డబ్బులున్న వాళ్లకే ఈ యాక్టింగ్ అని నేను దీనంగా అడిగాను. వెంటనే నా దగ్గర రూపాయి కూడా తీసుకోకుండా నా కమిట్మెంట్ ను చూసి ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చారు.

**విలన్‌గా నటించడం ఎలా అనిపించింది?..**

ఒకప్పుడు విలన్‌గా నటించిన వారు ఆ తరువాత కాలంలో పెద్ద హీరోలుగా మారారు.

**ఇండస్ట్రీ నుంచి మీకు వచ్చిన ప్రశంసల గురించి చెప్పండి?**

కిరణ్ అబ్బవరం అన్న సినిమా చూసిన తరువాత టీం అందరినీ మెచ్చుకున్నారు. అందులో మరీ ముఖ్యంగా ప్రదీప్ అన్నని, నన్ను ఎంతో ప్రశంసించారు. బయట ఇంత సైలెన్స్‌గా ఉన్నావ్.. స్క్రీన్ మీద అలా కనిపించావ్ ఏంట్రా అని ఆశ్చర్యపోయారు.

**ప్రస్తుతం చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్, చేస్తున్న పని ఏంటి?..**

బీ స్టూడియోలో పార్ట్ టైంగా పని చేస్తున్నాను. చాలా మంది నుంచి ఫోన్స్ వస్తున్నాయి. చాలా కథలు వింటున్నాను. కానీ ఇంత వరకు ఏదీ క్లారిటీ రాలేదు. త్వరలోనే అన్నీ ఓ కొలిక్కి వచ్చేలా ఉన్నాయి.

# 'విశ్వంభర' త్రిషా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్న ఈ చిత్రం విడుదలకు దగ్గరవుతోంది. చిరంజీవి పుట్టినరోజున విడుదల చేసిన స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో హీరోయిన్ అవని పాత్ర పోషించిన త్రిషా కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా, చిత్ర బృందం ఒక అద్భుతమైన కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో, లేత రంగు సాంప్రదాయ దుస్తులలో, మృదువైన ఎంబ్రాయిడరీతో ఉన్న త్రిషా, వెలుగుతున్న దీపాల పళ్ళెం పట్టుకుని ఎంతో అద్భుతంగా కనిపిస్తోంది. గోల్డ్ కలర్ బ్యాక్ డ్రాప్ పోస్టర్‌కు పండుగ వాతావరణాన్ని జోడిస్తోంది. దర్శకుడు వశిష్ట విజు వల్ వండర్, మాస్ అప్పీల్ మేళవించి 'విశ్వంభర'ను ఒక అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. చిరంజీవి కొత్త లుక్‌తో లార్జర్‌దాన్‌లైఫ్ పాత్రలో కనిపించ నున్నారు ఈ చిత్రంలో ఆషికా రంగ నాథ్, కునాల్ కపూర్ ముఖ్య పాత్రల లో నటిస్తుండగా, మోని రాయ్ ఒక స్పెషల్ సాంగ్ లోకనిపించను న్నారు. అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల ఈ చిత్రానికి పని చేస్తున్నారు. చోటా కె నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ . ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి నేపథ్య సంగీతాన్ని అందించగా, డ్యాన్స్ నెంబర్‌కి భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూర్చారు. మప్రముఖ హాలీవుడ్ స్టూడియోలు వీఎఫ్ఎక్స్ వర్క్స్ నిర్వహిస్తున్నాయి 'విశ్వంభర' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఘనంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

# 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' మే 15న విడుదల



మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అరవింద్ మండ్యం లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మించారు. 'సిహెచ్‌వి ఎస్ఎన్‌వి బాబ్జీ' సమర్పి స్తున్నా రు. ఈ చిత్ర టీజర్, ట్రైలర్, విభిన్నమైన ప్రమోషన్లు, పాటలకు ఇప్పటికే ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా మేకర్స్ విడు దల తేదీని ప్రకటించారు. మే 15న ఈ సినిమా శ్రీ వెంకట సాయి ఫిల్మ్స్, ముత్యాల రామదాస్ డిస్ట్రిబ్యూషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఫ్యూచర్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉండబో తోందనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో పాటు, ఒక అందమైన ప్రేమకథ కూడా ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. నిజాయితీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమిం చుకుంటే ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందో ఈ సినిమాలో చూపించను న్నారు. ఈ హృద్యమైన కుటుంబ కథా చిత్రం సమ్మర్‌లో ప్రేక్షకులకు సంపూర్ణవినోదాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఈ చిత్రంలో నెల్లూరు సుదర్శన్, హర్ష చెముడు, గుండు సుదర్శన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# 'గోదారి గట్టుపైన' చిత్రంతో ఎంజాయ్ చేస్తారు: నిర్మాత అభినవ్



యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'తో అలరించబోతున్నారు.

**మీ నేపథ్యం గురించి?**

నేను 10 ఏళ్లుగా విభిన్నమైన వ్యాపారాల్లో ఉన్నాను. నాకు సినిమా అంటే ప్యాషన్ ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం చూస్తున్న సమయంలో సుభాష్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. నేను యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్‌తో కథ చేయాలని అనుకున్నాను. అలాంటి కథ ఈ సినిమాతో కుదిరింది.

**మీ తొలి సినిమా నిర్మాణ ప్రయాణం ఎలా అనిపించింది?**

చాలా బాగుంది. టఫ్‌గా ఉంది. ఏ పరిశ్రమలో అయినా టఫ్ ఉంటేనే బాగుంటుంది. నా వరకు ఏదైనా టఫ్‌గా ఉంటేనే చేయాలనిపిస్తుంది.

**టైటిల్ ఛాయిస్ ఎవరిది?**

రెండు మూడు టైటిల్స్ అనుకున్నాం. అయితే నేటివిటీకి ఈ టైటిల్ చాలా దగ్గరగా అనిపించింది. నేను సజెస్ట్ చేశాను. డైరెక్టర్‌కి కూడా నచ్చింది. అలాగే యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్ కావడంతో గోదారి గట్టుపైన పేరు ఫైనల్ చేశాం.

**పక్కా తెలంగాణ మాట్లాడే సుమంత్ ప్రభాస్‌ను ఈ సినిమాకి ఎంపిక చేయడానికి కారణం?**

ఒక నటుడు ఛాలెంజ్ ఉన్న పాత్ర చేయాలని కోరుకుంటాడు. తెలంగాణలో చేయడం అతనికి ఈజీ. కానీ ఈ పాత్ర కోసం గోదారి యాసను పర్ఫెక్ట్‌గా నేర్చుకుని, ఛాలెంజ్‌గా తీసుకుని చేశాడు.

**డైరెక్టర్ సుభాష్ గురించి?**

ఈ సినిమా చేసే ముందు దాదాపు పది కథలు విన్నాను. సుభాష్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ఆయన డైరెక్టర్‌గా కూడా నాకు చాలా ఇష్టం. చాలా డెడికేషన్‌తో పనిచేస్తారు. ఆయనకి సినిమా తప్ప మరో ధ్యాస ఉండదు.

**సునీల్ నారంగ్ గురించి?**

సునీల్ గారు నాకు శ్రేయోభిలాషి, మార్గదర్శి. ప్రతి విషయంలో సపోర్ట్ చేస్తారు. జగపతి బాబు, లైలా , రాజీవ్ కనకాల వంటి అనుభవం ఉన్న నటీనటులు నా తొలి సినిమాకే పని చేసే అవకాశం దొరికిందంటే.. కారణం సునీల్ ప్రోత్సాహం ఉంది.

**హీరోయిన్ నిధి గురించి**

డైరెక్టర్ సుభాష్ రాసుకున్న క్యారెక్టర్‌కు నిధి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. జగపతి బాబుతో నిధి మధ్య చాలా మంచి ఎమోషన్స్ ఉంటాయి. కథలో ఎమోషన్స్ రాసిన విధానం, తీసిన విధానం చాలా పెక్యులర్‌గా ఉంటాయి. థియేటర్స్‌లో ఎంజాయ్ చేసే మంచి అనుభవం ఇస్తుంది. ఎమోషన్స్, కామెడీ, డ్రామా అన్నీ అద్భుతంగా బ్లెండ్ అయ్యాయి.

**మ్యూజిక్ గురించి?**

వంశీ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. కథ, ఎమోషన్స్‌ను మ్యూజిక్ బాగా ఎలివేట్ చేస్తుంది.

**మీకు ఇష్టమైన జోనర్ ఏమిటి? ఎలాంటి సినిమాలు చేయాలని భావిస్తున్నారు?**

నాకు అన్ని జానర్స్ ఇష్టం. థియేటర్‌లో ఆడియన్స్‌ను ఎంగేజ్ చేసే కథలని ప్రొడ్యూస్ చేయాలని భావిస్తున్నాను

# త్వరలో 'మట్టన్'చిత్రం



పుష్ప" చిత్రంతో గుర్తింపు పొందిన నటుడు జగదీష్ ప్రతాప్ బండారి, ఈ చిత్రంని యువ దర్శకుడు హర్ష డైస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డైస్ ఆర్ట్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ప్యాన్ ఇండియా ప్రాజెక్ట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'మట్టన్' చిత్రం త్వరలో గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రేపు అధికారి కంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. అయితే ముందుగానే బయటకు వచ్చిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రక్తం.. రణం.. ప్రతీకారం.." అనే ట్యాగ్‌లైన్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో జగదీష్ ప్రతాప్ బండారి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆయన కొత్త లుక్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్యాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇండస్ట్రీలో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. టీమ్ మనస్వి, రాజేష్ కన్నా, రమేష్ మాదాసు, క్రాంతి సంజయ్, కిరీటి రాజ్ ముస్సి, రవివర్మ ఉప్పలపాటి, తనాయ్ దేవునూరి, శ్రీనాథ్, నాగదీపక్ తదితరులు.

# ఘనంగా మూవీ 'M4M' ప్రీ రిలీజ్



అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ M4M చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. PVR Inox Pictures ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా ప్రీ జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తెలుగు సినీ దర్శకుల సంఘం (TFDA) అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, సీనియర్ డైరెక్టర్ వి. సముద్ర హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా దర్శకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో ఈ వేడుక జరగడం ప్రత్యేకతగా నిలిచింది. (TFDA)అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ: మోహన్ వడ్లపట్ల తన టీమ్‌తో కలిసి గొప్ప టాలెంట్‌ను తెరపై ప్రదర్శించారని ప్రశంసించారు. జో శర్మకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. దర్శకుడు, TFDA Vice President వి సముద్ర మాట్లాడుతూ:మే 8న విడుదల కానున్న ఈ సినిమా పెద్ద హిట్ కావాలని ఆకాంక్షి ంచారు. మోహన్ వడ్లపట్ల గొప్ప దర్శకుడిగా ఎదగాలని కోరుకున్నారు. TFDA సెక్రటరీ పెండ్యాల మాట్లాడుతూ: 'M4M' ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా ఉందని, సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా ఉందని చెప్పారు. ప్యాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## 10 ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు: ఎంఈఓ

**చీపురుపల్లి మే 4 ప్రభాతవార్త**



చీపురుపల్లి మండలంలో 10వ తరగతి పరీక్షలు తప్పిన 170 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చీపురుపల్లి మండల విద్యాశాఖ అధికారి ఎం బూసి నాయుడు సోమవారం నాడు విలేకరులకు తెలిపారు. చీపురుపల్లి మండలంలో 752 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా 588 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. వీరిలో 170 మంది విద్యార్థులు 10వ తరగతి ఫెయిల్ కాగా చీపురుపల్లి బాలుర బాలికల ఉన్నత పాఠశాల తో పాటు పెదనపల్లి పాఠశాలలో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేసి టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థుల కొరకు ప్రత్యేక తరగతులను సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులకు నియమించి శిక్షణను ఇస్తున్నామని వివరించారు. విద్యార్థుల కొరకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పాఠశాలల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు చీపురుపల్లి రెసిడెన్షియల్ పాఠశాల నుండి 11 మంది విద్యార్థినీలు ఫెయిల్ కాగా వారికి నెలిమర్ల రెసిడెన్షియల్ స్కూల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## ప్లాస్టిక్ రహిత పల్లెలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- భోగాపురంలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగమాధవి

**భోగాపురం: మే 04,(ప్రభాతవార్త)**



పల్లెలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. సీఎం చంద్రబాబు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే నాగ మాధవి సోమవారం స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం పల్లెలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఆలోచనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంట్లో తడి, పొడి (ప్లాస్టిక్ వంటివి) చెత్తలను వేరుచేసి స్వచ్ఛ రథాలకు అందజేయాలన్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వంటి వాటిని తూకం వేసి వాటి బరువుకు సమానంగా నిత్యవసర వస్తువులను అందజేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఆమె ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ బాటిల్లను సేకరించి, తూకం వేసి వాటికి సమానంగా నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, ఈవో రవణమ్మ, జనసేన నాయకులు పడాల శ్రీనివాసరావు, వందనాల రమణ, పల్లంట్ల జగదీష్, జగ్గపు రవి, వరుపుల గిరి, గుండపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్య పరిష్కారం ప్రధాన లక్ష్యం

- వైసీపీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి

**చీపురుపల్లి మే 4 ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని జి అగ్రహారం ,బ్రాహ్మణ వీధి, పోలీస్ స్టేషన్ రోడ్, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి మహిళలు, పెద్దలు, యువకులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న జడ్పీటీసీ ప్రతినిధి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు,స్థానికంగా ఏ సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకుని వస్తే తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారం తో పదవులతో సంబంధం లేకుండ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామని హామీ ఇచ్చారు. వార్డుల్లో మంచి నీరు కుళాయిలకి సంబందించిన లేదా వీధి లైట్స్, వీధి కాలువలు క్లీనింగ్ లాంటివి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫోన్‌లో స్పందించిన అధికారి రెండు మూడు రోజుల్లో జి. అగ్రహారం లో ఉపాధి పనులు పెడతామని చరవాణి ద్వారా తెలియజేసారు. విషయం విని స్థానికులు సంతోషం వ్యక్తం చేసారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధి నుంచి ఆంజనేయ బొమ్మకి వెళ్లే వీధి లో సిమెంట్ రోడ్డు మీద చెత్తలు కుప్పలుగా వున్నాయి అని మహిళలు చెప్పగా వెంటనే పంచాయతీ అధికారులతో మాట్లాడి చెత్తకుప్పలు అప్పటికప్పుడే పరిశుభ్రం చేయించారు.

## పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఏఎంసీ చైర్మన్ ముఖి

**పాచిపెంట మే 4 ప్రభాతవార్త**



మండలంలో గల గ్రామాల్లో తమ తమ ఇల్లు ముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సాలూరు ఏఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో గల అన్ని గ్రామ పంచాయతీల్లో మండల స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తెలుగుదేశం నాయకులు పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం మండల కేంద్రమైన పాచిపెంట ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులతో పాటు వీధి కాలువల్లో మురుగునీరును చెత్త చెదారం తొలగించారు. అదేవిధంగా మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఈవోపీఆర్డి మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలములో గల 60 మంది హరిత రాయబారుల సేవలను ఉపయోగించుకొని గ్రామము లోని మురుగు కాలువలు అన్నీ శుభ్ర పరచడం మరియు బైపాస్ రోడ్డు లో గల చెత్త చెదారం ను పోగు చేసి ఎస్ డబ్ల్యుపిసిషెడ్ నకు తరలించి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి మురుగు నీటి ని తొలగించుటకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో పాచిపెంట ఎంపిటిసి సభ్యులు పల్లేడ ఉమామహేశ్వరరావు ఏఎంసి డైరెక్టర్ పూసర్ల నరసింగరావు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మతల బలరాం, మండల టిడిపి నాయకులు మెహెర్ బాబా, కొత్తల పోలినాయుడు సచివాలయ కార్యదర్శి దీపక్, సిబ్బంది గ్రీన్ అంబాసిడర్ అంగన్వాడీ వర్కర్ లు , ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరిస్తాం

- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

**భోగాపురం: మే,04,(ప్రభాతవార్త)**



భోగాపురం పంచాయతీ పరిధిలో ఉన్న పాలబందచెరువును నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సోమవారం సందర్శించారు. చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను పరామర్శించి, వారి పని విధానం మరియు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగ మాధవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ఒక భరోసా అని పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా పని చేసే ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు నీడ సౌకర్యం కల్పించేలా టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. కూలీలు చేసిన పనికి తగ్గ వేతనం తమ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి, కూలీలకు గరిష్టంగా పని దినాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అలాగే మస్టర్ల నమోదు మరియు నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప రాణి, ఏపీవో భాగ్యలక్ష్మి, జనసేన నాయకులు పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, సీఐ కే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా వాసవి భవన్ ఏసీ కళ్యాణ మండపం ప్రారంభం : మంత్రి

**సాలూరు మే 4 ప్రభాతవార్త**



సాలూరు పట్టణ పెదకోమటిపేట వాసవి భవణం పునఃనిర్మాణంలో కొత్తగా రూపు దిద్దుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి భవన్ ఏసీ కళ్యాణ మండపం(టూ ఫ్లోర్ సెంట్రల్ ఏసీ)గా మార్చడం జరిగింది.దీనిని సోమవారం విశిష్ట అతిథిగా హాజరైన మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతేకాకుండా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిధిగా పాల్గొని ఆర్యవైశ్య సంఘ పెద్దలకు బెస్ట్ విషెస్ చెప్పారు.అనంతరం సంధ్యారాణి మాట్లాడుతు వాసవి భవన్ ఏసీ కళ్యాణ మండపాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అలాగే అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలకు అందుబాటు లోకి తెచ్చినందుకు ఆర్యవైశ్య సంఘాన్ని అభినందించారు. మండవిల్లి. సోమేశ్వరరావు, నారాయణరావు, విశ్వేశ్వరరావు, తాతాజీ,టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది.చిట్టి,వేణు పాల్గొన్నారు.

## విత్తనాల పంపిణీలో అలసత్యము వద్దు: ఎంపీపీ పద్మావతి

**కురుపాం, మే 4, ప్రభాతవార్త**



విత్తనాలు పంపిణీలో అలసత్యం చూపించరాదని వ్యవసాయ అధికారి పై ఎంపీపీ శెట్టి పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశ ము ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన సమావేశము నిర్వహించారు. మొదటగా వ్యవసాయ శాఖపై చర్చ జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడితే వ్యవసాయ అధికారులు విత్తనాలు పంపిణీలోని ప్రజా ప్రతినిధులకు తెలియజేయకుండా నిర్లక్ష్మహిస్తున్నారని ఆమె అన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అందరికీ విత్తనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. విద్యాశాఖ పై చర్చ జరిగినప్పుడు పదవ తరగతి పరీక్షలలో మండలంలో గిరిజన సంక్షేమ పాఠశాలల లో 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని ఏ టి డబ్ల్యూ ఓ చంద్రబాబు తెలిపారు. జిల్లాలో మొదటి స్థానంలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత పొందారాని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. టైగర్ రాష్ట్ర డైరెక్టర్ లావణ్య మాట్లాడుతూ నీలకంఠాపురం గిరి సంక్షేమ బాలుర పాఠశాలలో నీరు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. పాఠశాల అభివృద్ధికి , పాఠశాలల్లో సమస్యలు ఉన్న తనకు తెలియజేసినట్లయితే వెంటనే విద్యాశాఖ మంత్రి లోకేష్ కి తెలియజేస్తానని మనకు అధికారులు తనకు విషయము తెలియజేయాలని అన్నారు. మండలంలో అధికారులు మండల స్థాయి అధికారులే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరవ్వాలని సిబ్బందిని పంపించరాదని ఎంపీడీవో ఉమామహేశ్వరి అన్నారు. వైద్య నీటి పారుదల శాఖ ఐసిడిఎస్ పలు శాఖల అధికారులు వారి ప్రగతిని వివరించారు. సమావేశం లో జడ్పిటిసి సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ ని సార్, మండల ఉపాధ్యక్షులు అన్నాజీ, రంగారావు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్,మండల స్థాయి అధికారులు ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

## ప్రహసనంగా ఆర్టీసి ప్రయాణం..ఆగని బస్సులు..

**గరివిడి మే,4 ప్రభాతవార్త**

ఆర్ టి సి ప్రయాణం ప్రహసనంగా మారింది. బస్సు ఎక్కాలంటే ఎంతో ప్రయాసకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు బస్సు వస్తుందో తెలియదు,వచ్చిన బస్సు ఆగుతుందో లేదో తెలియదు. ఆగినా పిక్కబలం,జెబ్బ సత్తువ ఉంటేనే బస్సు ఎక్కే పరిస్థితి కనిపిస్తోంది. నిత్యం కిట కిట లాడుతున్న ప్రయాణీకులు తో బస్సులు శరవేగంగా దూసుకుపోతుండటమే కనిపిస్తోంది, కానీ బస్సులు మాత్రం ఆగవు. డ్రైవర్, కండక్టర్ ల ఉదార స్వభావం పై ఆధార పడి కొన్ని పాస్సెంజర్ బస్సులు ఆగుతుంటాయి. ఆగని బస్సులే ఎక్కువ. పాసంజర్ లు అగక పోయినా,ఎక్స్ ప్రెస్ బస్సులు నిలుపుదల చేయక పోయినా ఏ ఒక్క అధికారి పట్టించు కోరు.పాలకులు అస్సలు ఆ వంక చూడరు.పాలకులు, నాయకులు కి సొంత వాహనాలు ఉండటంతో వారు బస్సులు నిలుపుదల వైపు కూడకుండా సొంత వాహనాలపై ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు.ఎక్స్ ప్రెస్, డీలక్స్, లగ్జరి, సూపర్ డీలక్స్, త్రీ స్టాప్స్ గల బస్సు లు నిలుపుదల చేయడం గగన కుసుమమే. ఏ ముహూర్తాన కూటమి సర్కారు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందో కానీ ప్రయాణీకులు కి కష్టాలు ఎక్కువయ్యాయి. ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు కల్పించడం ద్వారా మగువల మన్ననలను పొందాలను కున్న సర్కారు వారి లో కొందరు నుండే సానుకూలత పొందుతోంది. మరికొందరి నుండి వ్యతిరేకత పొందుతుండగా, పురుష ప్రయాణీకులు, కొందరు మహిళా ప్రయాణీకులు, ఆటోడ్రైవర్ లు,నుండి ప్రభుత్వం వ్యతిరేకత మూట గట్టుకుంటోంది. ఆర్టీసీ సిబ్బంది కారణంగా ప్రభుత్వ సానుకూలత కాస్తా వ్యతిరేకంగా మారుతోంది. ఈ పథకం వలన ప్రభుత్వం కి మేలు కంటే కీడే చేకూరే పరిస్థితులు కనిపిస్తున్నాయన్న వ్యాఖ్యానాలు వ్యక్తం అవుతున్నాయి. రాత్రి ఏడు గంటల కు విజయనగరం ఆర్ టి సి కాంప్లెక్స్ లో చీపురుపల్లి, రాజాం వెళ్లేందుకు బస్సులు ఉన్నాయా లేదా అని ఎంక్వైరీ లో అడిగితే బస్సులు లేవనే సమాధానం వస్తుంది. రాత్రి 9 గంటలకు ఒక బస్సు రావొచ్చు అన్న సమాధానం విని ప్రైవేట్ వాహనాల ని ఆశ్రయించే ఆలోచన ప్రయాణీకులు కి కల్పించడం అక్కడ ఆర్ టి సి సిబ్బంది వంతవుతోంది. ఇక పాస్సెంజర్ బస్సులు కొన్ని ఆపుతున్నారని మరికొన్ని ఆపడం లేదని ఆర్టీసి అధికారులు దృష్టి కి తీసుకు వెళ్లిన సందర్భంలో ఆపుతారు, డ్రైవర్ ల గ్రూపు లో వారికి బస్సులు నిలుపుదల చేయాలని సమాచారం పెడతామని అధికారులు పేర్కొని మిన్నకుండి పోతున్నారే తప్ప బస్సులు నిలుపుదల పై చర్యలు శూన్యం.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కోళ్ల

**శృంగవరపుకోట,మే4, ప్రభాతవార్త**



రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు కల్పించడమే కాకుండా భూ రికార్డుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పేర్కొన్నారు. సోమవారం ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ముసిడివల్లి పంచాయతీ పరిధిలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన 155 మంది రైతులకు ఆమె పట్టాదార్ పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పాసుపుస్తకాల కోసం నిరీక్షిస్తున్న రైతులకు నేడు పారదర్శకమైన ప్రక్రియ ద్వారా వారి పత్రాలను అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ ప్రభుత్వానికి అసలైన సంతృప్తి అని ఆమె వ్యాఖ్యానించారు.ప్రభుత్వం చేపడుతున్న భూసంస్కరణలు పారదర్శక పాలన వల్ల రైతులకు తమ ఆస్తులపై భరోసా కలుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ ఒబ్బిన సత్యనారాయణ,తహశీల్దార్ శ్రీనువాసరావు,రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆర్.చంద్ర శేఖర్,మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ నానిగిరి రమనాజీ,కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కదులుతున్న టేకు దొంగల డొంక...?

- గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

**పార్వతీపురం, మే4, ప్రభాతవార్త:**



ఇటీవల మండలంలోని ఆదారి గ్రామంలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో దొంగతనంగా ఎటువంటి అనుమతులు లేకుండా14 టేకు చెట్లు నరికిన విషయాన్ని సోమవారం బిజెపి నాయకులు సురగాల ఉమామహేశ్వరరావు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తు వేగవంతం చేయాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు. హెచ్ఎం తీరు పట్ల కూడా అనుమానాలు ఉన్నాయని అన్నారు. విద్యాలయాల్లో ఉన్న చెట్లు నరకాలంటే విద్యాశాఖా, రెవెన్యూ శాఖా అనుమతి తప్పనిసరి అని అన్నారు. అలాగే 14 చెట్లు నరికి ఎవరికంట పడకుండా తీసుకెళ్లడం అసాధ్యమని, నిష్పక్షపాతంగా సరైన రీతిలో దర్యాప్తు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయని అన్నారు. అమాయకులను బలి చేయకుండా చెట్లు దొంగతనం వెనుక ఎంత పెద్దవారు ఉన్న కేసు పెట్టీ శిక్షించాలని అన్నారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను సాలూరు అటవీశాఖ అధికారులు విచారిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఈ విషయంపై సిపిఎం నాయకులు స్పందిస్తూ వ్యవహారంపై తెరవరక ఉన్న పెద్దలను ప్రజల మధ్యకి తేకపోతే ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని అన్నారు.

## నిబంధనలు కు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

- సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ

**పాచిపెంట మే 4 ప్రభాతవార్త**

వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చర్యలు తప్పవని సాలూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి రామకృష్ణ హెచ్చరించారు . మన్యం జిల్లా పార్వతీపురం ఎస్పి ఆదేశాల మేరకు పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో అంతరాష్ట్ర పీ.కోన వలస చెక్ పోస్ట్ వద్ద సీఐ ఎస్సై ఎల్ అర్జున్ సిబ్బందితో పలు వాహనాలు ను సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

## ఓవర్ లోడ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రెండు కేసులు నమోదు

**బలిజిపేట మే 4 ప్రభాతవార్త**



పార్వతిపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్ .మాధవరెడ్డి ఆదేశాల మేరకు బర్లి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ 2.0 కార్యక్రమాన్ని పార్వతిపురం రూరల్ సిఐ పి రంగనాథం మరియు బలిజిపేట ఎస్సై వై సింహాచలం మరియు సీతానగరం సిబ్బందితో కలిసి వాహన తనిఖీ ముమ్మరంగా చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రజలకు సంకల్పం 2.0 అవగాహన కల్పిస్తూ మాదకద్రవ్యాలు వినియోగం రోడ్డు భద్రత మరియు చైల్డ్ మ్యారేజ్ సైబర్ సెక్యూరిటీ మునగ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి తెలియజేశారు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా రెండు ఆటలు ఓవర్ లోడ్ వెళ్తున్న ఆటోలను పరిగణించి వారిపై కేసు నమోదు చేశారు మరియు రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి వారిపై తగు చర్య తీసుకుంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పార్వతిపురం రూరల్ సిఐ బలిజిపేట సిబ్బంది మరియు ఎస్ఐ సీతానగరం సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు

## ఈ నెల 8 నుండి గరివిడి లో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు

**గరివిడి మే,4 ప్రభాతవార్త**



ఈ నెల 8 ,9 10 తేదీల్లో విశ్వ భారత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్వ భారత్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బలివాడ రమేష్ వెల్లడించారు. గరివిడి విశ్వ భారత్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వెటరన్ జాతీయ వాలీబాల్ క్రీడాకారులు, కళాకారులు తో కలసి ఆయన మాట్లాడారు. జాతీయ వాలీబాల్ పోటీల బ్రోచర్ ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరివిడి లో జాతీయ వాలీబాల్ పోటీలు నిర్వహించి గరివిడి గత వైభవాన్ని ,క్రీడా ప్రభావాన్ని జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయడమే ధ్యేయంగా పురోగమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి రంగ స్థల ఉత్తమ కళాకార అవార్డు గ్రహీత కంబాల శివ,జాతీయ స్థాయి రంగ స్థల కళాకారులు ఎస్ ఆర్ ఖాన్, వ్యాఖ్యాత ఉప్పు శ్రీనివాసరావు, వెటరన్ వాలీబాల్ క్రీడాకారులు సాంబ మూర్తి రాజు, జి.హరి గంగా ధర రావు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిబాబు,విజయనగరం జిల్లా స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె వి ఏ ఎన్ రాజు, మేధర మెట్ల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొని వాలీబాల్ పోటీలు కి సంబంధించి పలు అంశాలు వివరించారు.

## ఆంజనేయ స్వామి విగ్రహాల నిర్మాణానికి శంకుస్థాపన

**దత్తి రాజేరు మే 4 ప్రభాతవార్త**



మండల పరిధిలో గల షికారు గంజి రోడ్ జంక్షన్ వద్ద శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహాల నిర్మాణ కొరకు ఆలయ నిర్వాహకులు గెంజి త్రినాధ పతివాడ ఆనంద్ శంకుస్థాపన కార్యక్రమాన్ని పురోహితులు రవి గురు స్వామి అత్యంత శాస్త్రక్కుత్తకంగా పూజలు చేశారు మంత్రోచ్చారణతో ఆలయ నిర్వాహకులకు గోత్రనామాలు అభిషేక పూజలు ఆంజనేయస్వామి విగ్రహల నిర్మాణ శంకుస్థాపన పూజలు చేశారు ఆధ్యాత్మిక గురువు శ్రీ సత్యానంద భారతి స్వామీజీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిపించామన్నారు కమిటీ ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమానికి వచ్చిన స్థానిక ప్రజలకు మరియు భక్తులుకు అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులు భక్తులందరికీ కలగాలని ఆంజనేయ స్వామి ఆలయం భక్తులు మరియు దాతలు సహకారంతో వేగవంతంగా పూర్తిఅవుతుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారుఈ కార్యక్రమంలో పెద్దలు భక్తులు పాల్గొన్నారు

## కన్నతల్లి ఇంట్లో కుమార్తె 5 తులాల బంగారం దొంగతనం: ఎస్ఐ

**రామభద్రపురం, మే 4, ప్రభాతవార్త**

రామభద్రపురం మండలం పరిధిలో గల అరికాతోట గ్రామస్తురాలు బోను ధనలక్ష్మి వైఫ్ ఆఫ్ రాంబాబు 36 సంవత్సరములు నాగవంశం పాచిపెంట గ్రామం అను ఆమె న తన తాత గారి గ్రామం అయినా ఆరికతోట నుండి సుమారు సాయంత్రం 5:30 గంటలకు బయలుదేరి బస్సు ఎక్కి రామభద్రపురంలో దిగి అక్కడ నుండి సాలూరు వెళ్ళుటకు ఆటో ఆటో ఎక్కి వెళ్లినట్లు సాలూరులో గల తల్లి ఇంటికి కొంకి వీధి వెళ్లిపోయినట్లు అక్కడ. 30 నిమిషాలు తరువాత తన బ్యాగ్ లో పెట్టిన సుమారు 5 తులాలు బంగారం వస్తువులు పోయినట్లు పిర్యాదు చెయ్యగ సాలూరు పోలీస్ వారు జీరో ఎఫ్ ఐ ఆర్ కట్టి రామభద్రపురం పోలీస్ స్టేషన్ కు పంపగా కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లుఎస్ ఐ వి జ్ఞాన ప్రసాద్ చెప్పారు

## నిబంధనలను పాటించుకుంటే చర్యలు తప్పవు

**మక్కువ మే 4 ప్రభాతవార్త**

మండలంలో వాహన వాహనదారులకు పోలీసు సిబ్బంది పలు కేసులలో అపరాధ రుసుములు విధించారు. సుమారు 19 వాహనాల పైన కేసులు విధించామని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా విధిగా హెల్మెట్ ధరించాలని వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. లేకుంటే అపరాధ రుసు విధించడమే కాకుండా తగు చర్యలు తప్పవని అన్నారు. ఈ వాహన తనిఖీలలో కానిస్టేబుల్ శేఖర్, హోంగార్డ్ అప్పలనాయుడు పాల్గొన్నారు

## బిజెపి గెలుపుపై ఎల్ కోటలో బీజేపీ శ్రేణుల సంబరాలు

**లక్క వరపుకోట మే 4 ప్రభాతవార్త**



దేశం లో పలు రాష్టాలలోజరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బి జెపి అభ్యర్థులు విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు ఈ సందర్భంగా ఎల్ కోట లో బీజేపీ నాయకులు బి జె పి మండల అధ్యక్షులు కోన మోహన్ రావు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి పార్టీ విజయం సాధించడంతో ఎల్ కోట మండలంలో సంబరాలు చేసుకున్నారు : ఎల్ కోట మండల బిజెపి అధ్యక్షులు సమక్షంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రకాష్ ముఖర్జీ జన్మస్థలమైన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బిజెపి విజయం సాధించడం శ్యాం ప్రకాష్ ముఖర్జీకి ఘన నివాళి అని మండల అధ్యక్షులు కోనమోహన్రావు తెలియజేశారు అనంతరం బిజెపి సీనియర్ నాయకులు బొడ్డు సత్యనా రాయణ మాట్లాడుతూ, మమతా బెనర్జీ ఒక స్త్రీ అయినప్పటికీ స్త్రీలకు 33 రిజర్వేషన్ వ్యతిరేకించినందుకు స్త్రీలు, యువత, ఆ రాష్ట్ర ప్రజలు మమతకు వ్యతిరేకంగా ఓటు వేశారనిమరియు బిజెపికి అనుకూలంగా ఓటు వేశారని తెలియజేశారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శి లెంక చంద్రావు మాట్లాడుతూ బిజెపికి భారీ మెజార్టీనిచ్చిన పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్ర ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిడుతూరి సత్యనారాయణ,సిహెచ్ అప్పారావు,ఎస్ నర్సింగరావు, సూరెడ్డి కిరణ్, బిజెపి కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు

## గ్రామ దేవతకు మహిళలు సారె సమర్పణ

**కురుపాం: మే4, ప్రభాతవార్త**



కురుపాం గ్రామ దేవత శ్రీ పైడిమారమ్మకు మహిళలు సోమవారం మేళతాళాలుతో వెళ్లి సారె సమర్పించారు. మేజర్ పంచాయతీ కురుపాం పరిదిలోని శివ్వాల వీది ,వంగర వీది ,నాయుడు వీదులకు చెందిన మహిళలు సాంప్రదాయ మేళతాళాలు తో నృత్యాలు చేస్తూ చదురు గుడిలో సారె సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆలయ ప్రతిష్టానంతర మొదటి సంబరాల్లో భాగంగా అమ్మవారి కి 101 రకాల పిండివంటలు , పసుపు, కుంకుమ ,పట్టు వస్త్రాలు తో మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నామని తెలిపారు.

## జనగణనకు ప్రజలు సహకరించాలి

**రామభద్రపురం, మే 4 ప్రభాతవార్త**



రామభద్రపురం మండలం మంగళవారం నుంచి ప్రారంభం కానున్న జనగణనకు ప్రజలంతా సహకరించాలని డివిజనల్ డవలప్మెంట్ ఆఫీసర్ ఎం. కిరణ్ కుమార్ కోరారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజలంతా ఈ జనగణనకు సహకరించాలని కోరారు. అలాగే ఎన్యూమరేటర్లు జనగణన పారదర్శకంగా నిర్వహిం చాలని సూచించారు. బాడంగి మండలంలో 84 బ్లాకులకు గానూ 12వేల 225 హౌస్హోల్డ్స్ ఉన్నాయని, 90 మంది ఎన్యూమరేటర్లను నియమించామని తెలిపారు. అలాగే బొబ్బిలిలో 22వేల 823 హౌసోల్డర్స్ ఉన్నాయని, దత్తిరాజేరు 17133, గజపతినగరం 14, 358, మెంటాడ 14.188, రామభద్రపురం 12, 772, తెర్లాం 19, 154 హౌస్ హోల్డ్స్ ఉన్నాయని తెలి పారు. వీరందరికి 703 బ్లాకులుగా విభజించామని తెలిపారు. ఇందుకోసం 660 మంది ఎన్యూమరేటర్లను నియమించామని తెలిపారు. ఈ జనగణన ఆన్లైన్లో కూడా చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

05-05pg10.qxd:05-05pg10.qxd 1/1/02 6:26 AM Page 1









# బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు

## ఐపీఎల్-2026లో సత్తా చాటుతున్న బౌలర్లు




**ఇండియన్ ప్రీమియర్ లీగ్.. ఇది కాసుల క్రికెట్‌గా, భారీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పోర్ట్ ఈవెంట్‌గా మారిందా? అంటే అవుననే అంటున్నారు మాజీ క్రికెట్ దిగ్గజాలు. ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజాలు నోసలు చిట్లిస్తున్నారు. ఐపీఎల్ వల్ల క్రికెట్ కిల్ అవుతోందని వాపోతున్నారు. ఐపీఎల్‌లో బౌలర్లకు అవకాశం తక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అవకాశం వచ్చినపుడు తామేం తీసిపోమని బౌలర్లు చాటిచెబుతున్నారు**






(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ ఇది ఫక్తు వ్యాపార వేదికగా మారిందనేది క్రీడా నిపుణులు, అభిమానులూ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్, వినోదం కలయికగా ఐపీఎల్ మారింది. భారీ స్కోర్లు, సిక్సర్లు, ఫోర్లు ఇవి మాత్రమే ప్రేక్షకులను అలరిస్తాయి. ఇదే వ్యాపార సూత్రంగా బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లు, ఇంఫాక్ట్ ప్లేయర్లు వంటి మాస్ హిట్ ఫార్ములా వచ్చాయి. ఈ ఐపీఎల్‌లోనే చూసుకుంటే శతకాల మోత మోగుతోంది. ఇప్పటివరకు 9 సెంచరీలు నమోదయ్యాయి.మరో అరుగురు నైంటీస్‌లోకి వచ్చారు. ఇక సిక్స్‌లయితే 833, బౌండరీ లయితే 1436 పారాయి. ఇక ఈ ఐపీఎల్ సీజన్ 200 ప్లస్ స్కోర్ల విషయంలోనూ రికార్డులు నెలకొల్పుతోంది. 37 సార్లు 200కు పైగా పరుగులు నమోదయ్యాయి. ఇక అరుణ్ జైట్లీ స్టేడియంలోనైతే ఒకే మ్యాచ్‌లో 529 పరుగుల వరద పారింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఇచ్చిన 265 రన్స్ టార్గెట్‌ను సైతం పంజాబ్ కింగ్స్ ఉఫ్‌మనిపించింది. 200 ప్లస్ పరుగులు చేసినా గెలుస్తామన్న ధీమా జట్లలో పెరిగింది. బంతి పడిందా స్టాండ్స్‌లోకి పంపామా అన్నదే యువ ప్లేయర్ల తీరుగా మారింది. ఎన్నో విభిన్న షాట్లు వచ్చిపడుతున్నాయి.

ఇంతటి బ్యాటింగ్ డామినేట్ గేమ్‌లోనూ బౌలర్లు కీరోల్ పోషిస్తున్నారు.తమపదునైన బంతులతో బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. 200 ప్లస్ పరుగులు నమోదవుతున్న చోటనే లో స్కోర్లు అగుపిస్తున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీని 75 పరుగులకే ఆర్సీబీ కట్టడిచేయగలిగింది. ఇక వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్, రబడ, అర్చర్, కంబోజ్, మలింగ, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు బ్యాట్స్‌మెన్‌కు తమ పేస్ రుచి చూపిస్తున్నారు. ఆరంభంలోనే వికెట్లు తీస్తూ తమ జట్ల విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నారు. భువనేశ్వర్ కుమార్, కంబోజ్ చెరో 17 వికెట్లతో టాప్‌లో కొనసాగుతున్నారు. రబడ 16 వికెట్లు...అర్చర్, మలింగ 15 వికెట్లు తరువాతి స్థానాల్లో ఉన్నారు. మేమేం తక్కువా అన్నట్లు స్పిన్నర్లు కూడా తిప్పేస్తున్నారు. రషీద్‌ఖాన్, రవి భిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి తమదైన రోజున బంతిని తిప్పేస్తూ ఒంటిచేత్తే విజయాలు అందిస్తున్నారు.

మొత్తంగా చెప్పాలంటే, ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్‌గా, అదే సమయంలో, భారీ వినోదాన్ని అందించే వ్యాపారంగా అభివృద్ధి చెందింది.

## ఛేజింగ్‌లో చెలరేగిన రోహిత్, రికల్టన్: ముంబై విన్




**ముంబై:** వాంఖడేలో పరుగుల వరద పారింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 229 పరుగుల ఛేజింగ్‌లో ముంబై ఓపెనర్లు ర్యాన్ రికల్టన్(32 బంతుల్లో 6 ఫోర్లు, 8సిక్స్‌లతో 83), రోహిత్ శర్మ(44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 84) చెలరేగారు. సిక్స్‌లు, ఫోర్లతో లక్నో బౌలర్లపై చెలరేగుతూ ఓవర్‌కు 14కు పైగా పరుగులు సాధించారు. తొలి వికెట్‌కు 11 ఓవర్లలోనే 143 పరుగుల భాగస్వామ్యం అందించి విజయానికి బాటలు వేశారు. ఇద్దరూ సెంచరీల మోత మోగించే ఊపులో కనిపించినా.. మోసిన్ ఖాన్ బంతికి రికల్టన్, సిద్ధార్థ్ బంతికి రోహిత్ శర్మ వెంటవెంటనే పెవిలియన్ చేరారు. తిలక్‌వర్మ(11), స్టాండ్ ఇన్ కెప్టెన్ సూర్యకుమార్(12) నిరాశపరిచారు. దీంతో మ్యాచ్ ఉత్కంఠ రేపినా నమన్ ధీర్(23 నాటౌట్), విల్ జాక్స్(10 నాటౌట్) ధాటిగా ఆడి మిగతా పనిని పూర్తి చేశారు. దీంతో ముంబై ఇండియన్స్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైన ముంబై ఇండియన్స్‌క ఇది ఊరటనిచ్చే విజయం.




అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నో బ్యాటర్లు చెలరేగారు. జోష్ ఇంగ్లిష్(13) వికెట్ తొందరగానే కోల్పోయినా మిచెల్ మార్ష్(25 బంతుల్లో 44), నికోలస్ పూరన్(21 బంతుల్లో63) మెరుపుఇన్నింగ్స్ ఆడారు. పవర్ ప్లే ముగిసేసరికి స్కోరును 90కు చేర్చారు. 6.5 ఓవర్లలో స్కోరును వంద దాటించారు.రెండో వికెట్‌కు94 రన్స్ అందించారు. ఈ క్రమంలో పూరన్ 16 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు.వీరిద్దరూ ఉన్నంత సేపు స్కోరు 250 దాటేలా కనిపించింది. అయితే రిషబ్ పంత్(15), రఘువంశీ(11) నిరాశపరిచారు. మార్క్‌రమ్(25 బంతుల్లో 31నాటౌట్), హిమ్మత్ సింగ్(31 బంతుల్లో 40నాటౌట్) స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడడంతో లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 రన్స్ సాధించింది.

## రన్నరప్‌గా మానస్ ధమ్నే

**కజకిస్తాన్:** భారత యువ టెన్నిస్ సంచలనం మానస్ ధమ్నేకు తొలి ఏటీపీ ఛాలెంజర్ సింగిల్స్ టైటిల్ తృటిలో చేజారింది. కజకిస్తాన్‌లోని షిమ్కెంట్‌లో జరిగిన హోరాహోరీ ఫైనల్లో బెల్జియంకు చెందిన బవైసర్ చేతిలో మానస్ ఓటమి పాలయ్యాడు. రెండు గంటల పాటు సాగిన ఈ తుది పోరులో 18 ఏళ్ల మానస్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ 6-7, 4-6 స్కోరుతో పరాజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. సోమవారం విడుదల కానున్న నూతన ర్యాంకింగ్స్‌లో ఈ యువ ఆటగాడు మానస్ తొలిసారిగా టాప్-400లోకి ప్రవేశించనున్నాడు.



## సిన్నర్ ఖాతాలో ఐదో మాస్టర్స్ టైటిల్

**మాడ్రిడ్:** మాడ్రిడ్ క్షపెనర్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సిన్నర్ టైటిల్ సాధించాడు. ఈ విజయం ద్వారా పురుషులటెన్నిస్‌లో అద్భుతం చేశాడు. గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనత అందుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ తర్వాత అగ్రశ్రేణి టోర్నీలుగా పరిగణించే మాస్టర్స్ సిరీస్‌లో సిన్నర్ వరుసగా ఐదో టైటిల్ గెలుపొందాడు.



మాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్... మూడో సీడ్ జర్మనీ ప్లేయర్ జ్వెరెవ్‌పై 6-1, 6-2తో అలవోకగా విజయం సాధించాడు. తొలి సెట్‌లో జ్వెరెవ్ సర్వీసులను పలుసార్లు బ్రేక్ చేసి 6-1తో నెగ్గిన సిన్నర్... రెండో సెట్‌లోనూ కూడా ఎదురులేకుండా కొనసాగాడు. సిన్నర్ ఏస్‌లు, బలమైన స్మాష్‌ల ముందు జ్వెరెవ్ నిలవలేకపోయాడు. ఈ టైటిల్ ద్వారా 36 ఏళ్ల చరిత్ర కలిగిన మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో వరుసగా ఐదు టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో మూడుసార్లు జొకోవిచ్ (సెర్బియా), రాఫెల్ నాదల్ (స్పెయిన్) ఒకసారి వరుసగా నాలుగు మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ సాధించారు. గత ఏడాది పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన సిన్నర్... ఈ ఏడాది మోంటెకార్లో, మయామి, ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో విజేతగా నిలిచాడు. చాంపియన్ సిన్నర్‌కు 11 కోట్ల 21 లక్షల ప్రైజ్‌మనీతోపాటు వెయ్యి ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# ఈక్విటీ మార్కెట్లకు ఎన్నికల జోష్

**ముంబయి, మే 4:**ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈక్విటీ మార్కెట్లకు జోష్ లభించింది. వీటికితోడు ఆటోసేల్స్ డేటా, బెంగాల్ ఎన్నికలు, నాలుగోత్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. నిఫ్టీ సూచీ 24,300 మార్కును ప్రారంభంలోనే నమోదు చేసింది. చివరిలో 24,100వద్ద ముగిచింది. మెటల్, హెల్త్‌కేర్ స్టాక్స్ మద్దతుపలికాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కూడా సానుకూలంగా కనిపించింది. అమెరికా ప్రాజెక్టు ఫ్రీ పేరుతోహార్ముజ్ కార్యాచరణ ఇన్వెస్టర్లలో కదలిక తెచ్చింది. బ్రెంట్ ముడిచమురు ధరలు డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా కట్టడికావడం కొంత కలిసొచ్చింది.బిఎస్‌ఇ సెన్సెక్స్ 355.90పాయింట్లు పెరిగి 77,269.40 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 121.75 పాయింట్లు పెరిగి 24,119.30పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపింది. రిలయన్స్ 2.24శాతం,ఎల్అండ్‌టి 2.18 శాతం,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.87శాతం చొప్పున పెరిగి సూచీలకు మద్దతిచ్చాయి.

బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.62శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.07శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 2470 షేర్లుపెరిగితే 1778షేర్లు క్షీణించాయి.245కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.09క్షీణించి 7.012 శాతంతో నడిచాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి 95.24 వద్ద కదలాడింది. అంతకు ముందురోజు 94.84వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్లు 1.09శాతం క్షీణించి రూ.1,49,709కి చేరింది. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు జులై సెటిల్‌మెంట్లు 5.36 డాలర్లుపెరిగి బ్యారెల్ ఒక్కింటికి 113.53 డాలర్లుగా కొనసాగింది. ఆటో సేల్స్ విజృంభించడంతో షేర్లుకూడా గణనీయంగా పెరిగాయి. కొన్ని కంపెనీలు క్షీణించాయి. హీరో మోటోకార్ప్ 0.66శాతం క్షీణిస్తే టాటామోటార్స్ 0.73శాతంపెరిగింది.ఐషర్‌మోటార్స్ 3.08శాతం ,మహీంద్ర0.24శాతం,మారుతిసుజుకి ఇండియా 2.02 శాతం, అశోక్ లేల్యాండ్ 0.86 శాతం, టివిఎస్ మోటార్ కంపెనీ 0.26శాతం, బజాజ్ ఆటో 1.44శాతం, విఎస్‌టి టిల్లర్లు ట్రాక్టర్లు 0.02శాతం చొప్పున పెరిగాయి. అతుల్ ఆటో 1శాతం పెరిగింది. అమ్మకాల్లో 73.97శాతం నమోదుకావడమే ఇందుకు కీలకం. ఎస్కార్ట్స్ కుబోటా మాత్రం 0.81శాతం క్షీణించింది. స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ 2.02శాతం పెరిగింది. ఎస్ఎంఎల్ మహీంద్ర 1.02శాతం క్షీణించడం గమార్హం. ఇక కోటక్ బ్యాంకు 2.82శాతం క్షీణించింది. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ 6.97శాతం పెరిగింది. కంపెనీ నికరలాభాలు 1290.47 కోట్లకు పెరగడమే ఇందుకు కీలకం. వాలార్ ఎస్టేట్ 19.98శాతం పెరిగింది. అవన్యూసూపర్‌మార్ట్స్ 4.72శాతం క్షీణించింది. ఈక్విటాస్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 6.15వాతంపెరిగితే ఆదాని పోర్టులుసెజ్‌లు 5.30శాతం, గోద్రెజ్‌ప్రాపర్టీస్ 3.54శాతం, ఎన్ఎండిసి 1.41శాతం, ఎపిల్ అపోలో ట్యూబ్స్ మైనస్ 1.59శాతం చొప్పున నమోదు కాగా ఇండస్ టవర్స్‌కూడా 2.43శాతం,సెంట్రల్ డిపా జిటరీ సర్వీసెస్ 2.36శాతం చొప్పున క్షీణించాయి.

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




## ఆదిత్యబిర్లా కేపిటల్ నికరలాభం 1129 కోట్లు

**ముంబయి, మే 4:** ఆదిత్యబిర్లా కేపిటల్ సోమవారం నికర లాభాల్లో 31శాతం వృద్ధిని ప్రకటించింది. వడ్డీ ఆదాయం గణనీయంగా పెరగడంతో 31శాతం పెరిగి రూ.1129 కోట్లకు చేరింది. ఆర్థికసేవల కంపెనీ మొత్తం కార్యకలాపాలద్వారా జనవరి మార్చి త్రైమాసికంలో గత ఏడాది రూ.865 కోట్లుమాత్రమే ఆర్జించింది.నికరవడ్డీ ఆదాయం రూ.5516 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో రూ.4481 కోట్లు మాత్రమే రాబట్టు కోగలిగిన కంపెనీ ఈసారి గణనీయంగా పెంచు కోగలిగింది. మొత్తం రాబడులు 12,214 కోట్లనుంచి 13వేల 549 కోట్లకు పెరిగింది. ఇక పూర్తి సంవత్సరానికిగాను ఆదిత్య బిర్లా కేపిటల్ 3764 కోట్లు లాభం సాధించింది. గత ఏడాది 3332 కోట్లనుంచి 13శాతంపెంచుకోగలిగింది. మొత్తం రాబడులు సంవత్సరంలో రూ.45,509 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది రూ.40,590 కోట్ల నుంచి గణనీయంగాపెంచుకుంది. ఆర్థికఫలితాలు గణనీయంగా మెరుగుపడటంతో ఆదిత్యబిర్లా కేపిటల్ షేర్లు 348.10 రూపాయలుగా ట్రేడ్ అయ్యాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ హోదాలో ఎబిసి పలు రంగాల్లో విస్తరించింది. ఎస్ఎంఇ, రిటైల్ రుణాల్లో భారీ వృద్ధిని నమోదుచేసుకుంది.

## 41శాతం పెరిగిన జిందాల్ స్టెయిన్‌లెస్ లాభం

**ముంబయి, మే 4:** జిందాల్ స్టెయిన్‌లెస్ సోమవారం ప్రకటించిన ఆర్థిక ఫలితాల్లో 41 శాతం వృద్ధిని నమోదు చేసింది. నాలుగో త్రైమాసికంలో రూ.834.21 కోట్లు లాభం ఆర్జించినట్లుప్రకటించింది.ఏడాది క్రితం 589.96 కోట్లు ఆర్జించి కంపెనీ ఈసారి గణనీయంగా లాభాన్ని పెంచుకుంది. కంపెనీ మొత్తం రాబడులురూ.11,427.91 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేకాలంలో 10,292.27 కోట్లుమాత్రమే ఆర్జించిన కంపెనీ ఈసారి రాబడులు కూడా పెంచుకోగలిగింది. అలాగే పూర్తి సంవత్సరానికిగాను కంపెనీ నికరలాభాలు రూ.2499.72 కోట్లనుంచి రూ.3184 కోట్లుగా నమోదుచేసుకుంది. మొత్తం రాబడులు కూడా రూ.39,603.06 కోట్లనుంచి రూ.43,306.14కోట్లు తెచ్చుకోగలిగింది. ఉక్కురంగంలో అద్వితీయంగా ఎదుగుతున్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఈసారిఆర్థికఫలితాలను మెరుగుపరుచుకోవడంలో సఫలీకృతం అయింది.

## 39 పైసలు క్షీణించిన రూపాయి



**ముంబయి, మే 4:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్ టైమ్ కనిష్టానికి చేరుకున్నాయి. 39 పైసలు క్షీణించి సోమవారం మార్కెట్‌లో 95.23వద్ద ట్రేడింగ్ కొనసాగింది.మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి, ముడిచమురు ధరల్లో పెరుగుదల, దిగుమతుల చెల్లింపులు పెరగడంతో రూపాయి భారీగా క్షీణించింది. బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 110 డాలర్లుగా పెరుగుతూ పోయింది.

భౌగోళిక ఉద్రిక్తతలతో విదేశీ నిధులు మార్కెట్ల నుంచి ఎక్కువ భాగం విత్‌డ్రా అయ్యాయి. ఇంటర్ బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో రూపాయి 94.95వద్ద ప్రారంభం అయింది. ట్రేడింగ్ ఆసాంతం క్షీణిస్తూనే ఉంది. చివరకు 95.23వద్ద స్థిరపడి 39పైసలు క్షీణించిందని తేలింది. అంతకు ముందురోజు 94.84 వద్ద నమోదయిన సంగతి తెలిసిందే. రానున్న కాలంలో 95.35 నుంచి 95.70వరకూ కూడా వెళ్లవచ్చని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అనలిస్టు దిలీప్ పర్మార్ తెలిపారు. ఇక దేశీయ ఈక్విటీ ఫ్రంట్‌పరంగా సెన్సెక్స్ 355.90 పాయింట్లుపెరిగితే నిఫ్టీ కూడా 121.75 పాయింట్లుపెరిగింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లనుంచి రూ.8047.86 కోట్లు విత్‌డ్రాచేసారు. దీనితో పెట్టుబడులు విత్‌డ్రాతో డాలర్ చెల్లింపులు పెరగడం, ముడిచమురుధరలకు కూడా చెల్లింపులు డాలర్లతోనే జరుగుతుండటంతో డాలర్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగి చెలామణిలో రూపాయి క్షీణించింది.

## టాటా టెక్నాలజీస్ రాబడులు రూ.1572.22 కోట్లు

**ముంబయి, మే 4:** టాటాగ్రూప్‌లోని టాటా టెక్నాలజీస్ సంస్థ నికరలాభాలు 8శాతం పెరిగాయి. నాలుగోత్రైమాసికంలో రూ.204.17 కోట్లు సాధించింది.అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.188.87 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈసారి మరింతగాపెరిగింది. రాబడులు కూడా 1285.65 కోట్లనుంచి రూ.1572.22 కోట్లు ఆర్జించింది. మొత్తం వ్యయాలు నాలుగోత్రైమాసికంలో రూ.1088.2కోట్లనుంచి రూ.13,82.62 కోట్లు ఆర్జించింది. పూర్తి సంవత్సరంలో ఆదాయం రూ.5168.45కోట్లనుంచి 5505.57 కోట్లకు పెంచు కోగలిగింది. మూడో త్రైమాసికం నుంచి నాలుగో త్రైమాసికంలో కంపెనీ మంచి ఫలితాలను రాబట్టిందని ఎండి సిఇఒ వారెన్ హ్యారిస్ అన్నారు. 2027సంవత్సరంలోకూడా రెండంకెల వృద్ధితో ముందుకువెళతామన్నారు.కంపెనీ బోర్డు తుదివిడత డివిడెండ్ ప్రతి వాటాకు రూ.8.35 ప్రకటించింది.ప్రత్యేక డివిడెండ్‌రూపంలో ఈక్విటీ వాటాకు రూ.3.35 చొప2న ప్రకటించింది.




## ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ స్వల్పంగా రికవరీ

**ముంబయి, మే 4:** భారత్ ఉత్పత్తిరంగ కార్యకలాపాలు ఏప్రిల్‌లో స్వల్పంగా రికవరీ అయ్యాయి. కొత్త ఆర్డర్లు వచ్చిపడుతున్నప్పటికీ నాలుగేళ్ల కనిష్ఠస్థాయిలోనే ఉన్నాయి. ఎచ్ఎస్‌బిసి భారత్ ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ 53.9 పాయింట్లనుంచి 54.7 పాయింట్లకు పెరిగింది. గడచిన నాలుగేళ్లలో చూస్తే రెండోసారి స్వల్ప స్థాయిలో వృద్ధిని నమోదుచేసింది. 50 పాయింట్లకు పైబడితే వృద్ధితగ్గితే తిరోగమనంగా పిఎంఐ సూచీలు పరిగణిస్తారు.

అంతకుముందు నెలతో పెరిగినప్పటికీ ఏప్రిల్ వృద్ధి మాత్రం స్వల్పస్థాయి లోనే ఉన్నదని హెచ్ఎస్‌బిసి భారత్ చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజుల్ భండారి అన్నారు. మార్చి నెలతో పోలిస్తే కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి కొంత ఊతం ఇచ్చాయని ఆయన అన్నారు. అయితే సూచీలు మాత్రం మూడున్న రేళ్లతో పోలిస్తే తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు కొంత ప్రభావితం చేసినట్లు తెలిపారు.

క్లయింట్లనుంచి గ్రీన్‌సిగ్నల్ రావడం కూడా లేట్ అయింది.ఉత్పత్తి వ్యయాలు 2022 ఆగస్టు నుంచి కూడా గణనీయంగాపెరిగాయి. ఇక ఉత్పత్తి రేట్లు కూడా గడచిన ఆరునెలలతో పోలిస్తే ఆశాజనకంగానే పెరిగినట్లు భండారి పేర్కొన్నారు. అయితే ఈ వృద్ధి స్వల్పస్థాయిలోనే ఉందని అందువల్ల భారత ఉత్పత్తిరంగానికి వచ్చిన భారీ ముప్పు ఏమీలేదన్నారు. కొత్త ఎగుమతి ఆర్డర్లపరంగా చూస్తే ఏడునెలల గరిష్ఠంగా ఉన్నాయి ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జపాన్, కెన్యా, చైనామెయిన్‌లాండ్, సౌదీ అరేబియా, యుఎఇ, యుకెలనుంచి ఆర్డర్లు చెప్పుకోదగిన స్థాయిలోనే ఉన్నాయి.ఇక వ్యయం పరంగా చూస్తే కంపెనీలు అల్యూమినియం, రసాయనాలు, విద్యుత్ విడిభాగాలు, ఇంధనం, తోళ్లు, పెట్రోలియం ఉత్పత్తులు, రబ్బర్ వంటి వాటిలో ధరలు పెరిగాయన్నారు.



44 నెలల్లో ఎన్నడూలేనంతగా ముడివనరుల వ్యయం పెరిగిందని హెచ్ఎస్‌బిసి భారత్ చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజుల్ అన్నారు. 400 ఉత్పత్తి రంగ సంస్థలను విశ్లేషించిన అనంతరం వాటిని క్రోడీకరించి పిఎంఐ సూచీ తయారుచేస్తుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.